Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 02 | సంచిక : 162 | మంగళవారం | మే 19, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 162 | Tuesday | 19 MAY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## నార్వేకు చేరుకున్న ప్రధాని మోడీ

ఓస్లో : విదేశీ పర్యటనలో భాగంగా సోమవారం ప్రధాని మోడీ నార్వేకు చేరుకున్నారు. విమానాశ్రయంలో మోడీకి నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్ ఘనంగా స్వాగతం పలికారు. నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని మోడీ తొలిసారి నార్వే చేయడం గమనార్హం.

- మిగతా 2లో..



## చైనాలో భారీ భూకంపం

బీజింగ్ : చైనాలో సోమవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 5.2గా నమోదైంది. సోమవారం తెల్లవారుజామున చైనా నైరుతి ప్రాంతమైన గ్వాంగ్జీలో సంభవించిన భూప్రకంపనల వల్ల ఇద్దరు మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన వల్ల గ్వాంగ్జీలోని ప్రధాన నగరమైన లియుజౌలోని 7,000 మందికి పైగా ప్రజలను రెస్క్యూ సిబ్బంది అక్కడి నుంచి ఖాళీ చేయించారు.

- మిగతా 2లో..

# సమాచార శాఖలో ఏం జరుగుతోంది..?

- అడిషనల్ డైరెక్టర్ కుర్చీ ఎవరి వశం కానుంది..
- 50 మంది కోసం 1200 మందితో విభేదిస్తారా..
- ఇంజినీరింగ్ వర్సెస్ పీఆర్ అయ్యిందా..
- ఎవరి త్యాగంతో అడిషనల్ డైరెక్టర్ పోస్టు క్రియేట్ అయ్యింది..
- ఏ త్యాగం చేసారని సిఐ ఈ కి ఏడి కుర్చీ కట్టబెడతారని ప్రశ్నలు..
- పీఆర్ లో అంతర్గత విభేదాలు ఉన్నా..
- ఒకే తాటిపైకి పీఆర్ వింగ్ వచ్చేసిందా..
- అసలు ఇంజినీరింగ్ విభాగం ఉందని ప్రజలకు తెలుసా..
- నాటి కమిషనర్ టీవీకే రెడ్డి చేసింది తప్పా ఒప్పా..
- పరిపాలన సౌలభ్యం పీఆర్‌కు ప్రాణ సంకటంగా మారిందా..
- ఈ కొత్త సంప్రదాయంతో పీఆర్ అస్తిత్వం కోల్పోనుందా..
- ప్రభుత్వం ఎటు వైపు మొగ్గుచూపుతుంది..
- లా డిపార్ట్మెంట్ ఏమి చెబుతోంది..
- ఒక పోస్టు...వందల అనుమానాలు..
- ప్రమోషన్స్ కోసం పీఆర్ ఇంజనీరింగ్ పోటా పోటీలు..
- ప్రజా బాహుల్యంలో ఉండేది పీఆర్ నా...ఇంజనీరింగ్ నా..
- ఎవరితో లాభం..ఎవరితో ఖేదం..



(రామమోహన్ రెడ్డి)

సమాచార పౌర సంబంధాల శాఖ అనేది ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మరియు విధానాలను ప్రజలకు వివరించడానికి మరియు ప్రజల స్పందనను ప్రభుత్వానికి తెలియజేయడానికి మధ్య వారధిగా పనిచేసే ఒక కీలకమైన ప్రభుత్వ విభాగం.అయితే అదే విభాగంలో విభజనలు జరుగుతూ భిన్నమైన అభిప్రాయాలు కలిగి విభిన్నమైన ఆలోచనలతో అదే శాఖలో అడిషనల్ డైరెక్టర్ కుర్చీలాట కోసం కుస్తీ పడుతున్నాయి అక్కడి రెండు వర్గాలు.సాధారణంగా జన బాహుళ్యం లో కానీ ఆటు మెజారిటీ అధికార వర్గాలకు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది అంటే అంతా ఒకటే కదా అన్న భావన కలుగుతుంది. కానీ అక్కడ కూడా రెండు విభాగాలు ఉన్నాయని ఇప్పుడిప్పుడే బహిర్గతం అవుతున్నాయనేది యాదార్థం.అందుకు కారణాలు లేక పోలేదు.అడిషనల్ డైరెక్టర్ కుర్చీలాటలో హోరా హోరీగా తలపడుతున్న పీఆర్ వింగ్ ఇంజనీరింగ్ వింగ్ ల పోటీ తత్వం తో ముఖ్యమంత్రి కార్యాలయం వరకు చేరి అక్కడ ఉన్న న్యాయ విభాగంలో కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారడం మూలాన ఇప్పుడు సమాచార శాఖ లో రెండు విభాగాలు ఉన్నాయా అన్న ఆలోచనలు వస్తున్నాయి.

అయితే ఇక్కడ ఏ శాఖ కు ఏడి కుర్చీ కేటాయించాలనేది ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్ గా మారింది. కారణం సమాచార శాఖ అనేది ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారి ఈ కుర్చీలాటలు మొదలు కావడమనేది వింతగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సీనియారిటీ ప్రకారం పీఆర్ విభాగానికి చెందిన వారు రెండు జాయింట్ డైరెక్టర్ పోస్టుల ను సరెండర్ చేస్తే అడిషనల్ డైరెక్టర్ పోస్టు ,రెండు డార్క్ రూమ్ లను సరెండర్ చేస్తే చీఫ్ ఫోటో గ్రాఫర్ పోస్ట్ క్రియేట్ చేయడం జరిగిందనేది పీఆర్ వింగ్ వారి నుండి వినిపిస్తున్న వాదన. కానీ ఇంజనీరింగ్ విభాగంలో ఏ పోస్ట్ సరెండర్ చేయక పోగా పంచాయితీ రాజ్,ఆర్ అండ్ బి శాఖలకు సమాన మైన వేతనాలు తీసుకుంటు కేవలం యాభై మంది ఉన్న ఇంజనీరింగ్ వింగ్ కు అడిషనల్ డైరెక్టర్ పోస్ట్ కేటాయించాలనే ప్రతిపాదనలు కాదుగా ఆలోచన చేయడం కూడా సరియైన నిర్ణయం కాదనే వాదనలు గట్టిగా 1200 వందల మంది ఉన్న పీఆర్ వింగ్ నుండి బలంగా వినిపిస్తున్నాయి.

2 పేజీలో..

## వేటకు విరామం.. సర్కారు సాయం

### గంగపుత్రులకు రెండో ఏడాది అండగా ప్రజాప్రభుత్వం

- 'మత్స్యకారుల సేవలో' కింద ప్రతీ కుటుంబానికి రూ.20 వేలు జమ
- 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ది
- కావలిలో నిధులు విడుదల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది.

- మిగతా 2లో..

నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

2 పేజీలో..

## మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి లేదు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు దేశ ఆర్థిక వ్యవస్థ గురించి దాచిపెట్టిందని ఖర్గే ఆరోపించారు.

ఆదివారం వాహనాలకు వినియోగించే గ్యాస్ ధరను కిలోకి రూపాయి మేర కేంద్రం పెంచింది. కేవలం ఒక్క వారంలోనే సిఎన్‌జి గ్యాస్ ధర పెంచడం రెండోసారి కావడం గమనార్హం. మొత్తంగా సిఎన్‌జి గ్యాస్ ధర కిలోకి మూడు రూపాయల చొప్పున పెరిగిన నేపథ్యంలోనే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.కాగా, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు గనుక ప్రధాని మోడీ పెట్రోల్, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ఉంటే..

2 పేజీలో..



## అవినీతిని ప్రశ్నిస్తే కేసులా..!

- రెండేళ్ల లోనే చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయం
- భూములిచ్చిన రైతులకు అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊర్కోబోం
- మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో ప్రజా సంపద లూటీ
- రాజధాని నిర్మాణాల్లో కొత్తగా జరుగుతున్న అద్భుతాలు లేవు
- 2019కి ముందు పూర్తయిన వాటికే రంగులేసి ఎల్లో మీడియాలో తిప్పుతున్నారు
- అమరావతి నుంచి రోజూ వెయ్యి టిప్పర్ల నల్ల మట్టిని బయటకు తరలిస్తున్నారు
- చంద్రబాబు మౌఖిక ఆదేశాలతోనే టీడీపీ ఎమ్మెల్యేల మట్టి వ్యాపారం
- రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంకెప్పుడిస్తారు?
- ఆ లేఅవుట్‌లలో పనులు ఎందుకు జరగడం లేదు?
- అమరావతిపై నా ఆరోపణలు తప్పైతే ఎందుకు ఖండించడం లేదు?
- మాజీమంత్రి పేర్ని నాని

2 పేజీలో..

## ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు.



- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు
- పోలవరం ఎడమ కాల్వ-చంపావతి లింక్ పై అధ్యయనం
- 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి
- జలధార-జలహరతి పనులకు అధిక ప్రాధాన్యత
- సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటి విడుదల
- ఇరిగేషన్ క్యాలెండర్ లో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత
- జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా... ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో

- మిగతా 2లో..

## రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేసిన అంబటి రాంబాబు

- ఇంధన ధరల పెంపుపై నిరసన కార్యక్రమం చేపట్టిన అంబటి
- దేశంలో ఏపీలోనే అత్యధిక ఇంధన ధరలు ఉన్నాయని విమర్శ
- ప్రజల కష్టాలు వారికి పట్టడం లేదని ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి, గుంటూరు : పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసీపీ గుంటూరులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో అంబటి రాంబాబు స్వయంగా రిక్షా తొక్కుతూ వినూత్న రీతిలో తన నిరసనను వ్యక్తం చేశారు.



అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలోని ఇతర అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఇంధన ధరలు అత్యంత ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు.

2 పేజీలో..

## అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోము

### టివికె ప్రభుత్వానికి స్టాలిన్ హెచ్చరిక



చెన్నై : తమిళ వెట్రి కజగం నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి తమ పార్టీ డిఎంకె సహకరిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు ఎం.కె స్టాలిన్ అన్నారు. అయితే వారిపై అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోమని టివికె ప్రభుత్వాన్ని స్టాలిన్ సోమవారం హెచ్చరించారు. 'టివికె ప్రభుత్వానికి డిఎంకె ఎలాంటి అవాంతరాలు సృష్టించదు' అని స్టాలిన్ హామీనిచ్చారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే అధికార పార్టీ వారిపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని డిఎంకె పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.కాగా, 'కొత్త ప్రభుత్వం ఏర్పడింది. మేము వారికి ఇబ్బందిగా ఉండము. వారిని పరిపాలించనివ్వండి. కానీ, తమ అసమర్థతను కప్పిపుచ్చు కోవడానికి వారు మాపై నిందారోపణలు చేస్తే ఊరుకోము.

2 పేజీలో..

## ప్రాధాన్యతా క్రమంలో
# పనులు పూర్తి చేయాలి

చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

**నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు :** సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని...నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు.. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రీనీవా ఫేజ్ 1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం- పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తాను. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధార-నాగావళి-చంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గడ్డ నుంచి చంపావతి లింక్ కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి."అని సీఎం సూచించారు.

**వెలిగొండకు హై ప్రయార్టీ :** "వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కల్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరి-కావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**ఖరీఫ్ కు నీరిచ్చే అంశంపై జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం :** "ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలి. నీటి భద్రత అత్యంత కీలకమనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండేది. తుపాన్లు ప్రభావం వల్ల పంటనష్టానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చేది. పట్టిసీమ ద్వారా గతంలో నీరిచ్చాం. ఈసారి సీజన్ ను ముందుకు తీసుకువచ్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. వాటర్ మేనేజ్మెంట్ లో ఇది కీలకమైన అంశం. మైక్రో ఇరిగేషన్ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలి. ప్రస్తుతం వ్యవసాయం కోసం సుమారు రూ. 17 వేల కోట్ల మేర విద్యుత్ ఖర్చులను భరిస్తున్నాం. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అప్పుడు ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతోంది. అందుకే నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**గత పాలకుల నిర్వాకం వల్ల నిర్వీర్యమైన లిఫ్ట్ స్కీంలు :** ఇరిగేషన్ రివ్యూలో భాగంగా లిఫ్ట్ స్కీంల పనితీరు మీద ముఖ్యమంత్రి సమీక్షించారు. 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం లిఫ్ట్ స్కీంలకు అవసరమైన కేటాయింపులు జరిపేదని...అలాగే మరమ్మత్తులకు తగినన్ని నిధులు వెచ్చించే వాళ్లని అధికారులు తెలిపారు. అయితే 2019-24 మధ్య కాలంలో లిఫ్ట్ స్కీంలకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరపలేదని అధికారులు సీఎంకు వివరించారు. దీని వల్ల సుమారు 362 లిఫ్ట్ స్కీంలు నిర్వీర్యం అయ్యాయని అధికారులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. లిఫ్ట్ స్కీంలను పునరుద్ధరించే అంశంపై చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రస్తుతం 156 లిఫ్ట్ స్కీంలు సంపూర్ణంగా... 505 స్కీంలు పాక్షికంగా పని చేస్తున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. లిఫ్ట్ స్కీంలను గాడిలో పెట్టేలా పని చేయాలని సీఎం సూచించారు. గతంలో సుమారు 10 లక్షల ఎకరాలకు లిఫ్ట్ స్కీంల ద్వారా సాగునీటిని అందించే పరిస్థితి ఉండేదని సీఎం గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థలు నిర్వీర్యం కాకూడదని... వీటిని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సమీక్ష సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవనరులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి లేదు

ఆయన గణనీయమైన నష్టాలను చవిచూసేవారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల వరకు అన్ని విషయాలను దేశానికి తెలియకుండా దాచిపెట్టింది. కానీ ఎన్నికలు ముగియగానే అన్నింటి ధరలను పెంచేసింది. అసలు మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి లేదు. అందుకే వారు ధరల పెరుగుదలను ముందుగా ఊహించలేకపోయారు. బిజెపి ప్రభుత్వం కారణంగానే ద్రవ్యోల్బణం నిరంతరం పెరుగుతుంది. ఈ విషయాన్ని మేము లేవనెత్తుతాము. దేశంలోని పేదలు ధరల పెరుగుదలతో వారికి అవసరమైన నిత్యావసర వస్తువుల్ని కూడా పొందలేకపోతున్నారు అని ఖర్గే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో

## సమాచార శాఖలో
# ఏం జరుగుతోంది...?

మొదటి పేజీ తరువాయి

అయితే గత ప్రభుత్వం లో పాలనా పరమైన విధానంలో భాగంగా అప్పటి కమిషనర్ తుమ్మా విజయ కుమార్ రెడ్డి జిల్లాల పునర్విభజన సందర్భంగా పీఆర్ వింగ్ ఇంజనీరింగ్ వింగ్ ను కలపడం మూలాన ఇప్పుడు పీఆర్ వింగ్ కు తమ అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందని ఇది గత కమిషనర్ చేసిన నిర్ణయంతో పీఆర్ వింగ్ కు ప్రాణ సంకటంగా మారిందనే ఆవేదనతో కూడిన ఆరోపణలు పీఆర్ వింగ్ నుండి బహిర్గతమ వుతున్నాయని చెప్పాలి

కాగా ప్రస్తుతం రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో గత నెల ముప్పై న ఇంచార్జ్ హోదాలో ఉన్న అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత ఉద్యోగవిరమణ పొందిన ఆ కుర్చీలో సీనియర్ అధికారులు ఉన్నా వారికి కనీసం ఇంచార్జ్ గా కూడా బాధ్యతలు అప్పగించకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటీ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అడిషనల్ డైరెక్టర్ ఓ నాలుగు రోజులు సెలవు లో ఉంటేనే ఆ బాధ్యతలు ఇచ్చిన డైరెక్టరేట్ నేటికి పంతొమ్మిది రోజుల కావస్తున్న ఆ సీటు పై పీఆర్ వింగ్ గురించి ఆలోచించకపోవడం వెనుక భలమైన కారణాలు ఏవో ఉన్నాయన్న పీఆర్ వింగ్ నుండి వినిపిస్తున్నాయి.

అంటే ప్రభుత్వం లో ఉన్న కొంతమంది పెద్ద మనుషుల ప్రమేయం కారణంగా కొన్ని లోపాయి కారి ఒప్పందాల మూలాన ఇంజనీరింగ్ వింగ్ ను నెత్తిన పెట్టుకోవాలని చూస్తున్న ఒక విభాగం పీఆర్ వింగ్ కు అడిషనల్ డైరెక్టర్ పదవి లో ఇంచార్జ్ ఇచ్చి కూర్చోబెడితే ఆ తరువాత పీఆర్ వింగ్ వారే సీనియారిటీ ప్రాతిపదికన అడిషనల్ డైరెక్టర్ సీటు సొంతం చేసుకుంటారనే ఆలోచనలో భాగంగా ఆ సీటు ను అలాగే వదిలేసారన్న భావన ఆయా శాఖ అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. మరి ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పీఆర్ వర్గానికి కేటాయిస్తే ఇంజనీరింగ్ విభాగం వ్యతిరేకంగా పోరాటం చేయాలని చూస్తున్న మెజార్టీ ఎక్కువ భాగం ఉన్న పీఆర్ వింగ్ కు అన్యాయం జరిగితే ఆవింగ్ మొత్తం కూడా ఏక తాటిపైకి వచ్చి అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,భావి ముఖ్యమంత్రి నారాలోకేశ్ తలుపులు తట్టేందుకు సిద్ధమవుతున్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అనాదిగా వస్తున్న విధానాన్నే పాటిస్తుందా కొత్త సంప్రదాయానికి తెరలేపి న్యాయపరమైన సమస్యలతో పాలనా పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటుందా అన్నది తెలియాలంటే మరికొంత కాలం వేచిచూడాలి మరి.

# అవినీతిని ప్రశ్నిస్తే కేసులా...!



**ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి :** వైయస్సార్సీపీ సోషల్ మీడియా దెబ్బకి ఈ ప్రభుత్వం గజగజ వణికిపోతోందని, అమరావతి పేరుతో చేస్తున్న భూదోపిడీని, రాజధాని నిర్మాణం ముసుగులో మొబిలైజేషన్ అడ్వాన్సుల ఇచ్చి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న విధానాన్ని ప్రజల ముందు ఉంచుతుంటే సమాధానం చెప్పుకోలేకపోతోందని కృష్ణా జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ధ్వజమెత్తారు. రెండేళ్లలోనే చంద్రబాబు ప్రభుత్వం అవినీతితో పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని ఆయన ఆరోపించారు. అమరావతిపై తనతో సహా వైయస్సార్సీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు తప్పైతే రుజువు చేయాలని, అంతే కానీ పోలీసుల ద్వారా ఆ వీడియోలను డిలీట్ చేయించడానికి మెటా, ఎక్స్‌కి నోటీసులు పంపించడం సిగ్గుచేటని తేల్చి చెప్పారు.

అమరావతిలో రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులోనూ భారీ స్కాం జరుగుతోందని, అస్మదీయులకు ఒకలా.. సాధారణ రైతులకు మరోలా ప్లాట్లు కేటాయిస్తున్నారని పేర్ని నాని వెల్లడించారు. కాబట్టే చంద్రబాబు అస్మదీయులకు సెక్రటేరియట్, అసెంబ్లీ, బైపాస్ రోడ్లకు దగ్గరలో ప్లాట్లు దక్కుతుండగా, సామాన్యులకు మాత్రం శ్మశానాలు, చెరువుల్లో ప్లాట్లు వస్తున్నాయని గుర్తు చేశారు. రాజధాని నిర్మాణం పేరుతో టీడీపీ ఎమ్మెల్యేలు జోరుగా మట్టి వ్యాపారం చేస్తున్నారని, అమరావతి నుంచి రోజూ వెయ్యి లారీల మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు.

రాజధానిలో కొత్తగా జరుగుతున్న నిర్మాణ అద్భుతాలు ఏమీ లేవని, 2019కి ముందు పూర్తయిన వాటికే రంగులేసి ఎల్లో మీడియాలో ప్రచారం చేస్తున్నారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పేర్ని నాని తెలిపారు.

**ప్రెస్‌మీట్‌లో పేర్ని నాని ఇంకా ఏం మాట్లాడారంటే" :** కాంగ్రెస్, బీజేపీ కలిసి ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేశాయి. రాజధాని నిర్మాణం జరగాలంటే 40 ఏళ్ల అనుభవం ఉన్న తానే సీఎం కావాలని ప్రచారం చేసుకుని చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చారు. 29 గ్రామాల్లో ఉన్న ఒక ప్రాంతాన్ని ఎంచుకుని 33 వేల ఎకరాల రైతుల భూమిని ల్యాండ్ పూలింగ్‌లో తీసుకుని, దాంతో పాటు ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూములు కలుపుకుని మొత్తం 54 వేల ఎకరాల్లో అమరావతి రాజధాని నిర్మాణం చేస్తామని చెప్పారు. అలా గతంలో ఐదేళ్లు, ఇప్పుడు రెండేళ్లుగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలను వంచిస్తూనే ఉన్నాడు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇంతవరకు న్యాయం జరగలేదు. అమరావతి రైతులకు కనీసం సురక్షితమైన మంచినీరు, రోడ్లు, డ్రైనేజీల గురించి ఆలోచించారా? కష్టమొస్తే ఆ భూముల మీద లోన్లు తెచ్చుకునే స్వేచ్ఛ రైతులకైనా ఉందా? రాజధానికి భూములిచ్చిన రైతుల గురించి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

అమరావతి పేరుతో జరుగుతున్న భూదోపిడీని, నిర్మాణం ముసుగులో కమీషన్ల పేరుతో చేస్తున్న అవినీతిని వైయస్సార్సీపీ ప్రశ్నిస్తుంటే ఈ ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. రైతుల బాధల పేరుతో ఎల్లో మీడియాలో చర్చలు పెట్టినా, పుంఖాను పుంఖాలుగా వార్తలు రాసినా తప్పు కాదు. మంత్రి నారాయణతో పాటు, ఐఏఎస్ అధికారులను చడామడా తిట్టినా తప్పు కాదు. కానీ వైయస్సార్సీపీ నాయకులు అవినీతి గురించి ప్రశ్నిస్తే నేరమట!.

అమరావతి రైతుల సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారాయణ, కేంద్ర మంత్రి పెమ్మసాని, సీఆర్డీఏ కమషనర్‌తో త్రీ మెన్ కమిటీ వేశారంటే సమస్యలున్నట్టే కదా? అవే సమస్యల గురించి మేం ప్రశ్నిస్తుంటే ఆ కమిటీ ఎందుకు సమాధానం చెప్పడం లేదు? మా ఆరోపణలు తప్పయితే ఎందుకు ఖండించం లేదు? ఆ పని చేయకపోగా, ఎవరినో తీసుకొచ్చి కేసులు పెడుతున్నారు.

మరీ విచిత్రంగా అమరావతి గురించి మాజీ మంత్రి పేర్ని నాని (నేను) మాట్లాడిన వీడియోలన్నీ డిలీట్ చేయాల్సిందిగా గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి అమెరికాలో ఉన్న ట్విటర్ కార్యాలయానికి మెయిల్ పెట్టారు. నేను వేసిన ప్రశ్నలు ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉంటే సీఎస్, లేదా సీఎం లేక కనీసం మంత్రి స్పందించాలి. మధ్యలో కొత్తపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎందుకొచ్చాడు? మేం మాట్లాడిన వాటిలో ఏదైనా తప్పుందా?.

వైయస్సార్సీపీ సోషల్ మీడియాను చూసి చంద్రబాబు గజగజ వణికిపోతున్నాడు. జగనన్న కనెక్ట్స్ కి అత్యంత ప్రజాదరణ ఉండటంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ హ్యాండిల్స్ లో పోస్టు చేసిన వీడియోలను డిలీట్ చేయించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అమరావతి అవినీతిని ప్రశ్నిస్తున్న వీడియోలు డిలీట్ చేయాలని పోలీసులతో ఎక్స్, మెటాకి నోటీసులు ఇప్పిస్తున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై మాట్లాడిన వీడియోలు తీసేయాలని పోలీసుల నుంచి మెటాకి నోటీసులు పంపారు. శ్రీకాళహస్తిలో జరుగుతున్న అవినీతి గురించి ఒక ఎన్నారై తన సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేస్తే దాన్ని కూడా తట్టుకోలేకపోయారు. తమకు వ్యతిరేకంగా ఏ పోస్టు కనిపించినా ఈ ప్రభుత్వం ఓర్చుకోలేక పోతోంది. సమాధానం చెప్పే ధైర్యం కూటమి నాయకులకు లేదు.

భవనాలకు అద్దాలు బిగించడానికి రూ.2540 కోట్లు కేటాయించేలా కేబినెట్‌లో తీర్మానించింది నిజం కాదా? అసలు రెండేళ్లుగా అమరావతి పేరుతో ఏం ఉద్ధరించారో చెప్పండి? 2019కి ముందే పూర్తయిన భవనాలకు రంగులేసి శరవేగంగా పనులు జరిగిపోతున్నాయని ఎల్లో మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నది వాస్తవం కాదా? ఐఏఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్స్ తప్ప అమరావతిలో 2016 నుంచి గడిచిన రెండేళ్లుగా ఏం కట్టారు? ఇప్పుడు పునాదులు తీస్తున్న కొత్త అసెంబ్లీ, సెక్రటేరియట్ బిల్డింగ్‌లకు అద్దాలు బిగించడానికి అప్పుడే రూ.2540 కోట్లకు టెండర్లు పిలవడానికి సిద్ధమయ్యారు. ఇవన్నీ మేం ప్రశ్నించకూడదా?.

దేవస్థానం టూ న్యాయస్థానం అంటూ టీవీల్లో హడావుడి చేసిన వారిలో కొందరికి పదవులిచ్చారు. వాళ్ల వెనుక కాళ్లకు చెప్పులు అరిగేలా తిరిగిన భూములిచ్చిన రైతులు మాత్రం ఇప్పటికీ సీఆర్డీఏ ఆఫీసుకి, మంత్రి నారాయణ దగ్గరికి తిరుగుతూనే ఉన్నారు. వారికి డెవలప్ చేసిన ప్లాట్లు ఎప్పుడిస్తారు? 12 రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్‌లలో ఎక్కడైనా పనులు జరుగుతున్నాయా? రైతులను శాంతపరచడానికి అనంతవరం, అబ్బరాజుపాలెం లేఅవుట్‌లలో కాస్త హడావుడి చేసి వదిలేశారు. చివరకు ప్రధాని మోదీ భూమిపూజ చేసిన లేఅవుట్‌లో పనులు చేయకుండా మెగా కంపెనీ మొబిలైజేషన్ అడ్వాన్స్ తీసుకుని వెళ్లిపోయిందని అమరావతి రైతులే చెబుతున్న వీడియోలను ఎల్లో మీడియాలో పదే ప్రసారం చేశారు. ఆ వీడియోలు కనిపించడం లేదా?

చంద్రబాబు భూదాహానికి అంతు లేకుండా పోతోంది. ఎకరం శ్మశాన భూమి ఇచ్చి ప్లాట్లు తీసుకున్నారు. టీడీపీ నాయకులు ఇనాం, ప్రభుత్వ భూములు ఇచ్చి ప్లాట్లు తీసుకుంటున్నారు. 'ఇదర్ కా మాల్ ఉదర్. ఉదర్ కా మాల్ ఇదర్' అన్నట్లు అమరావతి నుంచి నల్లమట్టి తీసుకెళ్లి విజయవాడ పరిసర ప్రాంతాలకు తరలించడం. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి అమరావతికి ఎర్రమట్టి తరలించి ఎమ్మెల్యేలు జేబులు నింపుకోవడమే రెండేళ్లుగా జరుగుతున్న తంతు. ప్రతిరోజూ సుమారుగా వెయ్యి టిప్పర్లు తరలిస్తున్నారు. చంద్రబాబు మౌఖిక ఆదేశాలతోనే ఈ దందా సాగుతున్న మాట వాస్తవం కాదా? రావెల వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం కడుతామంటున్నారు. మరి ఇప్పుడున్న గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం సంగతేంటి? ముందే కొత్త విమానాశ్రయం ఆలోచన ఉన్నపుడు గన్నవరం ఎయిర్‌పోర్ట్ విస్తరణ కోసం దాదాపు 700 ఎకరాల భూమి ఎందుకు సమీకరించినట్లు? ఆ భూములిచ్చిన రైతులకు అమరావతిలో ప్లాట్లు ఇస్తామని ఆశ చూపించారు. అమరావతిలో ఎకరం భూమి ఇచ్చిన రైతులకు 250 గజాలు కమర్షియల్, వెయ్యి గజాలు రెసిడెన్షియల్ ఇస్తామన్నారు. కానీ ఎయిర్‌పోర్టుకి విస్తరణ కోసం భూములిచ్చిన కొంతమందికి మాత్రం 450 గజాలు కమర్షియల్, వెయ్యి గజాలు రెసిడెన్షియల్ ఇస్తామన్నారు. ఈ తేడా ఎందుకు?.

సీ.అశ్వనీదత్, బెజవాడ సుప్రియ, బెజవాడ మధు, బ్రాహ్మణి, సాంబశివరావు, రమేష్ బాబు, ఆలూరు బుజ్జి, బలుసు శ్రీనివాసరావు తదితరులకు ప్రైమ్ లోకేషన్‌లో ప్లాట్లు కేటాయించారు. సామాన్యులకు ఒక న్యాయం. మీ అస్మదీయులకు మరో న్యాయమా? రైతులకు బైపాస్ దగ్గర, యూనివర్సిటీల పక్కన, అసెంబ్లీ, సెక్రటేరియట్‌లకు సమీపంలో ప్లాట్లు ఎందుకు రావడం లేదు?.

అతికొద్ది మంది టీడీపీ నాయకులు మినహా మెజార్టీ రాష్ట్ర ప్రజలు అమరావతి తమది కాదని నిర్ణయానికొచ్చారు. మొత్తంమీద ఈ ప్రభుత్వం పతనం తప్పదని పవన్‌కళ్యాణ్ కూడా గుర్తించాడు. అందుకే 'జై అమరావతి' కాకుండా 'జై ఆంధ్ర' అని కొత్తరాగం అందుకున్నాడని మాజీ మంత్రి పేర్ని నాని గుర్తు చేశారు.

# నార్వేకు చేరుకున్న ప్రధాని మోడీ

మే 19న 3వ ఇండియా - నార్డిక్ శిఖరాగ్ర సమావేశం ఓస్లోలో జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకే మోడీ సోమవారం (మే 18) ఓస్లోకి చేరుకున్నారు.కాగా, ఇటీవల యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ) ఒప్పందం నేపథ్యంలో భారత్.. నార్వే స్నేహానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తాను విశ్వాసంతో ఉన్నానని ప్రధాని మోడీ అన్నారు.

# చైనాలో భారీ భూకంపం

రెస్క్యూ సహాయక సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ భూకంపానికి బహుళ అంతస్తుల 13 భవనాలు కూలిపోయాయి. రైల్వే లైన్లు తెగిపోయాయి. వీటితోపాటు రోడ్లు కూడా ధ్వంసమయ్యాయి అని ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. అయితే భూకంప ప్రభావిత ప్రాంతంలో కమ్యూనికేషన్, విద్యుత్ లైన్లు, నీటి, గ్యాస్ సరఫరా, ట్రాఫిక్ సాధారణంగా పని చేస్తున్నాయని ప్రభుత్వ మీడియా నివేదించింది.

# అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోము

మేము వాటికి వివరణలు ఇస్తాము. వారు సోషల్ మీడియాలో అబద్దాలు ప్రచారం చేస్తే మేము నిజాన్ని బయటపెడతాము. నిజాల్ని బయటపెట్టేందుకు డిఎంకె పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అభ్యర్థిస్తున్నాను' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.



# రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేసిన అంబటి రాంబాబు

ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు చెప్పిన 'సంపద సృష్టి', 'సుపరిపాలన' అంటే ఇదేనా అంటూ నిలదీశారు.

నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర పన్నులను తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేస్తామని హామీలు గుప్పించిన నారా లోకేష్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా ప్రజలను నట్టేట ముంచారని అంబటి రాంబాబు మండిపడ్డారు.ప్రస్తుత ప్రభుత్వానికి కేవలం కమీషన్లు వచ్చే పనులపైనే శ్రద్ధ ఉందని, ప్రజల కష్టాలు వారికి పట్టడం లేదని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు ప్రజలకు చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని విమర్శించారు. ఒకవైపు ఇంధన ధరల భారంతో సామాన్యుడు నలిగిపోతుంటే, మరోవైపు ఆర్టీసీ, మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. తక్షణమే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకపోతే వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కేవలం వైసీపీ నేతలపైనే కాకుండా, టీడీపీతో కలిసి ఉన్న జనసేన పార్టీ నేతలపై కూడా అమలు చేస్తున్నారని ఆరోపించారు. ముట్లూరులో జరిగిన ఘర్షణల నేపథ్యంలో జనసేన కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారని, అదే సమయంలో టీడీపీకి చెందిన కల్యాణ చక్రవర్తిపై ఉన్న కేసులను మాత్రం ప్రభుత్వం దొడ్డిదారిన మాఫీ చేస్తోందని వివరించారు. తన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడతానని ప్రగల్భాలు పలికే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, తన సొంత పార్టీ వారికి అన్యాయం జరుగుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. తమను గెలిపించిన సొంత ఓటర్లు, కార్యకర్తలపైనే అధికార మదంతో కేసులు పెడుతూ వేధిస్తున్నారని మండిపడ్డారు. దక్షిణ భారతదేశంలో జనాభా సమతుల్యత కోసం ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ.. అసలు అలాంటి విషయాల గురించి మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదంటూ అంబటి రాంబాబు తీవ్రంగా విమర్శించారు.

## వేటకు విరామం..
# సర్కారు సాయం



**రెండేళ్లలోనే రూ.505 కోట్ల సాయం**

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ.10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ.20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

**సకాలంలో పరిహారం...కుటుంబాలకు సహకారం**

వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేట సమయంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పరిహారం సకాలంలోనే అందిస్తోంది. 2024-25లో 63 క్లెయిమ్స్‌కు రూ.3.15 కోట్లు, 2025-26లో 113 పెండింగ్ క్లెయిమ్స్‌కు రూ.5.65 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. అంతేకాకుండా వారి ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సీవీడ్ సాగును ప్రోత్సహిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 09.30 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి మండలం తుమ్మలపెంటకు చేరుకుంటారు. 10.45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 01.15 గంటలకు గ్రామంలోని మత్స్యకార కుటుంబాలతో భేటీ అవుతారు. 2 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# క్యాన్సర్ చిన్నారికి మచిలీపట్నం అండ వెల్లువెత్తుతున్న మానవత్వం



- బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న 13 ఏళ్ల శ్రీదేవి ప్రాణాలను కాపాడేందుకు దాతల ఊరట
- గుప్తంగా ₹50,000 ఆర్థిక సాయం అందించి పెద్ద మనసు చాటుకున్న డాక్టర్ వినీషా రాంప్రసాద్ దంపతులు
- జనసైనికులతో కలిసి ₹65,000 అందజేసిన జనసేన ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ..
- చదువుకు కూడా హామీ₹15,000 చెక్కు రూపంలో సాయం అందించిన మైత్రీ ఫౌండేషన్
- ఆదుకోవాలంటూ కన్నీరుమున్నీరవుతున్న ఒంటరి తల్లి ప్రసన్న.. దాతలు ముందుకు రావాలని పిలుపు



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

విధి ఆ కుటుంబాన్ని ఎంతగా పరీక్షించినా.. మచిలీపట్నానికి చెందిన పలువురు ప్రముఖుల మాతృ హృదయం, సేవా గుణం ఆ నిరుపేద కుటుం బానికి కొండంత అండగా నిలిచాయి. క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న ఒక నిరుపేద చిన్నారి ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రముఖ వైద్యురాలు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు పోటీపడి మానవత్వాన్ని చాటుకున్నాయి.స్థానిక శారదా నగర్ 31వ డివిజన్‌కు చెందిన దాసరి సుబ్రహ్మణ్యం, ప్రసన్న దంపతుల కుమార్తె దాసరి శ్రీదేవి (13) గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతోంది. కొద్ది కాలం క్రితమే తండ్రి సుబ్రహ్మణ్యం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో, తల్లి ప్రసన్న ఎంతో కష్టపడి తన ఇద్దరు ఆడపిల్లలను పెంచుకుంటోంది. అప్పట్లో భర్త ప్రమాదానికి సంబంధించి వచ్చిన ₹15 లక్షల బీమా పరిహారాన్ని పూర్తిగా కూతురు వైద్యానికే ఖర్చు చేసింది. పాప కోలుకుంటుంది అనుకునే సమయంలో, ఐదేళ్ల తర్వాత చిన్నారికి రెండోసారి అత్యంత ప్రమాదకరమైన ఏఎంఎల్ (Acute Myeloid Leukemia) క్యాన్సర్ అని నిర్ధారణ కావడంతో ఆ తల్లి గుండె పగిలిపోయింది. ప్రస్తుతం చిన్నారి విజయవాడలోని హెచ్‌సీజీ (HCG) ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వ ఆరోగ్యశ్రీ వర్తిస్తున్నప్పటికీ, దానికి అందని కొన్ని అత్యవసర మందులు, ఇంజక్షన్ల కోసం ప్రతి నెలా లక్ష రూపాయలకు పైగా ఖర్చు అవుతుండటంతో ఆ ఒంటరి తల్లి దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది.గుప్తంగా ₹50,000 సాయం.. ఉదారత చాటిన డాక్టర్ వినీషా!చిన్నారి శ్రీదేవి దయనీయ పరిస్థితి గురించి తెలుసుకున్న 'మన గ్రూప్' సభ్యులు, ప్రముఖ గైనకాలజిస్ట్ చిన్నపురం డాక్టర్ కోడలైన డాక్టర్ రాళ్లపల్లి వినీషా, రాంప్రసాద్ దంపతులు తక్షణమే స్పందించారు. కుడిచేత్తో చేసే సాయం ఎడమచేతికి తెలియకూడదనే సామెతను నిజం చేస్తూ, ఎలాంటి ప్రచారానికి తావివ్వకుండా పూర్తిగా గోప్యంగా ₹50,000/- (యాభై వేల రూపాయల) భారీ ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. తాము చేసిన సాయం కేవలం ఒక చిన్నారి ప్రాణాన్ని నిలబెట్టడానికేనని ఆమె నిరూపించారు. డాక్టర్ కుటుంబం చూపిన ఈ ఉదారత్వానికి పాప తల్లి ప్రసన్న భోరున విలపిస్తూ, ఆ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానని కన్నీటిపర్యంతమైంది.జనసేన తరపున ₹65,000 అందజేసిన బండి రామకృష్ణ!చిన్నారి శ్రీదేవి క్యాన్సర్‌తో పోరాడుతున్న విషయాన్ని 31వ డివిజన్ ఇన్‌చార్జ్ ఉడుముల బుజ్జి స్థానిక జనసేన ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన బండి రామకృష్ణ వ్యక్తిగతంగా ₹10,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించడంతో పాటు, చిన్నారిని ఆదుకోవాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. దీంతో జనసైనికులు ఉదారంగా స్పందించి ₹55,000 సేకరించారు. మొత్తం కలిపి ₹65,000/- (అరవై ఐదు వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ, మానవత్వంతో స్పందించి దాతలు పాపను ఆదుకోవాలని కోరారు. తాము అందించిన ఆర్థిక సాయంతో పాటు, ఆ పిల్లల చదువుకు కూడా తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.'మైత్రీ ఫౌండేషన్' చేయూత!చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ కూడా తన వంతు అండగా నిలిచింది. ఆదివారం ఉదయం పాప నివాసానికి వెళ్లిన ఫౌండేషన్ ప్రతినిధులు, చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ₹15,000/- (పదిహేను వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్ మాట్లాడుతూ.. నిరంతరం ఇటు వంటి సేవా కార్యక్రమాలతో ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని, సామాన్యులు కూడా పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఈ చిన్నారిని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.పాల్గొన్న ప్రముఖులు:జనసేన నాయకులు గడ్డం రాజు, మహమ్మద్ సమీర్, పినిశెట్టి వేణు, జన్ను నాగరాజు, యేరువ శ్రీనివాస్, గంపల కృష్ణ, ఊచ చంటి, చలమలశెట్టి రమేష్, మోకా రవి, వేముల చక్రి, తోట రాజేష్, తలకాల డాని, వడ్డీ చిరంజీవి, ఉడుముల రాధిక, జొన్నల సూర్య, సంగం రాజేష్, గోవతోటి శ్రీకాంత్, గోవతోటి ప్రవీణ్, గోవతోటి కనకరాజు, కూనపురెడ్డి ప్రసాద్, మణికంఠ, వహీద్, బీరం సుదర్శన్, కోలపల్లి గణేష్, మహేశ్.. అలాగే మైత్రీ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, గౌరవ సభ్యులు రామకృష్ణ మాస్టారు, లక్ష్మణరావు, మాణిక్యాలరావు, ఆంజనేయ ప్రసాద్ మరియు చిన్నారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగుల పోరుబాట మే 20, 21 తేదీల్లో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

- నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కీలక డిమాండ్లు
- విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనాలి.. జీరో టికెట్ భారం తగ్గించాలి
- కొత్త పీఆర్సీ, ఐఆర్ ప్రకటించాలి.. పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి
- మచిలీపట్నంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుల వెల్లడి

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ - పూర్వపు ఆర్టీసీ) ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమరశంఖం పూరించింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఈ నెల (మే) 20, 21 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం నేతలు పిలుపునిచ్చారు.కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జిల్లా నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొని, ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను మీడియా ముందర ఉంచారు.ప్రభుత్వానికే సమ ర్పిం చిన మెమొరాండం.. తక్షణమే స్పందించాలి!ఈ సందర్భంగా యూ ని యన్ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీన (13-05-2026) ప్రభుత్వం మరియు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)కి తాము సమర్పించిన మెమొ రాండంలోని దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాం డ్ చేశారు. ఉద్యోగుల శ్రేయస్సు, ప్రయాణికుల భద్రత దృష్ట్యా కింద పేర్కొన్న డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు.కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే:సొంతంగా విద్యుత్ బస్సుల కొనుగోలు పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకొచ్చే విద్యుత్ (ఎలక్ట్రిక్) బస్సులను ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాకుండా.. ప్రభుత్వమే లేదా ఆర్టీసీ ద్వారానే నేరుగా కొనుగోలు చేయాలి. వాటిని ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి.జీరో టికెట్ విధానం రద్దు స్త్రీ శక్తి బస్సుల్లో మహిళలకు ఉచితంగా కల్పించే జీరో టికెట్ విధానాన్ని నిలిపి వేసి, దాని స్థానంలో సాధారణ టికెట్ వ్యవస్థను అమలు చేయాలి. దీనివల్ల కండ క్టర్లు, సిబ్బందిపై అనవసరమైన పనిభారం తగ్గుతుంది.కొత్త పీఆర్సీ - ఐఆర్ ప్రకటన ఉద్యోగులకు కొత్త వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ని వెంటనే నియమించి, తక్షణ ఉపశమనంగా అంతరింత భృతి (ఐఆర్) ప్రకటించాలి. బకాయిల చెల్లింపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యం (డీఏ)లను, పాత బకాయిలను (అరియర్స్), లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి.పాత వైద్య సదుపాయాల పునరుద్ధరణ: ఆర్టీసీ ఉద్యోగులను కొత్త ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) పరిధి నుంచి మినహాయించాలి. గతంలో ఆర్టీసీలో ఉన్న అత్యుత్తమ ఉచిత వైద్య సదుపాయాలను యథాతథంగా పునరుద్ధరించాలి.కొత్త బస్సులు - ఖాళీల భర్తీ: ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సంస్థ కొత్త బస్సులను కొనుగోలు చేయాలి. అలాగే సంస్థలో ఖాళీగా ఉన్న అన్ని కేటగిరీల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. రిటైర్డ్ సిబ్బందికి సెటిల్‌మెంట్లు ఉద్యోగ విరమణ చేసిన (రిటైర్ అయిన) మరియు విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన పెండింగ్ సెటిల్‌మెంట్లు, బెనిఫిట్లను తక్షణమే చెల్లించి ఆదుకోవాలి.కదంతొక్కిన కార్మిక శ్రేణులుఈ డిమాండ్ల సాధనకై కార్మికులందరూ మే 20, 21 తేదీల్లో జరిగే ఆందోళనల్లో పాల్గొని విజయవంతం చేయాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్. రావు, మచిలీపట్నం డిపో సెక్రటరీ ఎం. కిరణ్ కుమార్, రాజశేఖర్, పళ్లెం ఈశ్వరరావు తదితర కార్మిక నాయకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బంటుమిల్లి మెయిన్ కాలువ గట్టు వెడల్పు కార్యక్రమంలో పాల్గొన్న కాగిత కృష్ణ ప్రసాద్

ప్రజాభూమి పెడన



బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామంలో బంటుమిల్లి మెయిన్ పంట కాలువ గట్లు పెద్దవి చేయు కార్యక్రమంలో పాల్గున్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ముంపు, వరదల సమయంలో గట్లు తెగి పంట పొలాలు పోకుండా రైతులు నష్టపోకుండా ముందుచూపుతో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నిధులను విడుదల చేసి గట్లు పెద్దవి చేయు పనులను ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ఇరిగేషన్ అధికారులు రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం : జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ఫిర్యాదులపై చట్టపరిధిలో వేగంగా చర్యలు తీసుకోవాలి: అధికారులకు ఆదేశం జిల్లా పోలీసు

కార్యాలయంలో విజయవంతంగా మీకోసం కార్యక్రమం

సామాన్యుల నుంచి 40 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

మచిలీపట్నం/ క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం చేయడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ స్పష్టం చేశారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ స్వయంగా మొత్తం 40 ఫిర్యాదులను స్వీకరించారు.బాధితులతో ముఖాముఖి.. సమస్యల ఆరాఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, భర్త/అత్తింటి వేధింపులు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు మరియు ఇతర సామాజిక సమస్యలకు సంబంధించిన అర్జీలు ఈ మీకోసం వేదికకు వచ్చాయి. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత నియోజకవర్గ, స్టేషన్ పోలీసు అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు.

బాధితులకు చట్టపరిధిలో, అత్యంత వేగంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను గట్టిగా ఆదేశించారు.భయం లేకుండా రండి.. న్యాయం చేస్తాంసాధారణ ప్రజలు ఎటువంటి భయం లేదా సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావచ్చు. మీకోసం వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై అత్యంత పారదర్శకంగా విచారణ జరుగుతుంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు బాధితులకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పలువురు ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

# ఇంధన సెగ.. ఎడ్లబండ్ల రగడ

- మచిలీపట్నంలో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన జ్వాల
- సైకిల్ రిక్షాలు, ఎడ్లబండ్లతో రోడ్డెక్కిన పేర్ని కిట్టు
- కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఉప్పెనలా సాగిన ప్రదర్శన
- కూటమి ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తోంది: వైసీపీ ధ్వజం
- సంస్థల ప్రైవేటీకరణ ఆపకపోతే రాష్ట్రవ్యాప్త. ఉద్యమం తప్పదు



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా మచిలీపట్నంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వినూత్న రీతిలో సమర శంఖం పూరించింది. ఇంధన ధరల పెంపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ.. మచిలీ పట్నం వైసీపీ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు (కృష్ణమూర్తి) ఆధ్వర్యంలో సోమవారం భారీ ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వ హించారు.వినూత్న ఆందోళన.. ఆకట్టుకున్న శ్రేణులుకారుల యుగంలో కాడిపట్టి.. మోటార్ బైకుల కాలంలో సైకిల్ రిక్షాలు తొక్కుతూ వైసీపీ శ్రేణులు చేపట్టిన ఈ వినూత్న ఆందోళన మచిలీపట్నం ప్రజల దృష్టిని ఎంతగానో ఆకర్షించింది. స్థానిక కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ ఎడ్లబండ్లు, సైకిల్ రిక్షాలతో కలెక్టరేట్ ముందరి ధర్నా చౌక్ వరకు ఉప్పెనలా సాగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించి, ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రజలను నిలువునా మోసం చేశారు పేర్ని కిట్టుఈ సందర్భంగా వైసీపీ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గిస్తామని ఉమ్మడి హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ధరలను పెంచి ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, రవాణా ఖర్చులు పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తాజా ఇంధన ధరల పెంపు వల్ల రైతులు, ఆటో డ్రైవర్లు, లారీ యజమానులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అమ్మడమే లక్ష్యంగా కూటమి పాలనరాష్ట్రంలో ఉన్న ఆర్టీసీ సహా కీలక ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని పేర్ని కిట్టు ఆరోపించారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు పరం చేయాలని చూస్తే వైసీపీ చూస్తూ ఊరుకోదని, ప్రజా ప్రయోజనాల కోసం రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చ రించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ఇంధనాలపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న అదనపు





పన్నులను పునఃసమీక్షించి, రైతులు, రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక ఉపశమనం కల్పించాలి. లేనిపక్షంలో ప్రజల తరపున మరింత విస్తృత స్థాయిలో ఆందోళనలు చేపడతాం.పేర్ని కిట్టు, వైసీపీ ఇన్‌చార్జ్కలెక్టరేట్ వద్ద హోరెత్తిన నినాదాలుప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ధరలను తగ్గించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వైసీపీ నేతలు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నేతలు, రైతులు, కార్మికులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కలెక్టరేట్ పరిసరాలను హోరెత్తించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉయ్యూరులో రౌడీమూకల అరాచకం.. కలెక్టరేట్ ను ఆశ్రయించిన బాధితుడు

- అర్ధరాత్రి ఇల్లు ధ్వంసం చేసి, పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు
- ప్రాణభయంతో అల్లాడుతున్న వీర వర ప్రసాద్ కుటుంబం
- వైన్ షాపుల గొడవలే కారణం.. రూ.5 లక్షల ఆస్తి నష్టం
- పోలీసులు పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు అర్జీ.. తక్షణమే స్పందించాలని డిమాండ్

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణాజిల్లా ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో కొందరు వ్యక్తులు అర్ధరాత్రి వేళ ఇళ్లపై పడి దాడి చేసి, ఇల్లు ధ్వంసం చేసి, నిప్పు పెట్టిన అరాచక ఘటనపై బాధితుడు వీర వర ప్రసాద్ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలంటూ అర్జీ సమర్పించారు. ఉయ్యూరు టౌన్ పోలీసులు సకాలంలో స్పందించకపోవడం, నిందితులకు వత్తాసు పలకడంతోనే తాను జిల్లా అత్యున్నత అధికారి అయిన కలెక్టర్‌ను ఆశ్ర యించాల్సి వచ్చిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తనకు, తన కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని వేడుకున్నారు. వైన్ షాపుల సిండికేట్ వివాదమే కారణం బాధితుడు కలెక్టర్‌కు సమర్పించిన అర్జీ వివరాల ప్రకారం.. ఉయ్యూరు నగర పంచాయతీ శివాలయం రోడ్డులోని లింగమూర్తి ఎన్‌క్లేవ్ ఫ్లాట్ నెం. 202 లో నివాసం ఉండే ఈడే వీర వర ప్రసాద్, లాటరీ ద్వారా ఉయ్యూరు టౌన్ మరియు ఉయ్యూరు రూరల్ మండలాల్లో రెండు మద్యం షాపుల దక్కించుకున్నారు. అయితే, వైన్ షాపుల వ్యాపారంలో తమకు ఎదురు లేకుండా చూసుకోవాలనే దుర్బు ద్ధితో స్థానిక మద్యం వ్యాపారులు వీరంకి జయరామ్, కంటిబోయిన పాండురంగారావు అనే వ్యక్తులు బాధితుడిపై పాత కక్షలు పెంచుకు న్నారు. గతంలో కూడా వర ప్రసాద్‌పై రోడ్డుపై అడ్డగించి దాడి చేయగా, పోలీసులు సరైన చర్య లు తీసుకోకపోవడంతో నిందితుల ఆగడాలు మితిమీరాయి.అర్ధరాత్రి వేళ అరాచకం.. ఇల్లు ధ్వంసం, దహనం ఈ క్రమం లోనే ఈ ఏడాది మే 12వ తేదీ అర్ధరాత్రి సమ యంలో వీరంకి జయరామ్, కంటిబోయిన పాండురంగారావు తమ అనుచరులతో కలిసి కత్తులు, గొడ్డళ్లతో వర ప్రసాద్ నివాసంపైకి అక్రమంగా దూసు కొచ్చారు. ఇంట్లోకి ప్రవేశించి మద్యం తాగుతూ సామాగ్రిని, సీలింగ్‌ను, కరెం ట్ వైరింగ్‌ను, కిటికీలను, తలుపులను పూర్తిగా ధ్వంసం చేశారు. అంతటితో ఆగక ఇంటి లోపల పెట్రోల్ పోసి అగ్ని దహనం చేశారు.ఈ దాడి జరిగిన స మయంలో బాధితుడు వర ప్రసాద్ అనారోగ్య కార ణాల వల్ల భార్య, పిల్లలతో కలిసి ఊరి వెలు పల ఉన్న తన పాత ఇంట్లో ఉండ టంతో తృటిలో ప్రాణా పాయం తప్పింది. పొరుగువారు ఫోన్ చేసి సమాచారం అందించడంతో వచ్చి చూసేసరికి దాదాపు రూ. 5 లక్షల విలువైన ఆస్తి నష్టం సంభ వించింది. పోలీసుల అండతోనే నిందితుల రెచ్చి పోకడ!ఈ అరాచకంపై ఉయ్యూ రు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్.ఐ, సి.ఐ మరియు సిబ్బంది నిందితులపై ఎలాంటి చర్య లు తీసుకోలేదు సగదా.. రివర్స్‌లో మాపైనే అక్రమంగా కేసులు పెడతామని బెదిరించారు. నిం దితులతో పోలీసులు కుమ్మక్కై మాకు నోటీ సులు పంపారు. నిందితులు బహిరంగంగా తిరు గుతూ నన్ను, నా కుటుంబ సభ్యులను చంపేస్తామని,



వైన్ షాపును తగలబెడతామని హెచ్చరిస్తున్నారు. మా ప్రాణా ల కు రక్షణ లేదు అని బాధితుడు వర ప్రసాద్ కలెక్టర్ ఎదుట కన్నీరుమున్నీరయ్యారు.కలెక్టర్ తక్షణ స్పందన.. విచారణకు ఆదేశంబాధితుడి నుంచి అర్జీ స్వీక రించిన జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. చ ట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అరాచకాలకు పాల్పడే రౌడీ మూకలపై, వారికి సహకరిస్తున్న పోలీసుల పై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితుడి కుటుం బానికి పూర్తి ప్రాణ రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాభూమి
ఏలూరు, పశ్చిమగోదావరి 4
మంగళవారం 19, మే 2026

## పెట్రోల్, డీజిల్ ధరలు నియంత్రించాలి
-ఏలూరులో వైఎస్సార్సీపీ నిరసన కార్యక్రమం




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

రాష్ట్రంలో పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వైఎస్సార్సీపీ అధ్యక్షులు వై . ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మామిళ్ళపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంధన ధరలు తగ్గిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, ప్రస్తుతం ఆ విషయాన్ని విస్మరించిందన్నారు. దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయని ఆరోపించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణమే ధరలను నియంత్రించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏలూరు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేతివృత్తిదారులకు ఆదరణ రుణాలు ఇవ్వాలి
-ఏలూరు రూరల్ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

రాష్ట్రంలోని చేతివృత్తిదారులకు 90 శాతం సబ్సిడీపై రూ.5 లక్షల వరకు ఆదరణ రుణాలు మంజూరు చేయాలని ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చాటపర్రులోని ఏలూరు రూరల్ తహసిల్దార్ కార్యాలయం వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసిల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య, కో-కన్వీనర్ పొట్టేలు పెంటయ్య, బీకేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. 50 ఏళ్లు నిండిన చేతివృత్తిదారులకు పెన్షన్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం మరియు ఇళ్ల నిర్మాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు,ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మందుల విక్రయాలు అరికట్టాలి
-పెదవేగిలో కెమిస్టుల వినతి



ప్రజా భూమి ప్రతినిధి-పెదవేగి

ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాల వల్ల చిన్న మెడికల్ షాపుల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏలూరు రూరల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి పెనుమాక వాసుదేవరావు అన్నారు. సోమవారం పెదవేగి మండలంలోని మందుల షాపుల యజమానులు తహసిల్దార్ ఎస్.డి. భ్రమరాంబను కలిసి ఆన్‌లైన్ మందుల విక్రయాలను అరికట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. రసీదులు లేకుండా మందుల విక్రయాలు జరగడం వల్ల అనేక అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని, అలాగే నకిలీ డాక్టర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాత సూరిబాబు,చేగు శ్రీనివాసరావు,వేమన రాటాలు,గంగాధర్,గోపాల్, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ,సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవలకు అండగా దాతృత్వం




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఈదర గ్రామ సహకార బ్యాంకు అధ్యక్షుడు మోహన్‌రావు ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండు విద్యుత్ నిల్వ బ్యాటరీలను అందజేశారు. ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ సంరక్షణతో పాటు ప్రసూతి గది సేవలు విద్యుత్ అంతరాయం సమయంలో కూడా నిరంతరంగా కొనసాగేందుకు వీటిని వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి అందించిన ఈ సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది మోహన్‌రావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అవసర సమయంలో అందించిన ఈ సహకారం వైద్య సేవలకు బలాన్నిస్తుందని అభినందించారు.

### సమాజాజిక సేవలకు నిలువెత్తు నిదర్శనం
# వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

సమాజాజిక సేవలకు నిలువెత్తు నిదర్శనం వాకర్స్ క్లబ్అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మిక్కిలి అభినందనీయుడని వాకర్స్ అంతర్జాతీయ జిల్లా -201 గవర్నర్ వడుపు గోపి అన్నారు. సుధాకరరావు ఇటీవల హైదరాబాద్ లో దాసరి లెజెండరీ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా పాలకొల్లు వాకర్స్ ఆధ్వర్యంలో కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ భవనం లోజరిగినఅభినందన సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అతిధులుగా పాల్గొన్న పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కే



వి ఆర్ నరసింహారావు,సుధాకరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్లు బొండా శ్రీరామ్, ఆకి రామకృష్ణ, జీవి సుబ్బారావు, గుంటూరి రామరాజు అతిథులుగా పాల్గొని సుధాకరరావు మరిన్ని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వాకర్స్‌తో పాటు పట్టణానికి చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని సుధాకర రావునుశాలువాలతో దండలతో ముంచెత్తారు. కార్యక్రమానికి కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కటారి నాగేంద్రకుమార్,వాకర్స్ కార్యవర్గ సభ్యులు షేక్ పీర్ సాహెబ్, మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, సలాది రామచంద్రరావు, పోతుల ఉమాశంకర్ రావు, జవ్వాజి కల్యాణ్, జంపన ప్రసాద్, జవ్వాజి కల్యాణ్, ఆదుర్తి రాధాకృష్ణ, బాసిన సత్యనారాయణ తదితరులు నేతృత్వం వహించారు.

## పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధర్నా

ప్రజాభూమి ప్రతినిధి-చింతలపూడి

జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు చింతలపూడి నియోజకవర్గ ఇంచార్జ్ కంభం విజయ రాజు ఆధ్వర్యంలో పెంచిన డీజిల్ , పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలి అని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి ఇంచార్జ్ కంభం విజయ రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచించిందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ధరలకు ఇంధనాన్ని



విక్రయిస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడుము విరిసిన ఘనత కూటమి ప్రభుత్వాన్ని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ధరల పెంపు వల్ల రవాణా రంగం సంక్షోభంలో పడటమే కాకుండా, పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది అని అన్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంకి వెళ్లి ఎంఆర్ఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో వైసీపీ మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథం , నాలుగు మండలాల వైసీపీ అధ్యక్షులు , రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు పాల్గొన్నారు.

## పాలకొల్లు సీనియర్స్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు సీనియర్స్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కార్య వర్గం ఏక గ్రీవం గా ఎన్నికైంది. గౌ. అధ్యక్షులుగా వంగా నరసింహారావు అధ్యక్షులు గా యర్రంశెట్టి వెంకట రత్నం ప్రధాన కార్యదర్శి గా జి ఎస్ ఎన్ మూర్తి కోశాధికారి గా పి.సత్య ప్రతాప్ రాజు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దాట్ల రామకృష్ణంరాజు ,ఉపాధ్యక్షులుగా అడ్డాల వాసుదేవరావు, కొండ్రెడ్డి సూర్యనారాయణ,కలిదిండి నరసింహ రాజు, కొల్లి నరసింహమూర్తి,కార్యదర్శులుగా కలిదిండి వేంకటపతివర్మ, పెనుగొండసూర్యనారాయణ, రాయి సూర్యనారాయణ (సూరిబాబు)కంచి వివి సత్యనారాయణ




సలహా మండలి సభ్యులు గా...వేగేశ్న వెంకట తిరుపతి రాజు,అత్యంఆదిశేషారావు ,మాఘం బాలకొండలరావు, ముత్యాల రామారావులతో పాటు కార్యనిర్వాహక సభ్యులుగా సలాది ,సత్యనారాయణమూర్తి,ముక్కు లక్ష్మీ నరసింహం (బాబు) గెద్దాడ ఫణీంద్రుడు, మా నెం ధన గణేశ్వరరావు, కంచర్ల వెంకట సూర్య నారాయణ ( గౌరి) గోడి నాగ మోహన రావు,పిల్లా బాలాజీ, యర్రమిల్లి నరసింహారావు యర్రా అజయ్ కుమార్,చిలుకూరి చిట్టి బుల్లెమ్మ లచే పాలకొల్లు పెన్షనర్స్ భవనం లో జరిగిన సీనియర్స్ సిటిజన్స్ సంక్షేమ సంఘంసర్వసభ్యసమావేశం లో ముఖ్యఅతిది గా విచ్చేసిన ప గో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కొటికెలపూడి చిట్టి వెంకయ్య ప్రమాణస్వీకారం చేయించారు.

## ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పణ

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పై విద్యుత్ బస్సుల అమలుతో (ఆర్టీసీ ప్రైవేటీకరణ) భవిష్యతులో ఆర్టీసీ ఉద్యోగులకు కలిగే ఇబ్బందులపై కలక్టర్, ఏలూరు జిల్లా వారికీ కె. రమేష్ కుమార్, చైర్మన్ ఏ.పి.జెఏసి. అమరావతి వారి ఆద్వర్యములో కలిసి వినతి పత్రం ఇవ్వడము జరిగినది. ఈ కార్యక్రమములో బి. రాంబాబు రీజనల్ సెక్రటరీ, వై. శ్రీనివాస్, హోనేర్బుల్ ప్రెసిడెంట్, ఏలూరు డిపో, టి. బాబు రావు, ప్రెసిడెంట్, ఏలూరు డిపో, డి. ఆంజనేయులు సెక్రెటరి, ఏలూరు డిపో. ఆర్టీసీలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నాము. అయితే ఈ విద్యుత్ బస్సులను ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ సంస్థే స్వయంగా నిర్వహణ చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం, ఎటువంటి లాభాపేక్ష లేకుండా అందించడం జరుగుతుంది. కావున విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రవేటు ఆపరేటర్లకు అప్పగిస్తూ వారికీ ఆర్టీసీ డిపోలను ఖాళీ చేపించి వారికీ అప్పగించడాన్ని నిలుపుదల చేయాలనీ



విజ్ఞప్తి చేస్తూ విద్యుత్ బస్సులన్ని ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని కోరినారు. 2012 నుండి ఆర్టీసీలో డైరెక్ట్ రిక్రూట్మెంట్ లేనందున ప్రస్తుతం పిటిడిలో ఉన్న ఉద్యోగులు సంఖ్య, చాల తక్కువగా ఉన్నందున స్త్రీ శక్తి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య రోజురోజుకి పెరుగుతున్న కారణంగా ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడిలతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే వివిధ కేటగిరీలలో 10 వేల మంది సిబ్బంది నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి. రిటైర్డ్/ మరణించిన పిటిడి ఉద్యోగులకు ప్రభుత్వం నుండి చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించి రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరినారు.

## ఈనెల 20వ తేదీన మెడికల్ షాపులు బంద్ జయప్రదం చేయాలి

### మెజిస్ట్రేట్‌కు పోలీసులకు వినతి పత్రం అందజేసిన అసోసియేషన్



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

20వ తారీకు జరిగే మన మెడికల్ షాప్ బంద్ గురించి జీలుగుమిల్లి మండల కెమిస్టు ముందుగా జీలుగుమిల్లి మండలం తహసిల్దార్ కి మరియు ఎస్సైకి బంద్ గురించి వినతి పత్రం అందజేశారు. షాపులు బందులను జయప్రదం చేయాలి. నకిలీ మందుల అమ్మకాని ప్రభుత్వం నివారించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నకిలీ మందులు అమ్మకాన్ని నివారించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అఖిల భారత కెమిస్ట్రీల సమైక్య ఈనెల 20వ తేదీన ఆల్ ఇండియా సమ్మెలో భాగంగా మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల తాసిల్దార్ కు పోలీస్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అసోసియేషన్ అధ్యక్షులు కక్కిరాల రాము మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్న మందుల షాపుల్లో అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలని,ఆన్లైన్లో మందుల అమ్మకాలను పూర్తిగా నిలిపివేయాలని, దీని ద్వారా నకిలీ మందుల అమ్మకాలు విపరతంగా పెరగటంతో పాటు, చిన్న తరహా షాపులపై ఆధారపడి జీవనో సాగిస్తున్న అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కనుక ఈనెల 20వ తేదీ బుధవారం మండలంలోని మందులు షాపులు షాపులు బంద్ చేయుటకు నిర్ణయించడమైనదని, కనుక రోగులకు కలిగే అసౌకర్యనికి చింతిస్తూ ప్రతి ఒక్కరు ఈ సమ్మె కు సహకరించాలని కోరారు.

# రక్తపోటుపై ప్రజల్లో చైతన్యం అవసరం

### ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

ప్రజా భూమి ప్రతినిధి - ఆగిరిపల్లి

మే 17 ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి మండలంలోని ఆగిరిపల్లి, ఈదర, సగ్గూరు గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో రక్తపోటుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. "రక్తపోటును అదుపులో ఉంచితేనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం" అనే సందేశంతో గ్రామాల్లో ర్యాలీలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ టీనా, డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్,



డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ సంధ్యాప్రియతో పాటు వైద్యశాల సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అధిక ఉప్పు వినియోగం తగ్గించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడిని దూరంగా ఉంచుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చని తెలిపారు. అలాగే క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. అనంతరం ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కే. శుభశేఖర్ మరియు పోలీస్ సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు.

## పుస్తకాలతో పిల్లల్లో పఠనాభిరుచి పెంపు



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. పిల్లలు కథలు, నీతి కథలు, విజ్ఞాన పుస్తకాలు చదువుతూ పఠనాభిరుచిని పెంపొందించుకుంటున్నారు. శిబిరంలో ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని గ్రంథాలయ అధికారి కుమార్ తెలిపారు.

## ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సందడిగా సమ్మర్ క్యాంప్



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. చిన్నారులకు నీతి కథలు బోధించగా, వాటిలోని సందేశాలను వారిచేత వివరింపజేశారు. ప్రముఖ ఆంధ్రా డైరీ స్టాఫ్ రిపోర్టర్ చలసాని వెంకట సురేంద్ర (పెప్సి) "ఏకాగ్రత"పై అవగాహన కల్పించారు. డాన్స్ మాస్టర్ వై కృష్ణ ఫణి కాంత్ నృత్య శిక్షణ అందించగా, సిహెచ్ పద్మావతి పద్యకావ్యాల పోటీలు నిర్వహించారు. విజేతలకు నోట్ బుక్స్, పెన్నులు, స్కెచ్ పెన్నులు, స్నాక్స్ బహుమతులుగా అందజేశారు. అనంతరం దాతలు పుణ్యమూర్తుల కుటుంబ సభ్యులు చిన్నారులకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పేరెంట్స్, చిన్నారులు పాల్గొన్నారు.

## జుహిత్ ఆదిత్య హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

ఏలూరు పవర్ పేట పాత బస్టాండ్ వద్ద మోతేవారి వీధిలో సోమవారం నాడు జుహిత్ ఆదిత్య మెటర్నిటీడ ఫెర్టిలిటీ హాస్పిటల్ ఘనంగా ప్రారంభమైంది. దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఐ వి ఎఫ్ ప్రాబ్లమ్స్ ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటి మీద దృష్టి పెట్టి ఆ దిశగా వైద్య సేవలు అందించడం ద్వారా ఎక్కువమంది పేషెంట్స్ ఈ హాస్పిటల్ ద్వారా సేవలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పడాల హాబిత మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పేషెంట్స్ తమ హాస్పిటల్ నందు సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల లేపరోస్కోపీ సర్జరీలు తమ హాస్పిటల్ నందు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమంపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష.



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

జిల్లాలో 18 నుంచి 25 వరకు జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించి సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిపాలన మరియు అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం మరియు అమలు, పర్యవేక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా 18.05.2026 నుండి 25.05.2026 వరకు జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా అవగాహన శిబిరాలు, గ్రామ సమావేశాలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు పరస్పర చర్చా కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వ శాఖలు,ప్రజల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలన్నారు. ముఖ్యంగా గిరిజన, గ్రామీణ, వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. జన్ భాగీదారి అభియాన్ కింద ప్రభుత్వ సంక్షేమ పథకాలు హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమాజ బాధ్యత, సామూహిక చర్యను ప్రోత్సహించాలన్నారు. పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. సామాజిక సంక్షేమం, ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ మరియు జీవనోపాధి కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి అవసరమైన ప్రభుత్వ సేవలు , సామాజిక-ఆర్థిక ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రజలు సమగ్ర లబ్ధి సంతృప్తి సంతృప్తి పొందేలా గ్రామస్థాయి శిబిరాల ద్వారా ఆధార్ కార్డులు , ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు , జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తక్షణమే జారీ చేయడం లేదా నవీకరించడం చేయాలన్నారు. సామాజిక మరియు ఆర్థిక భద్రతకల్పించేందుకు పీఎం-కిసాన్ యోజన ,సామాజిక భద్రత పెన్షన్ పథకాలు ,బీమా పథకాలు ,నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ వంటి కార్యక్రమాలు నమోదు చేయాలన్నారు. సమగ్ర గిరిజన సాధికారత కింద పీఎం-జన్మన్, ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ వంటి ముఖ్య పథకాల చివరి దశ అమలుకు ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవాలన్నారు. అదే విధంగా గిరిజన సాంస్కృతిక సమగ్రతను పెంపొందించేందుకు సాంప్రదాయ గిరిజన కళారూపాలు , స్థానిక గిరిజన భాషలు పరిరక్షణ ప్రోత్సహించాలన్నారు. గిరిజన నాయకులు, ముఖ్యంగా భగవాన్ బిర్సా ముండా ("ధర్తి ఆబా") గారిని స్మరించుకోవడం చేయాలన్నారు.

## తునిలో సెగలు రేపుతున్న ఎండలు

-నిప్పుల కొలిమిలా మారిన నియోజకవర్గం




ప్రజాభూమి ప్రతినిధి-తుని

తుని నియోజకవర్గంలో భానుడు భగభగలాడుతున్నాడు. సోమవారం ఉదయం నుంచే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో నియోజకవర్గవ్యాప్తంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్రమైన ఉక్కపోత, తోడుగా వీస్తున్న వడగాడ్పుల ధాటికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. మధ్యాహ్నం సమయానికి ఎండ తీవ్రత మరింత ముదరడంతో ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక పూర్తిగా నిర్జనంగా మారాయి. నిప్పుల కొలిమిని తలపిస్తున్న రోడ్లపై వాహనదారులు సైతం ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా స్థానిక వైద్యులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఈ ఎండ తీవ్రతకు గురికాకుండా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని, అత్యవసర పనులుంటే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రాకపోవడం మంచిదని హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు నిరంతరం తగినంత నీరు, మజ్జిగ, లేదా కొబ్బరిబొండాల వంటి ద్రవపదార్థాలు తీసుకుంటూ శరీరాన్ని కాపాడుకోవాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

## ప్రతీ అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### కలెక్టర్: ఆర్. మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి అర్జీపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులనుండి జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ నిదియా దేవి డి.ఆర్.ఓ. వి సుబ్బారావు ఆర్డిఓ మమ్మీలు సుమారుగా 215 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపి సంతృప్తి స్థాయిలను నూటికి నూరు శాతం చేరుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని, ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాస్థాయి అధికారులు నిర్దేశ గడువులోగా అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని, అర్జీదారులకు సకాలంలో సమాచారం అందిస్తూ పారదర్శకత పాటించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.పిజిఆర్ఎస్ ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖో శీనిధియా దేవి తెలిపారు. అర్జీలను సమగ్రం గా పరిశీలించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను త్వరితగతిన చూపాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, సమర్థత పాటించడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని, నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పి డి డి.రాంబాబు డిఎ ల్డివోలు రాజేశ్వరరావు వేణుగోపాల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు వికాస జిల్లా మేనే జర్ జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



### పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై

## కొత్తపేటలో వైఎస్సార్‌సీపీ వినూత్న నిరసన

రిక్షాపై బైక్ ఎక్కించి ఆర్‌డీవో కార్యాలయానికి ర్యాలీ.

ధరల భారం తగ్గించాలని ప్రభుత్వాలకు డిమాండ్.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కొత్తపేటలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట గ్రామంలో గొల్లపల్లి డేవిడ్ రాజు ఇంటి ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నిర్వహిం చిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా ఇంధన ధరలు అమాంతం పెరిగిపోవడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని జగ్గిరెడ్డి విమర్శించారు. అనంతరం అక్కడి నుంచి కొత్తపేట ఆర్‌డీవో కార్యాలయం వరకు చిర్ల జగ్గిరెడ్డి వినూత్న ర్యాలీ నిర్వహించారు. ఒక రిక్షాపై మోటార్ సైకిల్‌ను ఎక్కించి స్వయంగా రిక్షా తొక్కుతూ ర్యాలీగా వెళ్ల డం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కార్యకర్తలు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి ఆర్‌డీవో కార్యా లయంలో అధికారులకు వినతిపత్రం అందజేసి పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు.

## పైడిమెట్టలో పది విద్యార్థులకు అభినందన కార్యక్రమం.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోండి - కొప్పాక జవహర్

ఈ అభినందనలు మీపై మరింత బాధ్యత ను పెంచాయి - డి డి రావు

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి చెందిన విద్యావేత్త, సామాజిక సేవా కార్యకర్త, తెలుగు దేశం పార్టీ నాయకులు కొప్పాక జవహర్ ఆదివారం తన స్వగృహంలో పైడిమెట్టలో పది ఫలితాల్లో విజయం సాధించిన 15 మంది విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులను ఆశీర్వదిస్తూ శాలువ, మెమోంటో తో సత్కరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని చేరుకోవాలని సూచిం చారు. డా జె వి ప్రమోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో గెద్దం గణేష్ వ్యాఖ్యత గా వ్యవహారించారు. కార్యక్రమం లో ఏ పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడు తూ విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న జవహర్ ధన్యజీవి అని, అభినందనలు అందుకున్న విద్యార్థులు మరింత భాధ్యతగా చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమం లో గ్రామ పెద్దలు జొన్నకూటి శాంసన్, పసలపూడి ఆశీర్వాదం, పుష్ప రాజు, జొన్నకూటి ఏసురత్నం, కొప్పాక రాజు, బి జె పి నాయకులు మల్లిపూడి రాజేష్, కాంగ్రెస్ నాయకులు కొడమంచిలి చంద్ర శేఖర్, నందన ఫౌండేషన్ రమేష్, పల్లికొండ బాలు, సి ఆర్ పి ఎఫ్ జవాను మనెల్లి రామకృష్ణ లు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## రేలా ఉత్సవాలకు ప్రజలు భారీగా తరలిరావాలి

-గిరిజన సంఘం నాయకులు పిలుపు

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం



మే 24, 25, 26న రంపచోడవరంలో జరగనున్న రేలా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ, సోమవారం కుందులూరు గ్రామ పంచాయతీ గుల్లెటివాడ గ్రామంలో గిరిజన సంఘం నాయకులు స్తానిక గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన ఆదివాసి నాయకులు కారం సుందరయ్య, సోయం చిన్నబాబు మాట్లాడుతూ మే 24.25.26.న జరగనున్న రేలా ఉత్సవాలు విజయంతం చేయాలని కోరారు. ఈ ఉత్సవాల్లో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలు నేటి సమాజానికి కనబడే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు సోయంచిన బాబు, జల్లితమ్మయ్య, జల్లి సత్యనారాయణ, పిసం సత్తిబాబు సోమరాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌లో అందిన సమస్యలకు జవాబుదారీతనంతో సత్వర పరిష్కారం అందించాలి

- అర్జీలను నాణ్యతతో నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలి
- పీజిఆర్ఎస్‌కు 313 అర్జీలు.
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన సమస్యలకు జవాబుదారీతనంతో సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, సీపీవో పీ.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం వంటి అంశాలపై మొత్తం 313 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలోను, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా ఆడిట్ నిర్వహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. అర్జీలు పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



**రెవెన్యూ క్లినిక్ కు 43 అర్జీలు..**

రెవిన్యూశాఖలో సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలుపైన జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. డీఆర్వో డా.టి.తిప్పే నాయక్.. కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, ఎన్.శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్ లైన్ లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 43 అర్జీలు అందాయని జేసీ అపుర్వ భరత్ తెలిపారు.ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్.. రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లతో అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి ఈ అర్జీలను సకాలంలో పూర్తిగా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమాలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఇంధనపు దరలు తగ్గించాలని వైసీపీ శ్రేణులు డిమాండ్.

### రామచంద్రపురంలో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

పెంచి ఇందనపు ధరల వల్ల సామాన్య ప్రజలపై భారం మోపడమేనని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని వైసీపీ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలో గల పలువురు వైసీపీ శ్రేణులు రామచంద్రపురం పట్టణ పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి రాష్ట్రంలో పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలకు నిరసనగా ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అదికారికి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పిల్లి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, పెరిగిన ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ ఆయన చేశారు.అలాగే రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడు తూ పెరిగిన ఇంధన ధరలపై స్పందిస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అదనపు భారం మోపకుండా తక్షణమే ధరలను నియంత్రించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గ స్థాయిలో పోరవరం వైసీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణా అక్రమ తవ్వాకాలపై ఉక్కుపాదం

### కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

ఇసుక అక్రమ రవాణా అక్రమ తవ్వకాలపై ఉక్కు పాదం మోపి అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిపినా, లేదా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించినా కఠిన చర్యలు తీసుకోవాలని రాత్రి వేళల్లో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ కమిటీ సభ్యులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లం ఘిస్తే కఠిన చర్యలు గైకొనాలని హెచ్చరించారు. కోనసీమ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా పంపిణీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు లోబడి, అత్యంత పారదర్శకంగా జరగాలని ఇసుక అక్రమ తవ్వకాలు రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు గైకొనాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, మరియు పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శ కంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 5 రీచ్ లలో ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయని వీటిలో నాలుగు రీచ్లు సెమీ మెకానేజ్డ్ కాగా తాతపూడి రీచ్ మాన్యువల్ గా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో ఐదు రీచ్లు రెన్యువల్ చేయాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రుతుపవనాలు సీజన్లో వర్షాకాలంలో డిమాండ్ కు అనుగుణంగా ఏడు లక్షల మెట్రిక్ టన్నులు స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచాలని ఆదేశించినప్పటికీ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 10 లక్షల మెట్రిక్ టన్నులను స్టాక్ పాయింట్లలో నిల్వలు ఉంచనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్టాక్ పాయింట్లలో 6.65 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని చెప్పారు. కపిలేశ్వరపురం కేదార్లంక లో పట్టా భూములలో (డి-కాస్టింగ్) భూములలో ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయన్నారు. రావుల పాలెం ఆలమూరు పి గన్నవరం అల్లవరం మండలాలలో అక్రమ ఇసుక మట్టి త్రవ్వకాలు జరుగుతున్నట్లు దిన పత్రికలలో కథనాలు వస్తున్నాయని ఆ యొక్క వదంతులను కట్టడి చేయడానికి గనులు రెవెన్యూ పోలీస్, రవాణా శాఖల అధికారులను మండల వారి బృందాలుగా విభజించి వారంలో రెండు రోజులు యాదృచ్ఛికంగా సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల బృందాలు రావులపాలెం లో అక్రమ తవ్వకాలు అక్రమ రవాణాకు సంబంధించి 4 కేసులు బనాయించినట్లు తెలిపారు.ప్రస్తుతం గనుల శాఖ మట్టి త్రవ్వకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు ఇవ్వడంలేదన్నారు. ఓవర్ లోడు ఇసుకతో వెళుతున్న వాహనాలపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కేసులు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఇసుక లోడుతో వాహనాలు వేగం గా వెళుతున్నాయని యొక్క వేగాన్ని నియంత్రించాలని ఆయన ఆదేశించారు. అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఉచిత ఇసుక పాలసీలో సొంత నిర్మాణ రంగ అవసరాలకు ట్రాక్టర్లు ఎడ్ల బండ్లపై ఇసుకను ఉచితంగా తరలించు కోవచ్చునని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ త్రవ్వకాలకు సంబంధించి రూ 1,88,000 మేర జరిమానా విధించినట్లు తెలిపారు అదేవిధంగా అక్రమ రవాణా సంబంధించి 42,190 క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించి రూ 13,43,000 జరిమానా విధించినట్లు అదేవిధంగా 79 వాహనాలు పై పెనాల్టీ విధించినట్లు తెలిపారు. అక్రమ రవాణాకు సంబంధించి నాలుగు నెలలుగా రూ 66 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్, వైఖోఓ నిధియా దేవి ప్రసంగిస్తూ జిల్లాలో ఇసుక లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ, సామాన్య ప్రజలకు, నిర్మాణ రంగానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవోలు జి మమ్మీ, డి. సరళావతి,గనులు భూగర్భ శాఖ ఏడి డి. అశోక్ కుమార్ డిపిఓ శాంతలక్ష్మీ, జలవనరుల శాఖ హెడ్ వర్క్స్ ఈఈ జి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ సి బి రాము,పోలీస్ రవాణా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## జూనియర్ సివిల్ జడ్జిగా నిఖిల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

### -అభినందనలు తెలిపిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఎట్టకేలకు హిందూపురం జూనియర్ సివిల్ జడ్జిగా పోస్టు భర్తీ అయింది. గత కొన్నేళ్లుగా సంబంధిత పోస్ట్ ఖాళీగా ఉండటంతో అటు కక్షిదారులు ఇటు న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రకాశం జిల్లా కందుకూరులో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న నారంరెడ్డి నిఖిల్ రెడ్డిని హిందూపురం జూనియర్ సివిల్ జడ్జిగా నియమించడంతో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సంబంధిత న్యాయస్థానానికి ఇన్చార్జ్ న్యాయమూర్తిగా ఉన్న లలితా లక్ష్మీ హారిక కోట నుండి బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు న్యాయమూర్తిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవాదుల సహకారంతో కక్ష దారులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, ఇందుకు న్యాయవాదులందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణమూర్తి, నాగరాజు రెడ్డి, సిద్దు, శ్రీనివాస్ రెడ్డి, శివశంకర్, వన్నేరువప్ప, మురళీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్ రెడ్డి సీనియర్ సివిల్ జడ్జి హేమలత, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జన్ భాగిదరి క్యాంపెయిన్ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జన్ భాగిదరి – సబ్సే దూర్, సబ్సే పెహలే క్యాంపెయిన్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం డిటిడబ్ల్యుఓ ఆధ్వర్యంలో జన్ భాగిదరి – సబ్సే దూర్, సబ్సే పెహలే



క్యాంపెయిన్ కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు పొందిన లబ్ధిపై ఐఇసి ఆక్టివిటీలు చేపట్టాలని, ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయమహా అభియాన్, ధర్తీ ఆబా జెన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కింద పొందే ప్రయోజనాల గురించి తెలియజేయాలన్నారు. ఈనెల 18వ తేదీన జన్ భాగిదరి కార్యక్రమం ప్రారంభిస్తుండగా, 19 నుంచి 25వ తేదీ వరకు గ్రామాలలో సంతృప్తి స్థాయిలో ప్లాంటేషన్ డ్రైవ్ లు చేపట్టాలని, గ్రామ స్థాయిలో ప్రతిరోజూ విస్తృత శిబిరాలు, ఆరోగ్య పరీక్షా శిబిరాలు ఏర్పాటు చేయాలని, 20వ తేదీన క్షేత్ర స్థాయిలో అధికారులు, ఆది కర్మయోగులు, స్వచ్ఛంద సంస్థలచే గ్రామాలలో ట్రాన్సెక్ట్ వాక్‌లను నిర్వహించడం చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు రోజువారీ ప్రాతిపదికన ఫిర్యాదుల పరిష్కారం, హక్కుల వేగవంతమైన పరిష్కారాల కోసం జన సున్వాయి కార్యకలాపాలు నిర్వహించడం, 24వ తేదీన కెపిఐలతో జన్ సున్వాయి యొక్క ప్రూఫ్ కార్డ్ ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డ్ తయారు, విన్న సమస్యలు, పరిష్కరించబడిన అర్హతలు, పెండింగ్‌లో ఉన్న ఉన్నతాధికారులకు నివేదించాల్సిన సమస్యలు, బాధ్యతగల అధికారులు, తదుపరి చర్యలు చేపట్టడం చేయాలని, 25వ తేదీన మీడియా సమావేశం మరియు కలెక్టరేట్‌లో బ్లాక్, గ్రామ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు. డిఆర్డీఏ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందిస్తున్న ఈ సైకిల్స్ పై ఆయా శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని, ఇందుకోసం ఆయా శాఖల పరిధిలో క్షేత్ర స్థాయి సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక ట్రాన్స్ జెండర్ కు గుర్తింపు సర్టిఫికెట్ ను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రమేష్ రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జునరెడ్డి, ఆనంద్, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పవర్ గేర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

### -అధికారులకు విన్నవించిన కార్మిక సంఘాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పారిశ్రామిక వాడలో ఉన్న పవర్ గేర్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని సోమవారం కార్మిక సంఘాల నాయకులు రెవెన్యూ అధికా రులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ, పవర్ గేర్ కార్మికులకు యాజమాన్యం బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని గత పది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా అటు యాజమాన్యం ఇటు కార్మిక శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వేతనాలు అందక కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్, తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, సిపిఐ నాయకులు డి.బాబు, చలపతి, కార్మిక నాయకులు తిప్పేస్వామి, ఆనంద్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ దంపతుల అన్నదానం




ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ కమిషనర్ దంపతులు మల్లికార్జున, సుగుణ సోమవారం పట్టణంలోని మార్గదర్శి విద్యానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడి విద్యార్థులకు అన్నదానం చేశారు. మాళప్ప, సాయికళ దంపతులు గత 28 సంవత్సరాలుగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు దాతల సహకారంతో ఉచిత వేసవి బడులను నిర్వహిస్తున్నారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వారి సేవలను ప్రశంసిస్తూ కమిషనర్ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు కమిషనర్ దంపతులను పాఠశాల యాజమాన్యం సాయికళ, మాళప్ప దంపతులు, రాజ్యలక్ష్మి మోహన్, సింగర్ రాజు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దయానంద్, డ్రాయింగ్ మాస్టర్ శ్రీశైలం, సంగీతం మాస్టర్ రాజు, డాన్స్ మాస్టర్ సాయి, సింగర్ గణేష్, కుమారి, మమత, గాయిత్రి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైబర్ నెట్‌వర్క్‌లో ఐపిటివి ప్రసారాలను పునరుద్ధరించాలి

### -ఫిర్యాదుల దినోత్సవంలో విన్నవించిన కేబుల్ ఆపరేటర్లు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఏపీ ఫైబర్ నెట్ వర్క్ లో ఐపిటీవి ప్రసారాలు నిలిచిపోవడంతో వినియోగదారులతో పాటు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వెంటనే ఐపిటివి ప్రసారాలు పునరుద్ధరించాలని సోమవారం ఫిర్యాదుల దినోత్సవంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఐపిటివి ప్రసారాలు నిలిపివేసి వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసిన బాధ్యులపై క్రిమినల్ కేసుల నమోదు చేసి చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌లో తలెత్తిన తీవ్రమైన అంతరాయాల వల్ల క్షేత్రస్థాయిలో తమతో పాటు వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ?ఏపీ ఫైబర్ యాజమాన్యం, సాంకేతిక బృందం నిర్లక్ష్యం, అలాగే మిడ్ వేర్ సర్వర్ వెండర్ అయిన 'కార్పస్' సంస్థ నిరంకుశ వైఖరి కారణంగా గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఐపిటివి ఛానల్స్ పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. దీని కారణంగా క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సమాధానం చెప్పుకోలేక అవమానాలు ఎదుర్కొంటున్న ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని ?సరిపడే సాంకేతిక సిబ్బందిని నియమించాలని, జిల్లా వ్యాప్తంగా ఏపీ ఫైబర్‌లో తలెత్తుతున్న ఇంటర్నెట్, సిగ్నల్, ఇతర సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారుల నుండి డబ్బులు తీసుకున్నది ఏపీ ఫైబర్ నెట్ ఆపరేటర్లు కావడంతో క్షేత్రస్థాయిలో వినియోగదారులు తమను నిలదీస్తూ అవమానకరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. తప్పు ఏపీ ఫైబర్ యాజమాన్యం, కార్పస్ సంస్థ చేస్తే వినియోగదారులు తమను అవమానాలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి సమస్యను తెలియజేసి వేలాదిమంది ఆపరేటర్ల ను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పరిసర ప్రాంతాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## వినూత్న పద్ధతిలో నిరసన తెలిపిన సిపిఐ మండల కార్యదర్శి డి పెద్దయ్య



ప్రజాభూమి, పుట్లూరు.

పెట్రోల్ డీజిల్ పై మూడు రూపాయలుపెంచడాన్ని నిరసిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పుట్లూరు మండల కేంద్రంలో మినీ ట్రాన్స్పోర్ట్ వాహన్నన్ని తాళ్లు కట్టి లాగి వినూత పద్ధతిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఐ,పెద్దయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో పెట్రోల్ డీజిల్ ధరలు పెరగవు అన్న ప్రధాని నరేంద్ర మోడీ ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్ డీజిల్ లీటర్ కి 3,రూ వరకు పెంచడం దారుణం. పెరుగుతున్న నిత్యావసరాలధరలతో కోట్లాది భారతీయులు మరింత ఆర్థికంగా సంక్షోభానికి నెట్టి వేయబడుతున్నారు. ఇంధన ధరలు పెంచిన ప్రతిసారి అది పేదలు, కు ఒక పన్నుగా మారుతున్నది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే రవాణా, ఆహారం, మందులు, ముఖ్యంగా వ్యవసాయ యోత్పత్తులు సహా ప్రతి నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుంది. ప్రతి ఇంటి బడ్జెట్ ప్రభావితం అవుతుంది. కార్పొరేట్ లాభాలను కాపాడుతున్న మోడీ ప్రభుత్వం తన వైపల్యం భారతదేశమంతా ప్రజలపై వేస్తున్నది.

**ఖర్చు తగ్గించాలని మోడీ చెప్తూ :** డీజల్,వాడొద్దు, బంగారం కొనవద్దు, అన్ని సూచనలు చేసిన మోడీ, విదేశీ పర్యటనకు వెళ్లడానికి ఆయన వేసుకున్న సూట్ కు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారు శ్వేత పత్రం విడుదల చేయాలి. భవిష్యత్తులో ఒక పూట భోజనం చేయండి, మరో పూట యోగా చేయండి అని మోడీఅంటారేమో? కావున మోడీ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను కూటమి ప్రభుత్వం వ్యతిరేకించి ప్రజల పక్షాన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టిడిపి పార్టీ మద్దతుతో బిజెపి ప్రభుత్వం నడుస్తున్నందున వెంటనే చంద్రబాబు నాయుడు మోడీ డీజిల్ పెట్రోల్ పై 3 రూ "పెంచు నిర్ణయాన్ని వ్యతిరేకించి, పెట్రోల్, డీజిల్ తగ్గించాలని ప్రజల తరఫున కోరాలని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా కోరుతూ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మినీ ట్రాన్స్పర్ వాహనాన్ని తాళ్లతో కట్టి లాగి నిరసన తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో మం"సహాయ కార్యదర్శి, బాలు, చేతి వృత్తి దారుల సమాఖ్య, మం"అధ్యక్షులు, ఓబుళపతి, ,డి హెచ్ పి ఎస్ మం"అధ్యక్షులు, డి, పెద్దన్న, నడిపి నారాయణ,రాజు,దేవరాజు డ్రైవర్ ఓబులేసు, నారాయణ, లక్ష్మీనారాయణ శేషు, నల్లప్ప, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలి

### - : పర్యాటక కౌన్సిల్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురము

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మరియు జిల్లా పర్యాటక కౌన్సిల్ చైర్మన్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పర్యాటక అభివృద్ధి కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా పర్యాటక ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొనకొండ్ల వద్దనున్న జైనుల జంబుద్వీప చక్రం అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలని, దీనిపై జైనులతో ఆర్కియాలజీ అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. నగరంలోని శిల్పారామంలో మాస్టర్ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేయించాలని, అక్కడ అవసరమైన చేతివృత్తులు, ఫుడ్ కోర్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు. కుందుర్పి కోటకు సంబంధించి మెట్ల నిర్మాణం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించారు. కొండమీద రాయుడు కొండ చుట్టూ గిరి ప్రదర్శన కోసం, నేషనల్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని దేవాలయాల్లో, పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన చోట మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరంలో చరిత్రాత్మక ప్రదేశాలు, స్థలాలను గుర్తించడం జరగగా, ఆయా ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి చరిత్ర తెలిపే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయడం చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని, దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఓబులమ్మ, డ్వామా పిడి సలీం భాష, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, మెప్మా పిడి విశ్వజ్యోతి, డీఈవో ప్రసాద్ బాబు, డిపిఓ నాగరాజు నాయుడు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకిర్, పర్యాటక శాఖ సిబ్బంది దీపక్, సాయి కిరణ్, కమిటీ సభ్యులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టాయ్ కరెన్సీ ముఠా అరెస్ట్ .. పోలీసు అధికారుల వేషధారణలో మోసం చేసే కుట్ర

### -ఐదుగురు నిందితుల అరెస్ట్ -స్కార్పియో వాహనం, కౌంటింగ్ మిషన్ స్వాధీనం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

అమాయకులను మోసం చేసి సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశించిన మోసగాళ్ల గుట్టును హిందూపురం పోలీసులు రట్టు చేశారు. టాయ్ కరెన్సీ తో మోసం చేయాలని ప్రయత్నించిన ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి నుండి స్కార్పియో వాహనం, కౌంటింగ్ యంత్రం తదితర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐలు రాజగోపాల్ నాయుడు, చంద్ర ఆంజనేయులు, అబ్దుల్ కరీం, జనార్ధన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం వివరాలను సిఐలు వెల్లడించారు. లక్ష రూపాయలు అసలు కరెన్సీ అందజేస్తే రూ.10 లక్షల నకిలీ నోట్లు ఇస్తామని అమాయక ప్రజలకు డబ్బు ఆశ చూపి చివరకు టాయ్ కరెన్సీతో మోసం చేసేందుకు ప్రయత్నించిన చిలమత్తూరు మండలానికి చెందిన వెంకటేష్, బాలాజీ, ఉపేంద్ర, కర్ణాటక బాగేపల్లి కి చెందిన నాగరాజు, అనంతపురం కు చెందిన చంద్రమోహన్ లను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు పోలీసు వేషధారణతో బాధితులను భయపెట్టి టాయ్ కరెన్సీని అసలు నోట్లుగా నమ్మించి మోసం చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు హిందూపురం డి.ఎస్.పి మహేష్ పర్యవేక్షణలో లేపాక్షి మండలం కొండూరు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఈ టాయ్ కరెన్సీ వ్యవహారం బయటపడిందన్నారు. దీంతో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుండి రూ 50 లక్షల రూ.500 టాయ్ కరెన్సీ నోట్లు, ఒక లాఠీ, రెండు ఖాకీ ప్యాంట్లు, ఒక ఖాకీ టోపీ, ఒక హ్యాండ్ కఫ్, నోట్లను లెక్కించే యంత్రం, స్కార్పియో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వెంకటేష్ తిరుపతికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ద్వారా అసలు నోట్లను పోలి ఉన్న టాయ్ కరెన్సీని తెప్పించే వారన్నారు. టాయ్ కరెన్సీ సరఫరా చేసిన తిరుపతికి చెందిన ప్రసాద్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు సిఐలు వివరించారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరపరచుగా న్యాయమూర్తి రిమాండ్ కు ఆదేశించినట్లు తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిఐలు ఆంజనేయులు, జనార్ధన్, లేపాక్షి ఎస్సై నరేంద్రలను ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

## పచ్చదనం మాటల్లోనేనా...! -నీడనిచ్చే చెట్లపై కత్తెర...!!

### -మండుటెండల్లో డివైడర్ చెట్ల కొమ్మల నరికివేత -ప్రధాన రహదారిపై నిలువ నీడ లేకుండా చేశారంటూ ఆవేదన





ప్రజాభూమి, హిందూపురం టౌన్

మండుతున్న ఎండల్లో ప్రజలకు ఉపశమనం కలిగించే చెట్లనే మున్సిపల్ అధికారులు కత్తిరించడంతో హిందూపురం పట్టణ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో డివైడర్ మధ్య ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను సోమవారం మున్సిపల్ సిబ్బంది భారీగా నరికివేశారు. దీంతో రహదారి మొత్తం ఎండిన చెట్ల మొద్దులు, నరికివేసిన కొమ్మలతో కనిపిస్తూ ప్రజల్లో ఆవేదన కలిగిస్తోంది. పట్టణ సుందరీకరణ పేరుతో చేపట్టిన ఈ చర్య పర్యావరణ ప్రేమికులను కలవరపెడుతోంది. రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఎండల మధ్య చెట్ల నీడపైనే ఆధారపడుతుంటారు. అయితే ప్రస్తుతం చెట్లకు ఉన్న కొమ్మలను పూర్తిగా తొలగించడంతో ప్రధాన రహదారిపై నిలువ నీడ లేకుండా పోయిందని ప్రజలు మండిపడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం "చెట్లను పెంచుదాం -- పచ్చదనాన్ని కాపాడుదాం" అంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తుండగా, మరోవైపు అడ్డు చెప్పాల్సిన మున్సిపల్ అధికారులే చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా హిందూపురం వంటి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో చెట్లు ప్రజలకు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయని, అలాంటి చెట్లను ఈ విధంగా కత్తిరించడం బాధాకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. డివైడర్ మొత్తం నరికివేసిన కొమ్మలతో నిండిపోయింది. చెట్లకు ఆకులు లేకుండా పోవడంతో అవి ఎండిపోయిన దిమ్మెల్లా కనిపిస్తున్నాయి. రహదారి వెంట ప్రయాణించే ప్రజలు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ తీగలు కూడా లేవు.. మరి ఎందుకు నరికివేత అంటూ ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తే ప్రమాదాల నివారణ కోసం కత్తిరింపు చేపడతారు. అయితే ఈ ప్రాంతంలో చెట్ల పక్కనే ఎలాంటి విద్యుత్ తీగలు కూడా లేకపోయినా చెట్ల కొమ్మలను పూర్తిగా నరికివేయడం అనుమానాలకు తావిస్తోంది. అవసరం లేకుండానే చెట్లను ఈ స్థాయిలో కత్తిరించడం వెనుక కారణం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ తీగలు ఉంటే ఒక అర్థం ఉంటుందని తీగలే లేని చోట చెట్లను నరికేయడం దారుణం అంటూ పలువురు స్థానికులు మండిపడుతున్నారు. చెట్లను శాస్త్రీయ పద్ధతిలో సంరక్షించాల్సిందిపోయి పూర్తిగా నీడ లేకుండా చేయడం సరైంది కాదని పర్యావరణ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. తగ్గుతున్న పచ్చదనం**

ఇప్పటికే పట్టణంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కాంక్రీట్ భవనాలు, వాహనాల కాలుష్యం మధ్య చెట్లే ప్రజలకు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో చెట్ల కొమ్మలను విచక్షణారహితంగా నరికివేయడం వల్ల భవిష్యత్తులో వేడి తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా చెట్లను నరికి వేయడం పై పర్యావరణ ప్రేమికులు మున్సిపల్ కమిషనర్ ను అడగ్గా త్వరలో వర్షాలు కురుస్తాయని, చెట్లు ఏపుగా పెరగాలన్న ఉద్దేశంతో కొమ్మలను కత్తిరిస్తున్నామని సమాధానం చెప్పినట్టు సమాచారం. ఏది ఏమైనా తీవ్ర ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు చెట్లు నరికి వేయడం మింగుడు పడడం లేదు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
మంగళవారం 19 మే 2026

# ధర్మేంద్ర ప్రధాన్ ను ఎందుకు భర్తరఫ్ చేయట్లేదు

## పేపర్ లీకేజీలపై మాట్లాడడం లేదు ఎందుకు -కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య



ప్రజా భూమి, కడప సిటీ :
నీట్ ప్రశ్నాపత్నం లీకేజీ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య సోమవారం తీవ్ర స్థాయిలో స్పందించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో ప్రశ్న పత్రాలు పదేపదే లీక్ అవుతున్నా ఆయన ఎందుకు పదవి నుంచి బర్తరఫ్ చేయడం లేదని ప్రధాని మోడీని నిలదీశారు. అంతేకాక, ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు బండి జకరయ్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 లో నీట్ ప్రశ్నాపత్రం లీక్ అయింది. పరీక్షను రద్దు చేయలేదు.మంత్రి రాజీనామా చేయలేదు. సిబిఐ దర్యాప్తు చేపట్టింది ఓ విచారణ కమిటీ వేశారు మళ్లీ 2026 నీట్ ప్రశ్నాపత్రం లీకయింది. పరీక్ష రద్దయింది. మంత్రి ఇప్పటికి రాజీనామా చేయలేదు. మళ్లీ సిబిఐ విచారణ చేపట్టింది. విచారణకు మరో కమిటీ ఏర్పాటు అయింది. ఎందుకు ప్రశ్నాపత్రాలు పదేపదే లీక్ అవుతున్నాయి. పరీక్షా పే చర్చ పరీక్ష ప్రశ్న పత్రాలు లీకేజీ పై మీరెందుకు ఎప్పుడు మౌనంగా ఉంటున్నారు. వరు సగా విఫలమవుతున్నా విద్య శాఖ మంత్రిని మీరు ఎందుకు బర్తరఫ్ చేయడం లేదు.ప్రధా ని మోడీ దీనికి సమాధానం చెప్పాలి అంటూ ఆయన ధ్వజమెత్తారు.మంగళవారం పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి తో రాష్ట్రస్థాయి సమావేశంఎన్.డి.విజయ జ్యోతి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలుమంగళవారం 19వ తేదీ ఉదయం10 గంట ల నుండి సాయంత్రం నాలుగ గంటల వరకు విజయవాడల ని ఏ కన్వెన్షన్ హాలు నందు ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడమైనది ని విజయ జ్యోతి ఒక ప్రకటన లో తెలిపారు.రాష్ట్రంలో కాం గ్రెస్ పార్టీ బలోపేతానికి అనేక జిల్లాల నుండి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరికలు జర గనున్న నేపథ్యంలో ఈ సమావేశంనిర్వహించబడుచున్నది. వైయస్సార్ కడప జిల్లా నుం డి విజయవాడలో వైయస్ షర్మిల రెడ్డి సమక్షంలో పార్టీలో చేరే వాళ్ళు ఉన్నారు అన్నారు. ఈ సమావేశానికి జిల్లా, నగర అధ్యక్షులు ఫ్రంటల్ ఆర్గనైజేష న్ రాష్ట్ర అధ్యక్షులు హాజరవుతారు అని బండి జకరయ్య తెలియపరిచారు.

# పెట్రోల్,డీజిల్ ధరలు పెంచి రాష్ట్ర ప్రజలను బాదుడే బాదుడు

- సంపద సృష్టి,సుపరిపాలన అంటే ఇదేనా
- తాళ్లతో బొలెరో వాహనాన్ని లాగుతూ వైకాపా పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన
- ఆర్డీవో చిన్నయ్యకు వినతి పత్రం అందజేసిన వైకాపా నాయకులు





ప్రజాభూమి,పులివెందుల
దేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరల కారణంగా సామాన్య ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందుల ను దృష్టిలో పెట్టుకొని ఇకనైనా ఈ చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని, ఏదైతే మేనిఫెస్టో లో హామీ ఇచ్చిన విధంగా పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించకపోగా ఏ రాష్ట్రం లో లేని విధంగా పెట్రోలు డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో సోమవారం నిరసన తెలిపి ఆర్డీవో చిన్నయ్యకు మున్సిపల్ వైకాపా ఇన్చార్జులు వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి , తొండూరు మండల వైకాపా ఇన్చార్జ్ వైయస్ మదన్మోహన్ రెడ్డి లు వైకాపా నాయకులతో కలిసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపద సృష్టి,సుపరిపాలన అంటే ఇదేనా దేశంలో ఎక్కడ లేని విధంగా ఆంధ్ర ప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరగడం జరిగిందన్నారు. మేనిఫెస్టోలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచమని చెప్పి ఇప్పుడు ఏకంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు . పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన ఇటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. చంద్ర బాబు నాయుడు ప్రభుత్వంలో ఎరువులు విపరీతంగా ధరలు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానా లపై వైకాపా పార్టీ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుందన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించా లని వారు డిమాండ్ చేశారు. అంతకుముందుగా వైయస్ పాల్ రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపము నుండి బొలెరో వాహనానికి తాళ్లు కట్టి లాక్కుంటూ ఆర్డీవో కార్యాలయం వరకు పెంచిన పెట్రోల్, డీజల్ ధరలు వెంటనే తగ్గించాలని నినాదాలు చేస్తూ ఆర్డిఓ కార్యాలయం నిరసన ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు సాంబశివారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, సింహాద్రిపురం మండల అధ్యక్షు డు శ్రీకాంత్ రెడ్డి, మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడుహాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్య క్షుడు పార్నపల్లి కిషోర్, లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబు రెడ్డి, మాజీ చైర్మన్ రసూల్, చెన్నూరు కార్తీక్, దాసరి చంద్రమౌళి, ఫక్రుద్దీన్ , సంపత్, శ్రీరాములు, రవికుమార్, ఎస్టి నాయకులు చెన్నకేశవులు, అంజనప్ప, మల్లీ, చలపతి, వెంకటపతి, రాజేష్, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పులివెందుల మున్సిపాలిటీని కైవశం చేసుకుని టిడిపి జెండా ఎగరవేయడమే లక్ష్యం

## ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం -ప్రజా దర్బార్ లో బీటెక్ రవి



ప్రజాభూమి,పులివెందుల
జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో పులివెందు లలో టిడిపి జెండా ఎగరవేయడం లక్ష్యమని, రైతుల ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వ మని, రాష్ట్రంలో వైకాపా పని అయిపోయింది అని, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బీటెక్ రవి అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గం నుండి వచ్చిన ప్రజల నుండి పలు సమస్యలను సావదానంగా విని , వారిచ్చిన అర్జీలనుస్వీకరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను అన్నారు. పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా ప్రధాన ధ్యేయం అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకటి ఒకటి నెరవేర్చుకుంటూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోరం ఉన్నా కూలబడ్డ సభ

## మండల సమావేశం నుండి ఎంపీటీసీల వాకౌట్



ప్రజాభూమి, సిద్దవటం: మండలకేంద్రమైన సిద్దవటంలో సోమవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీటీసీల బహిష్కరణతో మరోసారి వాయిదా పడింది. ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరగాల్సిన ఈ సమావేశానికి కోరం ఉన్నప్పటికీ, సభ్యులు సభను బాయ్‌కాట్ చేశారు. తాము సమావేశంలో పాల్గొనాలంటే మొదట ఎంపీపీ చేత సంతకం చేయించాలని మాచుపల్లి ఎంపీటీసీ నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాధవరం-1 ఎంపీటీసీ దేరంగుల శివయ్య, టక్కోలు ఎంపీటీసీ నేలటూరి వెంకట సుబ్బమ్మ, బొగ్గిడివారి పల్లి ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డిలు ఎంపీడీఓకు స్పష్టం చేశారు. ఎంపీపీ మానసిక స్థితి సరిగా లేదని, ఆమె సంతకం కూడా చేయలేని స్థితిలో ఉన్నారని దేరంగుల శివయ్య అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై పి. కొత్తపల్లి వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి స్పందిస్తూ.. ఎంపీపీ ఆరోగ్యం సహకరించడం లేదని సభకు తెలపడంతో, ఎంపీటీసీ సభ్యులంతా సమావేశం నుండి బయటకు నడిచారు. సభ్యుల బహిష్కరణతో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజ కుమారి ప్రకటించారు. తదుపరి సమావేశ తేదీని జెడ్పీ సీఈఓ అనుమతితో త్వరలోనే ఎంపీటీసీలకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మాధవి లత, ఎంఈఓ అరుణ, ఏవో సోమశేఖర్, వివిధ శాఖల ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పులివెందుల మున్సిపాలిటీ వార్డులు పెంపు



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల మున్సిపాలిటీలో 33 వార్డుల నుంచి 40 వార్డులుగా పెంచు తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ మునిసిపల్ అధికారులతో కలిసి విభజన పత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ లో 60 వేల జనాభా దాటి 80 వేల లోపు జనాభా ఉండడంతో వార్డుల సంఖ్య పెంచాలని ప్రభు త్వం నిర్ణయించిందన్నారు. కావున గతంలో 33 వార్డుల ను పులివెందుల మున్సిపల్ వార్డులను 40 వార్డులుగా, జనాభా, ఓటర్ల సంఖ్య ప్రతిపాదికన విభజిస్తూ తయారుచేసిన ముసాయిదా వార్డు విభజన ప్రతిపాదనలకు సంబంధించి ఫారం వన్ ను ప్రజల పరిశీలించేందుకు పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం తో సహా ఆర్డిఓ, పోస్ట్ ఆఫీస్, కోర్టు,తహశీల్దార్ కార్యాలయం,అర్బన్ పోలీస్ స్టేషన్ కార్యాలయం సబ్ రిజిస్టర్ కార్యాల యాలు లో నోటీసు బోర్డులలో ప్రజలకు అందుబా టులో ఉంచడం జరుగుతుందన్నారు. వార్డుల సంఖ్య పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజులలోపు కమిషనర్ దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకురావాలని ఆయన కోరారు.

# వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా ప్రజలకు అవగాహన

## - ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్‌సీడీ, ఓపీడి సేవలు



ప్రజాభూమి, వేంపల్లె
వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా రక్తపోటుకు గల కారణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డా. సురేష్ బాబు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఎన్‌సీడీ, ఓపీడి సేవలు నిర్వహించారు. ఎన్‌సీడీ సేవల్లో భాగంగా ఫిజియోథెరపీ వైద్యురాలు డా. దీప ప్రజలకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. వేంపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థో, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆప్తాల్, అనస్థీషియా, ఎన్‌బీఎస్‌యూ సేవలు కూడా అందించారు. అనంతరం డా. సురేష్ బాబు మాట్లాడుతూ పై సేవలన్నీ ప్రతినిత్యం అందుబాటులో ఉంటాయని, వేంపల్లె ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# జూదం, కోడి పందాల నివారణకు డ్రోన్ బీట్

## - గ్రామ పరిసరాల్లో డ్రోన్ బీట్ నిర్వహణ- సీఐ టి. నరసింహులు



ప్రజాభూమి, వేంపల్లె
జూదం, కోడి పందాలు మరియు ఇతర సంఘ వ్యతిరేక కార్యకలాపాలను నివారిం చేందుకు రామిరెడ్డిపల్లి, ముత్తుకూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ బీట్ నిర్వహించినట్లు సీఐ టి. నరసింహులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆ దేశాల మేరకు చేపట్టిన ఈ డ్రోన్ బీట్‌లో గ్రామ శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, అనుమానాస్పద ప్రాంతాలను డ్రోన్ సాయంతో పరిశీలించినట్లు సీఐ వెల్లడించారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ టి. నరసింహులు హెచ్చరించారు. జూదం, కోడి పందాలు వంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. ఈ డ్రోన్ బీట్‌లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ షాపులు బంద్ నిర్వహించాలనుకోవడం దారుణం

## రోగులు ఎంత ఇబ్బంది పడతారో ఒకసారి ఆలోచించండి

## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల
ఈనెల 20వ తేదీ దేశ వ్యాప్తంగా మెడికల్ షాప్ యజమానులు నిరసన వ్యక్తం చేస్తూ బంద్‌కు పిలుపును ఇవ్వడం దారుణమని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జ్ (సమన్వ యకర్త )మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బందు రోజున ప్రజలకు, రోగులకు మందులు అందుబాటులో లేక ఎన్ని ఇబ్బందులు పడుతారో ఓ సారి ఆలోచించాలి ఆయన అన్నారు. కేవలం ఆన్లైన్ ద్వారా మందులు తెప్పించు కుంటారానే నెపంతో బంద్ పాటించడం సమంజసమా అని ప్రశ్నించారు. బంద్ పాటించకుండా సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలే తప్ప? ఇలా బంద్ పాటించడం తప్పిదం అవుతుంది అన్నారు. ఆ రోజు రోగులకు మందులు దొరకకుండా ఎన్ని ఇబ్బందులు పడుతారో ఓ సారి ఆలోచించండి ఆయన మెడికల్ స్టోర్ యజమానులను కోరారు. బందు రోజున ఏ ఒక్కరికీ ఇబ్బంది కలిగిన మీరే బాధ్యులవుతారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలోధర్నా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా బందును విరమించుకొని చర్చలు జరుపుకోవాలన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం దేశానికే గర్వ కారణం

## తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి యనమల సుధాకర్



ప్రజాభూమి పోరుమామిళ్ల :
మహానాడు పై తీసుకున్న నిర్ణయం మరోసారి దేశానికి ఆదర్శంగా, గర్వకారణంగా నిలిచిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చరిత్రలో నిలిచిపోయే విధంగా అద్భుతమైన నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి యనమల సుధాకర్ కొనియాడారు. సోమవారం ఆయన తమ కార్యాలయంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎంతో ఉత్సాహంగా నిర్వహించే మహానాడు పండుగను దేశ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్పందిస్తూ మహానాడు పండుగను వర్చువల్ పద్ధతిలో నిర్వహించాలనేది తీసుకున్న నిర్ణయం గొప్ప బాధ్యతాయుతమైనదిగా పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ లేని విధంగా ప్రజల ప్రయోజనాలను ముందుగానే ఆలోచిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే రోల్ మోడల్ గా నిలిపిన నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం నిజంగా అభినందనీయమైనది. తెలుగుదేశం పార్టీ శ్రేణులకు మహానుడు అనేది భావోద్వేగపూరిత వేడుక అయినప్పటికీ దేశ పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ప్రతి ఒక్కరు స్వాగతించి అభినందించాల్సిన అవసరం ఉంది. 2006 వర్చువల్ పద్ధతిలో మహానాడు నిర్వహణ రెండు రోజులపాటు నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ పొదుపు చర్యల్లో భాగంగా కీలక నిర్ణయం తీసుకున్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్లో ప్రత్యేక స్టేజి ఏర్పాటు చేసి ఆన్లైన్లో మహానాడు నిర్వహణ రాష్ట్రవ్యాప్తంగా 1,845 కస్టర్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొనే విధంగా ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొనే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు సాంకేతికతను వినియోగిస్తూ సాంప్రదాయాన్ని కొనసాగించే వినూత్న ఆలోచనతో తెలుగుదేశం పార్టీ మరోసారి దేశానికే మార్గదర్శంగా నిలిచిందని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్ అన్నారు.

# సచివాలయం వెళ్ళే దారిలో పారిశుధ్య పనులు

## చెత్త రోడ్డుపై వేస్తే చర్యలు తప్పవు!



ప్రజాభూమి, సిద్దవటం: మండల పరిధిలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈఓపీఆర్డీ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీ నరసయ్య ఆదేశాల మేరకు, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో సోమ వారం సచివాల యానికి వెళ్లే ప్రధాన రహదారిలో పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, పెంటదిబ్బలను కార్మికులు పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. ఈ సంద ర్భంగా పంచాయతీ అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరించే ట్రాక్టర్ వస్తుందని, ప్రజలంతా చెత్తను ట్రాక్టరులోనే వేయాలని సూచించారు. అలా కాకుండా రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసి పరిసరాలను అపరిశుభ్రం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి సామూహిక బాధ్యత అని టీడీపీ నాయకుడు గంజి సుబ్బరాయుడు పేర్కొన్నారు. గ్రామం శుభ్రంగా ఉంటే దోమల బెడద తప్పుతుందని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యం బాగుంటుందని ఆయన తెలిపారు. అధికారులు చేపట్టిన ఈ పారిశుధ్య కార్యక్రమానికి గ్రామ ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

# సిద్ధవటంలో రైతులకు జీలగ విత్తనాల పంపిణీ



ప్రజాభూమి, సిద్దవటం: మండల కేంద్రం లో రైతులకు జీలగ విత్తనాల పంపిణీ ప్రారంభించినట్లు వ్యవసాయ శాఖ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి సోమవారం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, నగదు చెల్లించిన రైతులకు ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సిద్ధవటం మండలానికి ప్రభుత్వం మొత్తం 100 క్వింటాళ్ల జీలగ విత్తనాలను మంజూరు చేసిందని ఆయన వివరించారు. అర్హులైన రైతులందరూ తమకు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ విత్తనాలను తీసుకోవచ్చని ఏఈఓ సూచించారు.

# ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

## -ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు




ప్రజాభూమి,పులివెందుల
ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు అన్నారు. సోమవారం ఆయన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో సిఐ గా బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ను తూచా తప్పకుండా పాటించాలని మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలను ఉంచరాదన్నారు. వాహనాలను నడిపేటప్పుడు లైసెన్సులు,వాహనాలకు సంబంధిం చిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సీఐ శ్రీరామ్ కు ధన్యవాదాలు తెలిపిన చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పరిధిలో పల్సర్ బైక్ డిసెంబర్ 6, 2025 తేదీన వాహనం చోరీకి గురి కాబడినది. అప్పటి నుండి పోలీస్ స్టేషన్ కు బైక్ కోసం పోలీసులను ఆశ్రయిస్తూనే ఉ న్నానని ఎర్రగుంట్లకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటినుండి ఇప్పటివరకు నా పల్సర్ బండిని పోలీసులు చేదించలేదన్నారు. సిఐ శ్రీరామ్ వచ్చిన తర్వాత మే 6 తేదీన దొంగలను పట్టుకొని తన పల్సర్ వాహనం నాకు స్వాధీనం చేశారు అన్నారు. దీంతో డిఎస్పి మురళి నాయక్ కు, సీఐ శ్రీరామ్ కు ,ఎస్సై మధుసూదన్ రెడ్డికి, ఏఎస్ఐ వర్మ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
మంగళవారం 19 మే 2026

## జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కి, సాదరస్వాగతం



ప్రజాభూమి ప్రతినిధి -తిరుపతి, సోమవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ మరియు స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,కి జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ రేణిగుంట ఎయిర్పోర్ట్ లో సాదర స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి , ప్రజా ప్రతినిధులు తదితరులు జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ మరియు స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,కి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కరకంబాడి, గొల్లపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట పోలీస్ వారి,సమాచారం మేరకు ఆదివారం అనగా 17-05-2026 వ తేదీన సాయంత్రం సుమారు 6-00 గంటల సమయంలో రేణిగుంట -- కోడూరు మెయిన్ రోడ్డులోని గొల్లపల్లి క్రాస్ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్ నెంబర్ఏపీ 03ఏడబ్ల్యూ 2507 పై ప్రయాణిస్తూ రోడ్డుపై పడిపోయి తలకు తీవ్ర రక్త గాయాలు పొందిన సంఘటన జరిగింది. స్థానికులు గమనించి వెంటనే గాయపడిన వ్యక్తిని సమీపంలోని అమర హాస్పిటల్‌కు తరలించి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వైద్యుల ప్రాథమిక సమాచారం ప్రకారం గాయపడిన వ్యక్తి మద్యం సేవించి ఉండవచ్చని, తనకు తానే వాహనంపై నుండి పడిపోయి ఉండే అవకాశం ఉన్నట్లు తెలియజేశారు. సదరు మోటార్ సైకిల్ వివరాల ఆధారంగా వాహన యజమానులను సంప్రదించగా, వారు వాహనం ఫైనాన్స్ ద్వారా ఇతరులకు ఇచ్చినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ వాహనాన్ని ఎవరు వినియోగిస్తున్నారనే సమాచారం అందుబాటులో లేకపోవడంతో గాయపడిన వ్యక్తి యొక్క పూర్తి వివరాలు తెలియరాలేదు. కావున గాయపడిన వ్యక్తి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు వెంటనే రేణిగుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించవలసిందిగా, తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అపార్ట్మెంట్ల మురికి నీటితో ప్రజల అవస్థలు

### డ్రైనేజ్ వ్యవస్థను గాలికి వదిలేసిన అధికారులు యాజమాన్యం



ప్రజాభూమి ప్రతినిధి, వరదయ్యపాలెం
తిరుపతి జిల్లా తడ మండల పరిధిలో విచ్చలవిడిగా వెలిసిన అపార్ట్మెంట్ల నుంచి వెలువడుతున్న డ్రైనేజ్ మురుగు నీరు రోడ్లపైకి చేరుతూ ప్రజల జీవితాలను దుర్భరంగా మారుస్తోంది. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో అపార్ట్మెంట్ల మురుగు నీరు వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం పంచాయతీ పరిధిలోని రాచకండ్రిగ రహదారి పక్కనే ప్రవహిస్తూ తీవ్ర దుర్వాసనకు కారణమవుతోంది. రోడ్డు ప్రక్కన నివసిస్తున్న ప్రజలు రోజూ ఈ మురికి నీటి మధ్యే సంచరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారిపైకి చేరిన మురుగు నీటితో దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్లు నిర్మించడంలో చూపుతున్న వేగం, డ్రైనేజ్ సదుపాయాల ఏర్పాటు విషయంలో కనిపించడం లేదు. అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంతో మా పరిస్థితి దయనీయంగా మారింది అని స్థానికులు మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అపార్ట్మెంట్ల నుంచి వస్తున్న మురుగు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని, సరైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలను ఈ నరకయాతన నుంచి విముక్తి కల్పించాలని రాచకండ్రిగ ప్రజలు వేడుకుంటున్నారు

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై బి.ఎన్. కండ్రిగలో వైసీపీ నిరసన

### ఇంధన ధరల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డ నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల వరుస పెరుగుదలతో పాటు జీఎస్టీల భారం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆరోపిస్తూ బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలో వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు పట్టణంలోని ప్రధాన పెట్రోల్ బంక్ ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేశ్ సూచనలతో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు కె. మణి నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కె. మణి నాయుడు మాట్లాడుతూ, "ఇంధన ధరల పెరుగుదలతో సాధారణ ప్రజల జీవనం భారంగా మారింది. పెట్రోల్, డీజిల్‌పై అధిక పన్నులు విధించడం ప్రజా వ్యతిరేక చర్య ప్రభుత్వం వెంటనే ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలి అని డిమాండ్ చేశారు అనంతరం తహసిల్దార్ లక్ష్మీనారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాధం, జిల్లా క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, ఆర్టీఐ విభాగం నాయకుడు రవి రెడ్డి, వైస్ ఎంపీపీ బాబు రెడ్డి, నాయకులు అజయ్ రెడ్డి, జయచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ గురవయ్య, దేవదాసు రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగూర్, వెంకటకృష్ణయ్య, ప్రసాద్, ధర్మయ్య, శివయ్య, కిరణ్ యాదవ్, కత్తి శివ, సిద్ధేశ్వర్, శేఖర్, దినకర్ తదితరులు పాల్గొన్నారు అలాగే యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.

# ఘనంగా శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవన ప్రారంభోత్సవం

- రూ. 2.75 కోట్లతో అత్యాధునిక వసతులతో పోలీస్ స్టేషన్ నిర్మాణం
- సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా కేసుల పరిష్కారం
- భక్తుల భద్రత, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు







ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్
ఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నన్స్ లో పేద ప్రజలకు పోలీస్ సేవలు మరింత సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎం ఎల్ ఏ బొజ్జల సుధీర్ రెడ్డి కలసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి మాట్లాడతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రజలకు జవాబుదారీతనం ఉండేలా రూ.2.75 కోట్ల వ్యయంతో శ్రీకాళహస్తి 2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రజలకు అందించే సేవల పై పోలీస్ శాఖ స్పష్టతతో పని చేస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్ లో భాగంగా పేద ప్రజలకు పోలీస్ సేవలు మరింత సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటిని పరిష్కరించే తీరును ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. బైక్ చోరీ జరిగినా, ఇతర కేసులు నమోదైనా వాటి పురోగతిని జిల్లా ఎస్పీతో పాటు హోం శాఖ ఒకే డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిశీలించే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నామని వెల్లడించారు. సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పోలీస్ స్టేషన్ జిల్లాలోనే ది బెస్ట్ పోలీస్ స్టేషన్‌గా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ భవన నిర్మాణంలో కృషి చేసిన జిల్లా ఎస్పీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్రీకాళహస్తి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమని, ప్రతి రోజు వేలాది మంది భక్తులు దర్శనార్థం వస్తున్న నేపథ్యంలో వారి భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించడమే కాకుండా, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ స్టేషన్లు అత్యాధునిక రూపాన్ని సంతరించుకుంటున్నాయని, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి దూరదృష్టి ప్రధాన కారణమని అన్నారు. పోలీస్ స్టేషన్లు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ, పారదర్శక పాలనకు కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఈ సరికొత్త వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బాధితుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించే విధానం అమలులో ఉందని చెప్పారు. హోం మంత్రి, జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా డిజిటల్ డెస్క్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. దీని ద్వారా కేసుల పరిష్కారం మరింత వేగవంతమవుతోందన్నారు. రూ. 2.75 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అత్యాధునిక పోలీస్ స్టేషన్ జిల్లాలోనే అత్యుత్తమ పోలీస్ స్టేషన్‌గా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, ఆలయ పరిసరాల్లోని నిఘా వ్యవస్థలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా శివరాత్రి వంటి భారీ ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించడం సంతోషకర విషయమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ సహా పోలీస్ శాఖ అధికారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, వారి కృషి వల్లే ఈ భవనం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. 2008లో ఈ పోలీస్ స్టేషన్ ప్రారంభమైందని, అనంతరం 2018లో నూతన భవనానికి శంకుస్థాపన జరిగినప్పటికీ గత కొన్నేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన అనంతరం పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రారంభోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు.

# ఏటీఎంలలో కొత్త తరహా మోసాలు...

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: చిత్తూరు ఎస్పీ తుషార్ డూడి



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు
దేశవ్యాప్తంగా ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కొత్త తరహా మోసాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును సురక్షితంగా ఉంచుకునేందుకు బ్యాంకులు, ఏటీఎంలను వినియోగిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతంలో వెలుగుచూసిన "క్యాష్ ట్రాప్" తరహా ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మోసగాళ్లు ఏటీఎంలలో నగదు బయటకు వచ్చే స్లాట్‌లో కనిపించకుండా ప్లాస్టిక్ ఫైబర్ లేదా ప్రత్యేక కార్డులను అమర్చి, ఖాతాదారులు డబ్బు డ్రా చేసిన తర్వాత నగదు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని వివరించారు. లావాదేవీ విజయవంతమైందని స్క్రీన్‌పై చూపించినప్పటికీ డబ్బు చేతికి అందకపోవడంతో చాలామంది సాంకేతిక లోపమని భావించి అక్కడి నుంచి వెళ్లిపోతుండగా, అనంతరం ముఠా సభ్యులు వచ్చి స్లాట్‌లో ఇరుక్కుపోయిన నగదును దోచుకుంటున్నారని తెలిపారు. ప్రజలు ఏటీఎంలలో డబ్బు డ్రా చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏటీఎంలోకి వెళ్లినప్పుడు కార్డు స్లాట్ లేదా నగదు బయటకు వచ్చే భాగంలో ప్లాస్టిక్, ఫైబర్ లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే ఆ ఏటీఎంను వినియోగించకూడదని, పిన్ నంబర్ నమోదు చేసే సమయంలో తప్పనిసరిగా చేతితో కప్పి ఉంచాలని సూచించారు. లావాదేవీ విజయవంతమైందని చూపించినా నగదు రాకపోతే అక్కడి నుంచి వెళ్లిపోకుండా వెంటనే బ్యాంక్ హెల్ప్‌లైన్ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏటీఎం పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, మోసానికి గురైతే వెంటనే బ్యాంకును సంప్రదించి కార్డును బ్లాక్ చేయడంతో పాటు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద నష్టానికి దారితీస్తుందని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని, అనుమానాస్పద ఘటనలపై వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఆక్రమణల చెర నుంచి చెరువులను కాపాడాలి -- కుమ్మరులకు ఉచితంగా మట్టి అందించాలి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
రాష్ట్రవ్యాప్తంగా చెరువులను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని పునరుద్ధరణ పనులు చేపట్టాలని, అలాగే చెరువుల నుంచి తీసే మట్టిని సంప్రదాయ వృత్తిదారులైన కుమ్మరులకు ఉచితంగా అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సూచించినట్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక చెరువులు ఆక్రమణలకు గురై తమ అసలు రూపాన్ని కోల్పోతున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ కేవలం నీటి నిల్వలకే కాకుండా పర్యావరణ సమతౌల్యానికి, భూగర్భ జలాల పెరుగుదలకు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలను తొలగించి చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరారు. అలాగే సంప్రదాయ మట్టి కళలను ఆధారంగా జీవనం సాగిస్తున్న కుమ్మరి వర్గాలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. చెరువులలో పేరుకుపోయిన మట్టిని వేలం వేయకుండా కుమ్మరులకు ఉచితంగా అందిస్తే వారి జీవనోపాధికి ఊతమివ్వడమే కాకుండా సంప్రదాయ వృత్తులు కూడా పరిరక్షించబడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చెరువుల అభివృద్ధి, సంప్రదాయ వృత్తిదారుల సంక్షేమం అనే రెండు అంశాలను సమన్వయం చేస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, జనతా వారధి కో-కన్వీనర్ తంజా మోహన్, ఓబీసీ నాయకులు కరుణాకర్ రెడ్డి, రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ లక్ష్మీనారాయణ కు వినతిపత్రాల వెల్లువ



ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగ మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో తహసిల్దార్ లక్ష్మీనారాయణ కు ప్రజల నుంచి వినతిపత్రాలు వెల్లువెత్తాయి. మండలంలోని పలు గ్రామాల ప్రజలు భూ వివాదాలు, ఆక్రమణలు, వెబ్‌ల్యాండ్ సమస్యలు, ప్రజా అవసరాలపై తమ వినతులను అధికారులకు సమర్పించారు. మరికొందరు భూ ఆక్రమణలపై తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తహసిల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ముని సుబ్రహ్మణ్యం వెలుగు ఏపీఎం మునయ్య, ఆర్ఐ, నల్లయ్య వీఆర్వోలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 24 వరకు వార్డుల పునర్విభజన ముసాయిదాపై సలహాలు, సూచనల స్వీకరణ

### -కమిషనర్ (ఎఫ్.ఏ.సి)శారదా దేవి.



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
రాష్ట్ర ప్రభుత్వం మార్చి 24వ తేదీ జారీ చేసిన జీవో నెంబర్ 570, సిడిఎంఏ వారి ఉత్తర్వులు తేదీ.25-04-2026 ఆర్‌ఓసి నం.13032/2/2026/1-1 మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 50 ఎన్నికల వార్డులను 66 వార్డులుగా పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను సోమవారం నుండి ప్రచురించినట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డుల సరిహద్దులతో కూడిన ప్రతిపాదిత ముసాయిదాను అధికారికంగా ప్రచురించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముసాయిదాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంకు వ్రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) ఆ ప్రకటనలో కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 301 అర్జీలు

### పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,
పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో డి.ఆర్.ఓ అర్జీదారులకు గౌరవ ప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డి ఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ-190, రూరల్ పావర్టీ-17, పంచాయతీ రాజ్ -16, సర్వే అండ్ ల్యాండ్-15, పోలీస్ -13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్- 11, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ -5, స్కూల్ ఎడ్యుకేషన్ -4, రూరల్ డెవలప్మెంట్ -- 4, ఏ పి ఐ ఐ సి -- 3, గనులు భూ గర్భ వనరులు -2, పబ్లిక్ హెల్త్ -2, మత్స్య శాఖ -2, తుడా -2, ఎం జే పి ఏ పి బి బి సి డబ్ల్యూ ఎడ్యుకేషన్ సొసైటి -2, వాటర్ రిసోర్సెస్ -2, ఏ పి ఎస్ ఆర్ టి సి -1, ఏ పి టౌన్ షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ -1, సోషల్ వెల్ఫేర్ -1, పశు సంవర్ధక శాఖ -1, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు -1, సివిల్ సప్లై -1, ఏ పి ఎస్ సి సి ఎఫ్ టి -- 1, విద్యుత్ శాఖ -1, స్కిల్ డెవలప్మెంట్ -1, టూరిజం -1, సెకండరీ హెల్త్ --మొత్తం 301 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# పోలీస్ సిబ్బంది పిల్లల విద్యా ప్రతిభకు ఘన సన్మానం

- పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతుల ప్రదానం
- విద్యార్థుల కృషిని అభినందించిన రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులు
- ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచన





ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

ఇటీవల నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీస్ సిబ్బంది పిల్లలను, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక శాసన సభ్యులు బొజ్జల సుదీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10 వ తరగతి, ఇంటర్మీడియేట పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులను అందజేసి వారి కృషిని అభినందించారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో తీరికలేని పరిస్థితి ఉన్నప్పటికీ, తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతూ వారికి మంచి విద్య అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో ఉత్తమ విద్యా బోధన విధానాలు ప్రవేశ పెట్టారని, తద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన విజయాలు వారి తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పోలీస్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ వారికి అవసరమైన ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి
- పెట్రోల్ డీజిల్ ధరలపై తగ్గించాలని ఆర్డిఓ ఆఫీసులో అధికారులకు వినతిపత్రం








ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్త పట్టణంలోని వైఎస్ఆర్సిపి శ్రేణులు శ్రీకాళహస్తి ఆర్టీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేస్తూ ఆర్టీవో కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మాట్లాడుతూ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనలతో ఆర్డీవో ఆఫీస్ దగ్గర వైఎస్సార్సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టేమో అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు, లోకేష్ కలిసి జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచారని, తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా పెంచబోమని నమ్మబలికారని విమర్శించారు. కానీ, నేడు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ వంటి పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్నాయని మండిపడ్డారు. ధరలు పెంచడమే కాకుండా రోడ్డు డెవలప్‌మెంట్ సెస్ పేరుతో అదనపు భారాన్ని కూడా మోపుతున్నారని, దీనివల్ల సుమారు 3,391 కోట్ల రూపాయల భారీ ఆర్థిక భారం రాష్ట్ర ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువులైన కూరగాయలు, వంట నూనెలు, ఉప్పు, పప్పులు, బియ్యం వంటి అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. దీనివల్ల రైతులు, కూలీలు, వ్యాపారస్తులు మరియు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కాకముందే ఈ విధమైన ధరల పెరుగుదలపై ప్రజలందరిలో మార్పు రావాలని, ఈ నిరసన కేవలం పార్టీ శ్రేణులది మాత్రమే కాదని, ప్రజలందరి సమస్య అని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళు పూర్తి కాకముందే అన్ని రకాల ధరలను పెంచుకుంటూ పోతోందని, ప్రజల్లో మార్పు రావాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు జరుగుతుంటే, కాళహస్తిలో మాత్రం ప్రత్యేకంగా 'పోలీస్ రాజ్యాంగం' నడుస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలను కూడా జరగనీయకుండా అడ్డుకుంటున్నారని, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి బ్యానర్లను కడితే, కనీసం ఒక్క రోజు కూడా ఉంచకుండా మున్సిపల్ సిబ్బందితో నిరంకుశంగా చింపించేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల పాత్ర ఎంతో కీలకమని గుర్తు చేస్తూ, రాజకీయ విద్వేషాలతో నోటీసులు లేకుండానే 24 మున్సిపల్ రూములను ఖాళీ చేయిస్తున్నారని, ఈ విధమైన చర్యలు తగవని ఆయన హితవు పలికారు.ఎటువంటి నోటీసులు మరియు అద్దె బకాయిలు లేకపోయినా 24 దుకాణాలను మున్సిపల్ అధికారులు మూసివేశారని ఆరోపించారు. దీనిపై తాము మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌ను కలవడంతో రెండు గంటల్లోనే 21 దుకాణాలను తెరిపించారని, అయితే ఇంకా 3 దుకాణాలను పెండింగ్‌లో ఉంచారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఒక అధికారిలా కాకుండా తెలుగుదేశం పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అలా చేయాలనుకుంటే ఆయన తన డ్రెస్ కోడ్ మార్చుకోవాలని, లోగో వేసుకుని కార్యకర్తలా పనిచేయాలని మండిపడ్డారు. పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో ఎన్నో రోజుల నుండి ఉన్న టీడీపీ బ్యానర్లను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. చివరకు, దేవుడికి సంబంధించిన "వాహన మండపం" పై ఉన్న బ్యానర్లను కూడా తీయలేదని ఆరోపిస్తూ, కమిషనర్‌కు నిజాయితీ ఉంటే 24 గంటల్లోగా ఆ బ్యానర్లన్నింటినీ తొలగించి తన నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్య నాయుడు, వయ్యాల మనోహర్ రెడ్డి, కొత్తపాటి శ్రీనివాసులు రెడ్డి,మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీద్,యువజన విభాగం అధ్యక్షులు శ్రీవారి నరేష్, కంట ఉదయ్ కుమార్, ముని కృష్ణారెడ్డి,పులి రామచంద్ర, మధు రెడ్డి, ప్రకాశం పంతులు,పసల కృష్ణయ్య,అస్లాం,ఆర్కార్డు శంకర్, ఆవుల శ్రీనివాసులు, ఆర్కార్డు కార్తిక్,సాదిక్, జూమ్లేష,జై కృష్ణ, విజయ్ కుమార్ రెడ్డి,దూదేకుల బాబు, కాణిపాకం సురేష్,అట్ల రమేష్, చింత రాజేంద్ర, సుధాకర్ రెడ్డి, వంశీ,భాను, గురునాథం, నారాయణ, వెంకటేశ్వర్లు నాయుడు,దేవా,గిరి, మనోహర్, సాయి,సుధీర్, సూర్య,రాము, యాకూబ్,చందు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలంటే వైఎస్ఆర్సిపి నాయకులు ర్యాలీ నిరసన

## కుప్పం యువ గళంపాదయాత్రలో ఇచ్చిన మాట నారా లోకేష్ నిలబెట్టుకోవాలి



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేదు

గత ఎన్నికల సమయంలో టిడిపి ప్రభుత్వం పెట్రోలు డీజిల్ పెంచమని చెప్పి నేడు మాట తప్పిన ప్రభుత్వంగా ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారని అదియును గాక రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ గతంలో యువ గళం పాదయాత్రలో భాగంగా కుప్పం నియోజకవర్గానికి వచ్చినప్పుడు పక్క రాష్ట్రమైన కర్ణాటకలో ఇటు తమిళనాడు లో పెట్రోల్ డీజిల్ ధరలు సుమారు ఎనిమిది రూపాయలు నుండి తొమ్మిది రూపాయలు తక్కువగా ఉన్నాయని మేము అధికారంలో వస్తే పెట్రోల్ డీజిల్ పెంచమని చెప్పినా నారా లోకేష్ నేడు రాష్ట్రంలో 3. 30 పైసలు పెంచడం ఎంతవరకు సమంజసం అని వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏవీఎం బాలాజీ రెడ్డి పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలంటే డిమాండ్ చేశారు. వైయస్సార్సీపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదర్శాల మేరకు సోమవారం నాడు వైయస్సార్ విగ్రహం నుండి స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వరకు డీజిల్ పెట్రోల్ పెంచిన ధరలు తగ్గించాలని నిరసనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పెంచిన ధరల వల్ల నిత్యవసర సరుకులు పెరిగే అవకాశం ఉన్నాయని ఆయన అన్నారు.అనంతరం రెవిన్యూ అధికారికి వినత పత్రాన్ని వైయస్ఆర్ సీపీ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ నాయకులు నిరంజన్ రెడ్డి, ఏవీఎం బుజ్జి రెడ్డి ,ఎంపీటీసీలు బాలయ్య, శరవణ ,రాబిన్ ,సుధాకర్ ,పునీత్ కుమార్ రెడ్డి, మోహన్ రెడ్డి ,సర్పంచులు శేఖర్ ,మధురాజు, ఆనంద్ ,కనకరాజు ,చెంచయ్య, వైసీపీ నాయకులు ఎంపీ రవి, సురేష్, గోపాల్ రెడ్డి ,జీవయ్య, పలని ధనపాల్ రాజేష్ చంద్రబాబు ఈశ్వరయ్య , సురేందర్ రెడ్డి నాగరాజు దయాల్ దేవిడ్ రాము ఇస్మాయిల్ రాహుల్ రమేష్ బాబు రవి గోపి మహిళా నాయకురాలు మస్తానీ బేగం శాంతిలక్ష్మి తదితరులు ఉన్నారు.

# నగరపాలక సంస్థకు 42వినతులు - డిప్యూటీ కమిషనర్ అమరయ్య





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 26మంది వినతులు సమర్పించగా, 15మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తాతా నగర్ నందు అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేస్తున్నారు అడ్డుకోవాలని, లీలామహల్ సమీపంలోని పిఎస్ 4 వద్ద రోడ్డు సైడ్ అక్రమ నిర్మాణలను పరిశీలించాలని, ప్రగతి నగర్ లో రోడ్డు పైన బోర్ వేస్తున్నారు పరిశీలించాలని, పడిపోయేందుకు సిద్ధంగా ప్రమాధాకరంగా ఉన్న చెట్టు తొలగించాలని, మధురా లాడ్జి నిర్మించి 56సంవత్సరాలు అవుతున్నది పునర్నిర్మానికి అనుమతి ఇవ్వాలని, గొల్లవాణిగుంటలో బోటింగ్, సుందరీకరణ చేయాలని, వరదరాజ నగర్ నందు వర్షపు నీరు ఆగిపోతున్నది వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని, అంకుర హాస్పిటల్ రోడ్డు నందు చెట్లకు నీరు పట్టాలని, చెత్త శుభ్రం చేయాలని, వైకుంఠపురం వద్ద కాలువలు మారమ్మత్తులు చేయాలని కోరారు. భూగర్భ డ్రైనేజి మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

# శ్రీ వాయు లింగేశ్వర స్వామి వారి సేవలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సభ్యులు





ప్రజాభూమి ప్రతినిధి : శ్రీకాళహస్తి

దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్వేశ్వర స్వామి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసినారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బీకే వెంకటేశులు, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేయడమైనది. సదరు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బీకే వెంకటేశులు, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, డి. లక్ష్మమ్మ, గోపీనాథ్, ఆలయ ఏ ఈ ఓ విద్యాసాగర్ రెడ్డి. ప్రోటోకాల్ ఏ ఈ ఓ మోహన్, ఏపీ పి ఆర్ ఓ రవి, స్థానిక టీడీపీ నాయకులు వేద పండితులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# సైకిల్లో విధులకు వెళుతున్న ఫారెస్ట్ అధికారి



ప్రజాభూమి ప్రతినిధి : వాకాడు....

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఇంధనం పొదుపులో భాగంగా తమ విధులకు గూడూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు సోమవారం సైకిల్ పై ప్రయాణించారు.ప్రభుత్వం కేటాయించిన వాహనాన్ని పక్కనపెట్టి వాతావరణ కాలుష్యం నివారణ కొరకు,ప్రధానంగా ఇంధనంపొదుపు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం సూచనలతో, తన లక్ష్యసాధనలో భాగంగా తమ విధులను సైకిల్ పైనే నిర్వహించి పలువురు ఉద్యోగులకు ఆదర్శప్రాయుడయ్యాడు గూడూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తండ్రి కూడా తన ఉద్యోగ విధి నిర్వహణలో సైకిల్ మీద వెళ్లి ఉపాధ్యాయ ఉద్యోగం చేసే వారన్నారు,ప్రభుత్వ నిబంధనల ప్రకారం తనవంతుగా భావించి అందరికన్నా ముందు పనిచేయడమే లక్ష్యం అన్నారు,పచ్చదనం, ప్రకృతి సంపద అయిన వన్య ప్రాణులను కాపాడడం,ప్రస్తుత అటవీ ప్రాంతాన్ని కాపాడుతూ ఉద్యోగ జీవితములో వాటికి అధిక ప్రాధాన్యత తో అంకితభావంతో పనిచేస్తున్నాను అన్నారు,ప్రకృతి పర్యావరణ ప్రేమికుడిగా ఆ శాఖలో గుర్తింపు పొంది,విధి నిర్వహణలో ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించి, పలుసార్లు ఉత్తమ ఉద్యోగి గా రాష్ట్ర మంత్రులచె,ఆ శాఖ ఉన్నతాధికారులు,జిల్లా కలెక్టర్లు ద్వారా ఉత్తమ అవార్డులు అందుకున్నారు, రాబోవు రోజుల్లో గాయం శ్రీనివాసులు ప్రభుత్వ ఉద్యోగులకే ల్యాండ్ మార్క్ గా నిలబడతాడు .

# విజేతలకు కప్ అందజేసిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా

## యువతకు స్ఫూర్తిగా నిలిచిన జె.బి.ఎస్ క్రికెట్ టోర్నమెంట్



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్.వి.ఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన జె.బి.ఎస్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌ను నేతాజీ సుభాష్ చంద్రబోస్, మురళి నాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. టోర్నమెంట్‌లో ఎస్.సి.సి క్రికెట్ క్లబ్ వర్మ మురళి టీమ్ అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా హాజరై విజేతలకు కప్ అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని అన్నారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన యువ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్, మురళి నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి యువతకు అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రన్నర్స్ గా నిలిచిన పోలీస్ లెవెన్స్ కు హెడ్ మాస్టర్ హరి కప్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, క్రీడాభిమానులు, పలువురు నాయకులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# తొట్టంబేడు ఎంఈఓ-2గా బి.ముని తిరుమలయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజా భూమి ప్రతినిధి : తొట్టంబేడు

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండల విద్యాశాఖాధికారి-2 ( ఎంఈఓ -2)గా స్థానిక గుండెలుగుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ముని తిరుమలయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డి.భాస్కర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు మునితిరుమలయ్యను ఇన్చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏపీటీఎఫ్ తొట్టంబేడు మండల శాఖ ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ-2 మాట్లాడుతూ, మండలంలో బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎన్‌రోల్‌మెంట్ అయ్యేలా చూడాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, మండల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కాగా, మండలానికి జిల్లా స్థాయిలో మంచి పేరు తీసుకురావడానికి ఏపీటీఎఫ్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మురళీకృష్ణ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రామదాసు, కె.ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజల్ ధరల పెంపుపై వైసిపి నిరసన కార్యక్రమం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్లకార్డులు చేతబట్టుకుని చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వంఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడంపై కదం తొక్కిన వైసీపీ శ్రేణులు.ఎద్దుల బండిని ముందు పెట్టుకుని పాత కాలం ప్రయాణాలను గుర్తు చేసిన వైసీపీ నాయకులు.పెట్రోల్ ధరలను భరించడం కంటే ఆటోకు దారాలు కట్టి లాక్కుని వెళ్లడం ఉత్తమమని వినూత్నంగా ఆటోను లాగిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి. చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి తహశీల్దారు ఆఫీస్ వరకు వైసీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.పెంచిన పెట్రోల్, డీజల్ ధరలను తగ్గించి ప్రజలపై భారాన్ని దించాలని కోరుతూ తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూయువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేసి పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలపై భారాన్ని మోపుతుంటే సహించేది లేదన్నారు.చంద్రబాబు చెప్పేది ఒక్కటి, చేసేది ఒక్కటి అంటూ పార్టీ నేతలతో పాటు ప్రజల నుంచి వ్యక్తమైన విమర్శలు చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి. చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నాయకత్వంవర్ధిల్లాలి.జైజగన్.జైజై జగన్ అంటూ నినాదాలు చేస్తూ పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి.. రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న పెట్రోల్ ట్యాక్స్ ను రద్దు చేసి ప్రజలను ఆదుకోవాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.







# రుయా ఆసుపత్రి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నూతన కమిటి ఎన్నిక.

## అధ్యక్షులుగా సి. మధుబాబు -- ప్రధాన కార్యదర్శిగా ఏ. నరసింహులు -- కోశాధికారిగా ఏ. దయాసాగర్ ఎన్నిక

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతిలోని రుయా ఆసుపత్రి ప్రాంగణంలోని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధ కార్యాలయంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. వేణుగోపాల్ హాజరై కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆసుపత్రిలో పని పరిస్థితులు, సిబ్బంది కొరత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా రుయా ఆసుపత్రి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా సి. మధుబాబు, ప్రధాన కార్యదర్శిగా ఏ. నరసింహులు, కోశాధికారిగా ఏ. దయాసాగర్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా కందారపు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. వేణుగోపాల్, గౌరవ సలహాదారులుగా బి. గురవయ్య, కార్యదర్శిగా రమేష్‌తో పాటు మరో 11 మందిని నూతన ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకోవడం జరిగినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన కె. వేణుగోపాల్, సుమారు 1600 పడకల సామర్థ్యం కలిగిన రాయలసీమ జిల్లాలకు ప్రామాణిక వైద్య సేవలు అందిస్తున్న అతిపెద్ద ఆసుపత్రి అయిన రుయాలో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్ఓల కొరత తీవ్రంగా ఉందన్నారు. తగిన సిబ్బంది లేకపోవడంతో కేవలం 83 మంది ఉద్యోగులతోనే భారీ పనిభారం మోపుతున్నారని, దీనివల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అవసరమైన మేరకు సిబ్బంది నియామకాలు చేపట్టి కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు.రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, సిబ్బంది పెంపు, పని పరిస్థితుల మెరుగుదల కోసం నూతన కమిటీ రాజీలేని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిస్తూ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.యూనియన్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఈ నూతన నాయకత్వం కార్మిక సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాడి న్యాయమైన డిమాండ్ల సాధనలో ముందుంటుందని సీఐటీయూ ఆశాభావం వ్యక్తం చేసింది.

# నా భూమిని నిషేధిత జాబితాల నుండి తొలగించండి- పి అమర్నాథరెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం



మండలంలోని సి రామాపురం లెక్క దాఖలలో నా భూమిని నిషేధిత జాబితా, నోషనల్ ఖాతా నుండి తొలగించి ఆన్లైన్లో నా పేరుతో నమోదు చేయాలని పి అమర్నాథరెడ్డి తహశీ ల్దార్ యు మధుసూదరావును కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదును అందజేశారు. సి రామాపురం లెక్క దగ్గరలో సర్వేనెంబర్ 83/2లోని 0. 53 సెంట్ల పట్టా భూమిని తన తండ్రి పి చంద్రశేఖర్ రెడ్డి దాన సెటిల్మెంట్గా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు కూడా పట్టా భూమిని 22 ఏ నుండి తొలగించి పట్టాదారు పేరున ఆన్లైన్లో నమోదు చేయాలని తీర్పు ఇచ్చినట్లు తీర్పు కాపీని కూడా అందజేశారు. దీనిపై తహశీ ల్దార్ యు మధుసూదన్ రావు స్పందిస్తూ రికార్డులు పరిశీలించి హైకోర్టు తీర్పు మేరకు సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. సోమవారం జరిగిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఆరు రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. అనంతరం అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఫిర్యాదుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సిబ్బంది, రికార్డులు, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అనుపల్లెలో ఒక నెల ఒక గ్రామం.. నాలుగు సందర్శనలు కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం కోసం బుధవారం రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక టీం ఏర్పాటు చేశామని. ఆ టీం అధికారులు అనుపల్లి గ్రామ సచివాలయంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారని, ఫిర్యాదుదారులు తమ వద్ద ఉన్న భూ రికార్డులను రెవెన్యూ టీంకు అందజేయాలన్నారు. గురువారం మూడవ రోజు నిర్వహించే ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనల కార్యక్రమంలో సమస్యలకు..... పరిష్కార నివేదికలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ పీజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీడీవో పులిరాం సింగ్, డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాష, ఎంఈవో లు మార్కండేయ నాయుడు, జయ వేలు, ట్రాన్స్కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి గిరి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు మనీల, రేవతి, డిప్యూటీ ఎంపీడీవో (ఎస్ జి ఎస్ డబ్ల్యూ ) తేజవతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్ రాజు, వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# 19న చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు

## ఆలయ ధర్మకర్త పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అలరించనున్న సినీ ప్రముఖులు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు





తిరుపతి జిల్లా వాకాడు మండలం గొల్లపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 19న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్త,గొల్లపాలెం గ్రామస్తుడు,టిడిపి యువ నాయకుడు, మాజీ ఛావీజ చైర్మన్ పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.సొంత గ్రామమైన గొల్లపాలెంలో ఆలయ అభివృద్ధికి, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక శోభకు టిడిపి యువ నాయకుడు మనోజ్ కుమార్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు.ఏటా బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు.ఈ ఏడాది ప్రత్యేకంగా చెన్నై ఆర్కెస్ట్రా,సినీ హీరోయిన్ హెబ్బా పటేల్ డాన్స్ షో ఏర్పాటు చేసి ఉత్సవాలకు మరింత శోభ తెస్తున్నారు. భక్తులందరూ తప్పక పాల్గొనాలని మాజీ ఛావీజ చైర్మన్, ఆలయ ధర్మకర్త మండలి పాపారెడ్డి .మనోజ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.19వ తేదీ మంగళవారం కార్యక్రమ వివరాలు ఉదయం 8-00 గం.నుండి గోపూజ,గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ హోమం, వేదమంత్రోచ్చారణతో అభిషేకం విశేష అలంకరణలు, అన్నప్రతిష్ఠ

### ప్రధాన హోమములు, విశేష అర్చన,నీరాజనం

మంత్రపుష్పము,తీర్థ ప్రసాద వితరణ. సాయంత్రం 5-30గం. నుండి సామూహిక దీప సహస్రనామావళి కుంకుమ పూజ,తీర్థ ప్రసాద వితరణ.రాత్రి 10-30 గం. నుండి డప్పు వీరులకచేరి, బాజాభజం త్రీలతో భజనమంద వేడుకలు,మంగళ వాయిద్యములతో అమ్మవారి గ్రామోత్సవం. ప్రత్యేక ఆకర్షణలుగా మ్యూజికల్ స్టేజ్ శక్తి ఈవెంట్స్ ఆర్కెస్ట్రా చెన్నై వారితో యాంకర్స్ దివ్య నల్లమత్తు, హనీ వద్దే, సింగర్స్ శ్రీకృష్ణ, సాహితి భార్గవి, దామిని ,డీజే ప్రోగ్రామ్ దిలీప్,నర్తకి మరియు వారి టీమ్ స్పెషల్ డాన్స్ షో ప్రముఖ హీరోయిన్ హెబ్బా పటేల్ తో అదరగొట్టే డాన్స్ ప్రోగ్రాం కలవు

# విద్యతోనే సమాజంలో గౌరవం -ప్రతి విద్యార్థి ఆదర్శంగా ఎదగాలి

## -మైనార్టీ విద్యార్థుల అభినందన సభలో సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



సమాజంలో గౌరవం, గుర్తింపు సాధించాలంటే విద్యే ప్రధాన మార్గమని సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరా రెడ్డి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదువుకుని ఇతరులకు ఆదర్శంగా ఎదగాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని కంచి కామాక్షి కళ్యాణమంటపంలో సోమవారం అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన "మైనార్టీ విద్యార్థుల అభినందన సభ--2026"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దాదాపు 120 మంది విద్యార్థులకు "షహీద్ టిప్పు సుల్తాన్ ప్రతిభా పురస్కారాలు" అందజేశారు. కార్యక్రమానికి అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూక్ ఖాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. మైనార్టీ వర్గాల అభివృద్ధికి విద్యే ఆయుధమని, తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. చదువులో రాణిస్తున్న విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ మాట్లాడుతూ, విద్య ద్వారానే మైనార్టీ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందగలరన్నారు. యువత ఉన్నత విద్యపై దృష్టి పెట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బెంగళూరు ఆధ్యాత్మిక గురువులు బజ్మ్-ఏ-షాహీన్ అధ్యక్షులు బాబాజీ మాట్లాడుతూ, మతం, సమాజం, కుటుంబ అభివృద్ధికి విద్యే పునాది అని పేర్కొన్నారు. కదిరి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా బాహావుద్దీన్ మాట్లాడుతూ, బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్‌కుమార్, జామియా మసీదు ముతవల్లి అస్లాం, కాంగ్రెస్ నాయకులు కేటీ శ్రీధర్, ప్రముఖ కవి రచయిత డాక్టర్ సమీవుల్లా, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ ముతవల్లీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షకీల్ షఫీ, లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్‌డాక్టర్ నాగేంద్రకుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ముస్లిం మైనార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులతో పాటు వివిధ పాఠశాల, కళాశాలల అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పబ్లిక్ కొళాయిలు తొలగించడం అన్యాయం, పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి-మిద్దెల హరి డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో దశాబ్దాలుగా ప్రజల వినియోగంలో ఉన్న పబ్లిక్ మంచినీటి కొళాయిలను తొలగించడం తీవ్ర అన్యాయమని, వాటిని వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను పత్రికాముఖంగా డిమాండ్ చేస్తున్నామని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరి తెలియజేశారు. గత రెండు రోజులుగా పట్టణంలోని దాదాపు 40కు పైగా పబ్లిక్ మంచినీటి కొళాయిలను తొలగించడం జరిగిందని, ఇంకా మిగిలిన కొళాయిలను కూడా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పేద ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ మంచినీటి కొళాయిలను నిర్వహణ బాధ్యత పురపాలక సంఘ ఇంజనీరింగ్ విభాగానిదేనని పేర్కొన్నారు. పబ్లిక్ మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేయాలన్నా, తొలగించాలన్నా తప్పనిసరిగా మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఉండాలని, సంబంధిత నిబంధనలను అధికారులు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ హోదాలో ఉన్న శ్రీకాళహస్తి ఆర్డీవో (ప్రత్యేక పాలనాధికారి) అనుమతి ఆదేశాలు లేకుండా కొళాయిలను తొలగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అందువల్ల తొలగించిన పబ్లిక్ మంచినీటి కొళాయిలను తక్షణమే పునరుద్ధరించాలని పురపాలక సంఘ కమిషనర్‌తో పాటు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు న్యాయపోరాటం చేపడతామని తెలియజేశారు

# పట్టపగలే ఓ వృద్ధురాలు అయినా మహిళ పై దుండగుడు దాడి...



ప్రజా భూమి ప్రతినిధి : శ్రీ కాళహస్తి.

శ్రీకాళహస్తి టూ టౌన్ పరిధిలో పట్టపగలు వృద్ధురాలిపై దాడి జరిగింది. స్థానికుల వివరాల మేరకు ఇంద్రాణి అనే వృద్దురాలు ఇంట్లో ఒంటరిగా ఉండగా. గుర్తు తెలియని దుండగుడు చైన్ కోసం ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని చైన్ తీసుకునేందుకు కత్తితో దాడి చేశాడు . ఆమె ప్రతిఘటించడంతో నిందితుడు గొంతు కోసే ప్రయత్నం చేయగా ఆమె కేకలు విని స్థానికులు రావడం గమనించిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు . పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు చిత్తూరు పోలీసుల పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 19, 20 తేదీలలో కుప్పం పట్టణంలో జరగనున్న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేయనున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ



సందర్భంగా సోమవారం అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్ ప్రాంతం, ముఖ్యమంత్రి నివాస ప్రాంతం, గంగమ్మ ఆలయం వంటి కీలక ప్రదేశాలను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, అగ్నిమాపక చర్యలు, బారికేడింగ్, వైద్య సేవలు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, జనసమూహ నియంత్రణ చర్యలపై పోలీసు అధికారులకు ఎస్పీ కీలక సూచనలు చేశారు. ముఖ్యమంత్రి దర్శించనున్న గంగమ్మ ఆలయం, నివాసం ఉండే కడపల్లె ప్రాంతాన్ని ప్రత్యేక భద్రతా మండలాలుగా గుర్తించి సమగ్రంగా పరిశీలించారు. పోలీసులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతమైన ప్రణాళికను అమలు చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఫైర్ సర్వీసులు, ఆరోగ్య సేవలు, ట్రాఫిక్ నిర్వహణ, పోలీస్ బందోబస్తు, డ్రోన్ మానిటరింగ్, వీఐపీ మూమెంట్స్ అంశాల్లో ఎటువంటి లోటు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ తరుణ్ పహ్వా, అదనపు ఎస్పీలు రాజశేఖర్ రాజు, దేవదాస్, కుప్పం ఎస్డీపీవో పార్థసారధి, ఫైర్ అధికారి, ఎమ్మార్వో, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజుకు చేరిన నిరసన..




ప్రజా భూమి ప్రతినిధి : శ్రీ కాళహస్తి

ఏపీ ఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర పిలుపు మేరకు శ్రీ కాళహస్తి ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ నాయకులు పురుషోత్తం ఆచారి . లింగమూర్తి . ఆధ్వర్యంలో రెండో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు . జీవో 01/2019 అమలు చేయాలని . కాళీ పోస్టులను భర్తీ చేస్తూ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు . పెండింగ్లో ఉన్న డిఏ . పి ఆర్ సీ . బకాయిలు చెల్లించాలి . ఐ ఆర్ ప్రకటించి కొత్త పిఆర్ సి కమిషనే ను నియమించాలని కోరారు .

# డా.యం.లక్ష్మీనారాయణకు చిరు సత్కారం..



ప్రజా భూమి ప్రతి నిధి : శ్రీకాళహస్తి .

తిరుపతి జిల్లా డెంటల్ సర్జన్ అసోసియేషన్ మొట్టమొదటి అధ్యక్షుడిగా ఎన్నికైన డా. యం. లక్ష్మీనారాయణ సేవాతత్పరత ఎంతోమందికి ఆదర్శనీయమని, శ్రీకాళహస్తికి చెందిన వ్యక్తికి ఇటువంటి అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వారి స్ఫూర్తివంతమైన నాయకత్వంలో దంత వైద్యుల సంఘం ముందుకు వెళ్ళాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# 70 ఏళ్ల శెట్టిపల్లి భూ సమస్యకు ముగింపు.. 2048 మందికి ఇంటి పట్టాల పంపిణీ ప్రారంభం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి శెట్టిపల్లి ప్రాంత ప్రజల దశాబ్దాల భూ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపుతూ ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించింది. తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు ఉ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు సొంతింటి కల నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. శెట్టిపల్లి ప్రాంతంలో అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి ఇంటి పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. ఇంటి స్థలాలతో పాటు రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను కూడా దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా కొనసాగుతున్న శెట్టిపల్లి భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో పరిష్కారం లభించిందన్నారు. 2,048 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ భూ సమస్యలు ఉన్నా భూ సమీకరణ విధానంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ శెట్టిపల్లి ప్రజల దీర్ఘకాల సమస్యను రాజకీయ సంకల్పం, అధికారుల సమన్వయంతో పరిష్కరించగలిగామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ఆధారంగా రోడ్లు, పార్కులు, పాఠశాలలు, వాణిజ్య స్థలాలతో సమగ్ర టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలతో భూ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వేగంగా చర్యలు తీసుకున్నామన్నారు. పేదలపై భారం పడకుండా సుమారు రూ.17.50 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు మాట్లాడుతూ ఈ-డిప్ విధానంలో 1,711 మంది లబ్ధిదారులకు పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఇందులో 1,432 హౌస్ సైట్స్, 279 అగ్రికల్చర్ సైట్స్ ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 1,431 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బి. సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, పాసం సునీల్ కుమార్, డా. విజయశ్రీ, గాలి భాను ప్రకాశ్, ఏపీ యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ జి. నరసింహ యాదవ్, టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, అధికారులు, శెట్టిపల్లి లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజలపై భారం మోపడం సరికాదు

- పెట్రోలు డీజిల్ ధరలు తగ్గిస్తామని మరోసారి ప్రజలను మోసం చేశారు
- ప్రశ్నిస్తానన్న గొంతు ఇప్పుడు ఏమైంది
- పెట్రోల్ డీజిల్ పెంపకంపై డక్కిలిలో కదం తొక్కిన వైఎస్ఆర్సిపి నేతలు అభిమానులు
- డక్కిలి తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేత




ప్రజాభూమి ప్రతినిధి వెంకటగిరి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీజిల్ పెట్రోల్ రేట్లు తగ్గిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి మళ్లీ రేట్లు పెంచి ప్రజలను మరోసారి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మోసం చేసిందంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. నియోజకవర్గ పరిధిలోని డక్కిలి మండలంలో పెట్రోల్ డీజిల్ పెంపకంపై నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తల, జనసందోహాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలు తగ్గిస్తామని చెప్పి ప్రస్తుతం పెట్రోల్ డీజిల్ రేట్లు ను పెంచడం ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్యని ఆరోపించారు. దీంతో రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరగడంతో పాటు ఆటో క్యాబ్ లారీ డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతీస్తుందని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సూచించారు. ఇంధనం పై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న అదనపు పనులను పున సమీకరించాలని ఆరోపించారు. ఇంధనం రేట్లు తగ్గించడం వదిలేసి ఇంధనం పొదుపుగా చేయాలంటూ అధికార పార్టీ నేతలు ఫోటోలకు భోజనం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమ కోసం ప్రజా గొంతునై ప్రశ్నిస్తానంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏమయ్యారని ఆరోపించారు. సంపద సృష్టించి రాష్ట్ర అభివృద్ధి చేస్తున్న చంద్రబాబు శ్రీకాకుళంలో మూడవ బిడ్డకి 30000 నాలుగో బిడ్డకి 40000 డబ్బులు ఇస్తామని హామీలే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేస్తే అదే 10,000 అని ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైయస్ఆర్సీపీ ప్రభుత్వానికి అధికారం చేపట్టినందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని కూటమి చంద్రబాబు నాయుడు మోసపు మాటలు వినే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ పరిధిలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## గిరిజన కాలనీ పర్యటనలో జనసేన పార్టీ పేట బ్రదర్స్ మిత్ర బృందం



ప్రజా భూమి ప్రతినిధి – తొట్టంబేడు మండలం.

తొట్టంబేడు మండలం పిల్లమేడు గిరిజన కాలనీలో జనసేన పర్యటన చేయడం జరిగింది, అక్కడ ఉన్నటు వంటి గిరిజనులు ప్రధానంగా మూడు సమస్యలు మా దృష్టికి తీసుకురావడం జరిగింది, మొదటి సమస్య దాదాపుగా 30 కుటుంబాల వరకు ఉన్నామని కొంతమందికి ఇంటి పట్టాలు ఇచ్చారని, మిగిలిన వారికి ఇంకా ఇవ్వలేదని చెబుతూ ఇంటి పట్టా ఇచ్చినవారికి ఇంకా ఇంటి నిర్మాణం జరగలేదని , ఈ గుడిసెల్లోనే మా జీవనం సాగిస్తున్నామని మా అందరికీ కూడా పక్క ఇంటి నిర్మాణం చేయాలని వారు అడగడం జరిగింది, రెండవ సమస్య వీధిలైట్లు చాలా రోజుల క్రితం నుండి వెలగడం లేదని దీనివల్ల మా కాలనీలోనే చిన్న పిల్లల మొత్తం కూడా రాత్రి సమయంలో భయాందోళనకు గురి అవుతున్నారని, పాముల భయం ఎక్కువగా ఉన్నదని తెలపడం జరిగింది, మూడవ సమస్య బోరు నుండి వచ్చేటువంటి త్రాగునీరు బురదలు వస్తున్నాయని, దాని వలన నీరు త్రాగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా గిరిజన కాలనీవాసులకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి మీ సమస్యలను తీర్చే దిశగా కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మహేష్, మనీ,లోకేష్, గంధం శ్రీను, లక్ష్మణ్, కల్లపూడి వెంకటేష్, దినేష్, యుగంధర్, నాని, మహేశ్, తవసి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

**గంగమ్మ జాతర నందు రాష్ట్ర ప్రభుత్వం తరపున సారె సమర్పణ : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**పటిష్టమైన భద్రత చర్యలు :జిల్లా ఎస్పీ**



ప్రజాభూమి ప్రతినిధి,కుప్పం : ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం గంగమ్మ జాతర నందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సారె సమర్పించుచున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కుప్పంలోని కడ కార్యాలయం నందు ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం లోని ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా అమ్మవారికి ప్రభుత్వం తరఫున సారె సమర్పిస్తారు, ముందస్తు ఏర్పాట్ల అమల్లో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషారా డూడీ, ట్రైనింగ్ ఎస్పి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంగమ్మ జాతరకు మూడు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఏ లోటు రాకుండా సదుపాయాలు సమకూర్చాలని అధికారులు ఆదేశించారు. గంగమ్మ జాతర నందు ఆలయము నందు క్యూలైన్లు నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పోలీసు, రెవిన్యూ, మున్సిపల్, రెస్కో, పంచాయతీరాజ్ శాఖ, ఆర్ అండ్ బి, పటిష్టంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ... అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... కుప్పం గంగమ్మ జాతరకు పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆలయం లోపల, వెలుపల, అగ్నిగుండ ప్రదేశం, బలిపీఠం ట్రాపిక్ మళ్లింపు వాహనాల పార్కింగ్ ప్రదేశాలను అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అంతకు మునుపు తుశీసి నందు హెలిపాడ్ స్థలాన్ని, ముఖ్యమంత్రి స్వగృహమైన శాంతిపురం మండలం, కడపల్లి, కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానం స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్డీవో విజయలక్ష్మి, కడ ఏపీ డి శ్రీనివాసరాజు, ఆలయ పాలకమండలి సభ్యులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కష్టకాలంలో ఇంధన భారం మోపింది వైసీపీ ప్రభుత్వమే

**- ఏఎంసి డైరెక్టర్ చొక్కం. మల్లికార్జున**



ప్రజాభూమి, పులివెందుల

కరోనా కష్టకాలంలో ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన వైసీపీ ప్రభుత్వం, పెట్రోల్--డీజిల్‌పై విలువ ఆధారిత పన్నులు (వ్యాట్‌లు), అదనపు పన్నులు పెంచి ప్రజలపై భారం మోపిందని పులివెందుల ఏఎంసీ డైరెక్టర్, జనసేన పార్టీ యువనేత చొక్కం మల్లికార్జున విమర్శించారు. అప్పటి ప్రభుత్వం 2020లో పెట్రోల్‌పై వ్యాట్‌ను 31 శాతం నుంచి 35.2 శాతానికి, డీజిల్‌పై 22.25 శాతం నుంచి 27 శాతానికి పెంచడంతో పాటు లీటరుకు రూ.1 రహదారి అభివృద్ధి అదనపు పన్ను విధించారని పేర్కొన్నారు. కరోనా కారణంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ నిర్ణయాలు మరింత భారంగా మారాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి రాష్ట్రాలు కూడా వ్యాట్ తగ్గించాలని సూచించినా, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు గతంలో తీసుకున్న ఇంధన పన్నుల నిర్ణయాలను ప్రజలు గుర్తు పెట్టుకోవాలని చొక్కం మల్లికార్జున అన్నారు.

## షష్టి పూర్తి వేడుకలకు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరు..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి :

చంద్రగిరి మండలం తొండవాడ గ్రామంలోని మురళిమోహన్‌రెడ్డి, సుజాతమ్మల షష్టి పూర్తి మహోత్సవ వేడుకలకు రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరయ్యారు.



సోమవారం గ్రామంలోని సాయిబాబా మందిరం వద్ద జరిగిన ఆ కార్యక్రమంకు గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆయన హాజరయ్యారు. షష్టి పూర్తి జరుపుకునే దంపతులకు శుభాకాంక్షలు తెలియపరచి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో పాటు జిల్లా వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు మల్లం చంద్రమౌళి రెడ్డి, తొండవాడ మాజీ సర్పంచ్ దీపికారెడ్డి, ఐతేపల్లి, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ దేవరాజులు రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బోడిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షులు శెల్వం, పాకాల మండల బీసీ నేత రాజేష్ లు పాల్గొన్నారు.

## ఎంజీఎం స్కూల్ విద్యార్థిని కి క్యాష్ రివార్డు ప్రకటించిన ఏపీ మంత్రులు

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తిలోని నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభించడానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత మరియు రెవెన్యూ శాఖ మంత్రి అనగానీ సత్యప్రసాద్ మరియు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకాళహస్తిలోని ఎంజీఎం స్కూల్ విద్యార్థిని మార్చ్ 2026 లో రాసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పోలీస్ శాఖ లో పనిచేస్తున్న కె.మధుబాబు కుమార్తె అయిన కె. నివేదిత 586/600 మార్కులు సాధించినందుకు గాను క్యాష్ రివార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంజీఎం స్కూల్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 586/600 మార్కులు సాధించిన ఎంజిఎం స్కూల్ విద్యార్థిని కే.నివేదిత ను సత్కరించి క్యాష్ రివార్డును అందజేసిన ఆంధ్రప్రదేశ్ మంత్రి వంగలపూడి అనిత మరియు రెవెన్యూ శాఖ మంత్రి అనగానీ సత్య ప్రసాద్ మరియు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత మరియు రెవెన్యూ మంత్రి అనగానీ సత్యప్రసాద్ , శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ,తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ , తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హౌస్‌లిస్టింగ్ ఫేజ్-1 సర్వేపై కమీషనర్ పర్యవేక్షణ

**- కడప కమిషనర్ హెచ్ ఎస్ భావన**



ప్రజా భూమి, కడప సిటీ :

సోమవారం కడప మున్సిప ల్ కమిషనర్ హెచ్.ఎస్ భావ న సెన్సెస్ 20 27 హౌస్ లిస్ట్ శీగ్ పేజ్ వన్ కార్యక్రమానికి సంబ ంధించి నగరంలోని ప లు ప్రాంతాలలో ఫీల్డ్ స్థాయిల పర్యటించి, ఎన్యూమరేట ర్లు నిర్వహిస్తున్న గృహ గణన ప్ర క్రియను ప్రత్యక్షంగా పరిశీలిం చారు.ఈ సందర్భంగా గృహాల వివరాల నమోదు,మొబైల్ యాప్ వినియోగం,డేటా సేక రణ విధానం, ప్రజలతో వ్యవ హరించే తీరు తదితర అంశా లపై సమగ్రంగా తనిఖీలుని ర్వహించారు. గణన ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గద ర్శకాలప్రకారం కచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాల ని ఎన్యూమరేటర్లుకు, సూప ర్వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శించి పూర్తి వివరాలు నమోదు చేయాలని,పెండింగ్ లే కుండా నిర్ణీత గడువులోపు ప్ర క్రియను పూర్తి చేయాలని సూ చించారు.ప్రజలకు సెన్సెస్ 20 27 ప్రాముఖ్యతను వివరించి, వారి సహకారంత సమగ్ర గణ న విజయవంతం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు.

## హోంగార్డు కుమార్తె ఘన విజయం.. ఇంటర్‌లో 982 మార్కులు



ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన హోంగార్డు మెల్లకంటి వీరయ్య కుమార్తె మెల్లకంటి తేజశ్రీ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000/982 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. నెల్లూరులోని నారాయణ కళాశాలలో చదువుతున్న తేజశ్రీ సాధించిన ఈ ఫలితం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. తేజశ్రీ విజయాన్ని గుర్తిస్తూ అధికారులు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాదని నిరూపించిన తేజశ్రీపై సూళ్లూరుపేటలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోల్ రూమ్ నిర్లక్ష్యం

**సిబ్బంది లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు**

**డిపో యాజమాన్యంపై ప్రజల ఆగ్రహం.**

ప్రజా భూమి ప్రతినిధి : సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోల్ రూమ్ సిబ్బంది లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన కంట్రోల్ రూమ్ సిబ్బంది విధుల్లో కనిపించకపోవడంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. బస్సుల రాకపోకలు, సమయాలు, మార్గాల వివరాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు కంట్రోల్ రూమ్ వద్దకు వెళ్లినా అక్కడ ఎవరూ లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది లేకపోవడం డిపో యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. బస్టాండ్‌లో సరైన సమాచార వ్యవస్థ లేకపోవడంతో పలువురు ప్రయాణికులు బస్సులు మిస్ అవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రజలకు సేవలు అందించాల్సిన ఆర్టీసీ అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కంట్రోల్ రూమ్‌లో సిబ్బందిని నియమించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



# ప్రజాభూమి

జనరల్

మంగళవారం, మే 19, 2026

12


# వైసీపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు కూటమి నేతల ధ్వజం

*** జగన్‌రెడ్డి ప్రభుత్వ తీరు మారకపోవడం సిగ్గుచేటు * ఆర్టీసీ ప్రైవేటీకరణపై పేర్ని నానివి పచ్చి అబద్ధాలు * బాబు-పవన్ ఐక్యతను దెబ్బతీయాలనేదే మీ ప్లాన్ * మచిలీపట్నం మీడియా సమావేశంలో కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణ ఫైర్**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రాత్మక విజయాన్ని జీర్ణించుకోలేక, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పటికీ విషం కక్కుతున్నారని కూటమి నాయకులు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పినా వైసీపీ నాయకుల తీరు మారకపోవడం సిగ్గు చేటని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామ కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు.మచిలీపట్నంలోని పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను వారు తీవ్రంగా ఖండించారు.

పేర్ని నానివి అడ్డగోలు ఆరోపణలు ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్టీసీని కూటమి ప్రభుత్వం అమ్మేస్తోందని, ప్రైవేటుపరం చేస్తోందని మాజీ మంత్రి పేర్ని నాని చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని కొనకళ్ల నారాయణ స్పష్టం చేశారు. మీడియా ముందుకు వచ్చి అబద్ధాలు ప్రచారం చేయడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్ర అభివృద్ధిని సర్వనాశనం చేసింది వైసీపీ నేతలేనని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు."బాబు - పవన్ కలవకూడదనేదే వారి కుట్ర!"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల



మధ్య ఎలాంటి విభేదాలు లేవని, వారి ద్దరూ కలిసి ఉండకూడదనే ఏకైక దుర్బుద్ధితోనే వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని కూటమి నేతలు ఆరోపించారు. ఈ ఇద్దరు నేతల కలయిక రాష్ట్ర భవిష్యత్తుకు శ్రీరామరక్ష అని, కూటమి ఐక్యతను దెబ్బ తీయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు.

సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, బాబా ప్రసాద్, బచ్చుల బోస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు స్వామి, బత్తిన దాస్, కోస్తా మురళీకృష్ణ, గడ్డం రాజుతో పాటు పలువురు కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## పెడనలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



ప్రజాభూమి పెడన

పెడన మార్కెట్ యార్డ్ లో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్య క్రమాన్ని ప్రారంభించిన పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు రైతులకు ఆయన స్వయంగా విత్తన బస్తాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచుకోవడంలో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర వంటివి ఎంతో కీలమని తెలిపారు. వీటి సాగు వల్ల భూమికి అవసరమైన నత్రజని లభిస్తుందని, తద్వారా దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా అన్ని రైతు సేవ కేంద్రాల్లో (RSK) విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ విత్తనాల పంపిణీలో ఎటువంటి జాప్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లాలోనే సరికొత్త రికార్డు.. రూ. 1,99,999 పలికిన హనుమన్న ప్రసాదం

**కృత్తివెన్ను మండలంలో భక్తిపారవశ్యం**

**వేలంపాటలో లడ్డును దక్కించుకున్న సూరిశెట్టి సోదరులు**

**వైభవంగా ముగిసిన హ నుమ జ్జయ ంతి మ హోత్ స్వాలు.**

**పోటెత్తిన భక్తజనం**



ప్రజాభూమి బ్యూరో

కృష్ణాజిల్లా

భక్తికి మించిన నిధి లేదు.. స్వామివారి ప్రసాదానికి సాటి ఏదీ లేదు అని నిరూపించారు ఇక్కడి భక్తులు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఆధ్యా త్మిక చరిత్రలోనే అత్యధిక ధర పలికిన లడ్డుగా కృత్తి వెన్ను మండలం గాంధీ నగరం ఆంజనేయ స్వామి వారి లడ్డు సరికొత్త రికార్డు సృష్టించింది.గాంధీనగరం లో గత ఐదు రోజులుగా కన్నులపండువగా జరిగిన హనుమజ్జయంతి మహోత్సవాలు ముగింపు దశ కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి లడ్డూ ప్రసా దానికి బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ వేలంలో స్థానికు లైన సూరిశెట్టి సాయిబాబు, రాంబాబు సోదరులు పోటాపోటీగా పాడి, ఏకంగా రూ. 1,99,999 (రెండు లక్షలకు ఒక్క రూపాయి తక్కువ) భారీ ధరకు లడ్డూను దక్కించుకున్నారు.జిల్లాలోనే ఇదే మొదటిసారిఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన ఆంజనేయ స్వామి లడ్డు వేలం పాటల్లో ఇంతటి భారీ ధర పలకడం ఇదే మొదటిసారని ఆలయ నిర్వాహకులు అత్యంత హర్షంతో ప్రకటించారు. ఈ రికార్డు స్థాయి వేలంతో గాంధీనగరం పేరు జిల్లాలోనే మారుమోగిపోతోంది.ఘన సత్కారం - అన్నసమారాధనలడ్డును దక్కించుకున్న సూరిశెట్టి సోదరులను దేవస్థానం కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారి కృప తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని భావించే ఈ వేలంలో పాల్గొన్నట్లు సోదరులు తెలిపారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ పుణ్యకార్యంలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఐదు రోజుల పాటు గాంధీనగరాన్ని భక్తిసాగరంలో ముంచెత్తిన ఈ ఉత్సవాలు, లడ్డు రికార్డు వేలంతో జిల్లాలోనే ప్రత్యేకంగా నిలిచాయి.

# ఉత్సాహంగా 5కే హెరిటేజ్ వాక్

**- భావితరాలకు వారసత్వ సంపదను అందించే బృహత్కర కార్యక్రమం**

**- పురాతన కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు మన నాగరికతకు ప్రతీకలు**

**- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా తొలుత 5కే హెరిటేజ్ వాక్ జరిగింది. నగరంలోని బాపూ మ్యూజియం నుంచి మొగ్రాజపురం గుహలు వరకు హెరిటేజ్ వాక్ జరిగింది. సంస్కృతి, చరిత్ర, వారసత్వ సంపద పరిరక్షణలో ప్రతి ఒక్కరం భాగస్వాములమవుదాంటూ పిలుపునిచ్చారు. ఈ వాక్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టాక్) విజయవాడ చాప్టర్ కన్వీనర్, చరిత్ర పరిశోధకులు సాయి పాపినేని సారథ్యంలోని బృందం, యువజన సంక్షేమ శాఖ అధ్యక్షులు డా. కొల్లేటి రమేష్, పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, చరిత్రాభిమానులు, సంస్కృతి పరిరక్షణకు కట్టుబడి ఉన్న పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, చరిత్ర పరిశోధకులు సంస్కృతి, చరిత్ర, వారసత్వ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పురాతన కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు మన నాగరికతకు ప్రతీకలని, వాటి సంరక్షణ ద్వారా భావితరాలకు చరిత్రను చేరవేయగలమని తెలిపారు. హెరిటేజ్ వాక్ ద్వారా యువతలో చారిత్రక చైతన్యం, వారసత్వ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని వివరించారు.




# పర్యావరణానికి పెద్దపీట ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో క్లాత్ బ్యానర్లే వాడాలి

*** క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టరేట్‌కు సైకిల్‌పై వచ్చిన కలెక్టర్, జేసీ * మీకోసం' వేదిక దిగివచ్చి వృద్ధురాలి సమస్యను ఆలకించిన కలెక్టర్ డీకే బాలాజీ * జిల్లా యంత్రాంగానికి అందిన 135 అర్జీలు; సకాలంలో పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ప్రజల నుండి అందే మీకోసం అర్జీల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటిని సకాలంలో పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్, మెప్మా పీడీ సాయిబాబు, సర్వ శిక్ష ఏపీసీ కుమిదిని సింగ్, డీఎస్పీ శ్రీనివాసరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఇరువురు తమ సిబ్బందితో కలిసి క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టరేట్‌కు సైకిల్‌పై రావడం అందరినీ ఆకట్టు కుం ది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో మొత్తం 135 అర్జీలను జిల్లా యంత్రాంగం స్వీకరిం చింది. స్పం దించి న కలెక్టర్ మీకోసం'లో వచ్చిన కొన్ని ముఖ్యమైన అర్జీలువేదిక దిగివచ్చిన కలెక్టర్ చల్లపల్లి మం దలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పక్షవాతంతో బాధపడుతున్న సబ్బినేని లక్ష్మి (77) చక్రాల కుర్చీలో రాగా, కలెక్టర్ స్వయంగా వేదిక దిగి కిందకు వచ్చి ఆమె సమస్యను ఆలకిం చారు. తనకు ప్రస్తుతం వస్తున్న రూ.



6,000 దివ్యాంగుల పింఛనును రూ. 15,000కు పెంచాలని ఆమె కోరగా, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్‌ను కలెక్టర్ ఆదేశిం చా రు. రోడ్డు ఆక్రమణల తొలగింపు మొవ్వ మండలం బాట్ల పెను మద్రు గ్రామానికి చెందిన చలసా ని సుబ్బా రావు రహదారి మార్జిన్ ఆక్రమణలను తొలగించి, 18 అడుగుల బాట వచ్చేలా చూడాలని అర్జీ ఇచ్చారు. వితంతు పింఛను: కృత్తివెన్ను మండలం చిన్న పాండ్రాక పాశ్చాపురం గ్రామస్తులు వీర మల్లు వెంకటేశ్వరమ్మ వితంతు పింఛను మంజూరు చేయాలని కోరారు.ఆర్థిక సాయం కోసం విన్నపం పామర్రు మం డలం కొరిమెర్ల గ్రామ వాస్తవ్యులు వరుచూరి ఉదయ్ కుమార్, తన 9 ఏళ్ల కుమార్తె నమీకలక్ష్మి తీవ్రమైన కండరాల వ్యాధితో బాధపడుతోందని, వైద్య సదుపాయాలు, పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆశ్రయించారు.ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల కొరత మచిలీపట్నం రాజుపేట వర్రేగూడెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత మూడు నెలలుగా డాక్టర్లు లేక గర్భిణీలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే డాక్టర్‌ను నియమించాలని సీపీఐ(ఎం) నగర కమిటీ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం వినతి పత్రం సమర్పించారు.అక్రమ పైపుల తొలగింపు కోడూరు మండలం ఉల్లిపాలెం శివారు శ్రీరామ పురం కాపురస్తులు నడకుదుటి సత్యనారాయణ మాట్లా డుతూ.. ఆక్వా రైతులు వేసిన అక్రమ పైపుల వల్ల వరి మాగాణి పొలాలు ముంపునకు గురవుతున్నాయని, వాటిని తొలగించాలని కోరారు.అసంపూర్తి భవనాల వివరాలు ఈనెల 25 లోగా అందజేయాలిఅనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 50 శాతానికి పైగా పనులు జరిగి అసంపూర్తిగా మిగిలిపోయిన భవనాల పూర్తికి అవసరమైన నిధుల కోసం అంచనాలను సిద్ధం చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర ఇంజనీరింగ్ విభాగాలతో సమన్వయం చేసుకొని ఈనెల 25వ తేదీలోగా ఇ-దస్త్రం (E-File) ద్వారా నివేదిక అందజేస్తే, దానిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపుతామన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.పర్యావరణ పరిరక్షణకు కొత్త విధివిధానాలు:ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం ఇకపై ఏ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించినా ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లకు బదులుగా కేవలం ఒకే ఒక గుడ్డ (క్లాత్) బ్యానర్‌ను మాత్రమే ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ఫ్లెక్సీని కూడా వెంటనే తొలగించి గుడ్డ బ్యానర్ ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ ఏఓకు సూచించారు.మెన్‌స్ట్రువల్ కప్స్ వాడకం పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు శానిటరీ నాప్కిన్ పాడ్స్‌కు ప్రత్యామ్నాయంగా జిల్లాలోని కొన్ని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ప్రయోగాత్మకంగా మెన్‌స్ట్రువల్ కప్స్ వాడకాన్ని ప్రోత్సహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలకు సంబంధించిన విజయగాథలను వెంటనే సాయం త్రంలోగా అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సోమశేఖరు, డీపీఓ ఎం. ధనలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్, జెడ్పీ సీఈఓ, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎస్. రాణి, సర్వే భూ రికార్డుల ఏడీ లక్ష్మణ్ బాబు, ఆర్ అండ్ బీ ఈఈ లోకేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# చారిత్రక వైభవానికి వేదికగా మ్యూజియం డే!



*** భావి తరాలకు వారసత్వ సంపదను చేరువచేసేలా కార్యక్రమాలు * నాగరికత వికాసాన్ని తెలియజేసే జ్ఞాన నిలయం.. మ్యూజియం * భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వం మ్యూజియం * బహుముఖ ప్రజ్ఞాశాలి సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధి * ఏపీ టీడీసీ ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ * జిల్లా కలెక్టర్ కృషితో బాపూ మ్యూజియం కొత్త కళను సంతరించుకుందని వ్యాఖ్య**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ

మ్యూజియంలు కేవలం పురాతన వస్తువుల కేంద్రాలు మాత్రమే కాకుండా, నాగరికత వికాసాన్ని ప్రతిబింబించే జ్ఞాన నిలయాలని.. ఈ సంపదను భావితరాలకు విలువైన వారసత్వ సంపదగా అందించాల్సిన అవసరముందని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టీడీసీ) ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ అన్నారు. భావితరాలకు మన సంస్కృతి, చరిత్ర, వారసత్వ సంపదను అందించడంలో మ్యూజియంల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా సోమవారం విజయవాడలోని బాపూ మ్యూజియంలో జిల్లా అధికార యంత్రాంగం.. పర్యాటక శాఖ, పురా వస్తు శాఖ, ఇన్‌టాక్, జిజ్ఞాస ఆర్ట్ వెర్స్, ఆర్టిఐహెచ్, శ్రేయాస్ మీడియాతో పాటు వివిధ సాంస్కృతిక చారిత్రక వారసత్వ సంస్థల సహకారంతో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. తొలుత ఏపీ టీడీసీ ఛైర్మన్ డా. నూకసాని బాలా జీ, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆర్కియాలజీ అండ్ మ్యూజియంల కమిషనర్ (ఎఫ్ఏసీ) పి.సురేష్ తదితరులు అధికారులతో కలిసి జాతిపిత మహాత్మాగాంధీతో పాటు పింగళి వెంకయ్య, స్వాతంత్ర్య సమర యో ధుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివా ళు లు అర్పించారు. బాపూ మ్యూజియం ప్రాంగ ణంలో మొక్కలు నాటి ప్రత్యేక ఫొటో ప్రదర్శనను తిలకించారు.ఈ కార్యక్రమంలో ఏపీ టీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లా డుతూ చారిత్రక విశిష్టత భావితరాలకు స్ఫూర్తి పథమ ని.. చిన్నారులు కేవలం మార్కుల వేటలోనే పడిపోకుండా మన చారిత్రక వారసత్వ వైభవాన్ని తెలుసుకోవాల్సిన అవసరముం దన్నారు. ఎన్నడూలేని విధంగా ఈ రోజు ఏర్పా టు చేసిన కార్యక్రమాలు బాపూ మ్యూజి యంకు కొత్త కళను తీసుకొచ్చాయని పేర్కొ న్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మన గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి దార్శనికతతో కృషిచేస్తున్నారన్నారు. ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం చేస్తున్న కృషి అభినం దనీయమని పేర్కొన్నారు. మ్యూజియంలు విజ్ఞాన భాండాగారాలు: రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ..మ్యూజియంలు విజ్ఞాన భాండాగారాలని, చరిత్ర, సంస్కృతిని సంరక్షించే విజ్ఞాన నిలయాలని పేర్కొన్నారు. ఇటీవల ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నామని.. ఇప్పుడు ఇంత గొప్పగా అంతర్జాతీయ మ్యూజియం డేను నిర్వహించుకుంటున్నామంటే అందుకు కలెక్టర్ గారి కృషే కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మూలాలు తెలుసుకొని ముందుకెళ్లినప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుందని, మన పుస్తకాల్లో చదువుకొన్న చరిత్రను అనుభవించేందుకు మ్యూజియంలు గొప్ప వేదికలని పేర్కొన్నారు. ఈ రోజు ప్రారంభమైన యజ్ఞాన్ని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసర ముందన్నారు.జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. కొండపల్లి బొమ్మల పండగను ఘనంగా నిర్వహించి హస్తకళాకారులకు చేయూతగా నిలిచామని.. అదేవిధంగా మన ఘన వారసత్వ చారిత్రక సంపదను భావితరాలకు అందించే ఉద్దేశంతో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెరిటేజ్ ఆన్ కాన్వాస్, నా నగర కథలు, హెరిటేజ్ క్విజ్, హెరిటేజ్ ఫొటోగ్రఫీ వంటి పోటీలు నిర్వహించడంతో పాటు మేధోమథన చర్చలు నిర్వహించినట్లు పేర్కొ న్నారు. బాపూ మ్యూజియంలో ప్రత్యేక గైడెడ్ టూర్లు, లేజర్ షోలు సందర్శకులకు మధురానుభూతులను పంచుతున్నాయన్నారు. వైబ్రంట్ విజయవాడ, వైబ్రంట్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.*ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ కమిషనర్ పి.సురేష్ మాట్లాడుతూ.. గత వైభవాన్ని నేటి తరానికి, నేటి సంస్కృతిని రేపటి తరానికి అనుసంధానించే వారధులు మ్యూజియంలు అని.. ఈ వారసత్వ ప్రతీకలను భావితరాలకు అందించాలనే ఉద్దేశం తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస న్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 14 వరకు పురావస్తు మ్యూజి యాలు, మ్యూజియం క్షేత్రాలు ఉన్నా యని, వీటి పరిరక్షణకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టాక్) విజయవాడ చాప్టర్ కన్వీనర్, చరిత్ర పరిశోధకులు సాయి పాపినేని మాట్లాడుతూ సంస్థలో ప్రఖ్యాత పరిశోధకులు, నిపుణులు ఉన్నారని.. వారి సహాయంతో బాపూ మ్యూజియంతో పాటు వివిధ చారిత్రక వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి కృషిచేయ నున్నట్లు తెలిపారు. మన గురించి మనం తెలుసుకునేందుకు ఇలాంటి ప్రదేశాలు దోహదం చేస్తాయని.. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా మన ప్రాంత చారిత్రక వారసత్వ ముద్ర స్పష్టం కనిపిస్తుందని పేర్కొన్నారు. కార్యక్ర మంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఆర్కియాలజీ డీడీలు ఎం.రామసుబ్బారెడ్డి, ఇషాక్, ఏడీలు ఎస్.వెంకటరావు, కె.నరసింహనాయుడు, శివకుమార్, జిల్లా యువజన సంక్షేమ అధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బాపూ మ్యూజియంలో చారిత్రక పరిమళాలు:**

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా బాపూ మ్యూజియం చారిత్రక వారసత్వ పరిమళాలతో గుబాళిం చింది. ప్రాచీన కళాఖండాల విశిష్టతను అందరికీ తెలియజేసేందుకు ఉద్దేశించిన కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టు కు న్నాయి. జైన, బౌద్ధ, హిందూ విగ్రహాలు, ప్రాక్ - తొలి చారిత్రక యుగం, నాణెలు, శాసనాలు, మధ్య యుగపు కళా దృశ్యాలు, ఆయుధాల గ్యాలరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాక్ చరిత్ర నుంచి 19వ శతాబ్దం వరకు వివిధ కాలాలకు చెందిన కళాఖండాలతో ఉన్న ఏడు గ్యాలరీలను పెద్దఎత్తున ప్రజలు, చారిత్రక ప్రియులు సందర్శించి కొత్త అనుభూతులను సొంతం చేసుకున్నారు.






Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

## పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ ఆర్ డి ఓ కు వినతి పత్రం అందజేత



ప్రజాభూమి ప్రతి నిధి–పాలకొల్లు

మాజీ సీఎం వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ , వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద రాజు ఆధ్వర్యంలో, నరసాపురం పట్టణంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా నరసాపురం ఆర్డీఓ కి వినతిపత్రం అందజేసి, అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

## కలపర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ

### సెస్ వసూళ్లు, రికార్డులను, సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

ప్రజా భూమి ప్రతినిధి–పెదపాడు

నిబంధనల ప్రకారం పారదర్శకంగా రైతులకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు విధులు నిర్వహించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు జాతీయ రహదారి వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ఆకస్మికంగా పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న కార్యకలాపాలను, సిబ్బంది విధివిధానాలను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

**సెస్ వసూళ్లపై ఆరా – రికార్డుల పరిశీలన**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చెక్‌పోస్టు వద్ద వసూలు చేస్తున్న సెస్ ధరల వివరాలను అధికారులను అడిగి



తెలుసుకున్నారు. రశీదు పుస్తకాలను, రోజు వారీ వసూళ్ల రికార్డులను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సెస్ వసూళ్లు జరుగుతున్నాయా లేదా అనే అంశంపై ఆరా తీశారు. సిబ్బంది ఎవరైనా అలసత్వం చూపి, నిర్దేశిత ధరల కంటే ఎక్కువ వసూలు చేసినా, రికార్డుల్లో వ్యత్యాసాలు ఉన్నా సహించేది లేదని వారిపై అధికారికంగా తగిన చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

చెక్ పోస్టు పరిసరాలను, సిబ్బంది హాజరును ఎమ్మెల్యే పరిశీలించారు.. సిబ్బంది పనితీరు నిరంతరం పారదర్శకంగా ఉండాలని, రవాణాదారులు, వ్యాపారులు, రైతులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా విధులు నిర్వహించాలని కరాఖండిగా ఆదేశించారు.మార్కెట్ కమిటీ నిబంధనలపై వాహనదారులకు స్పష్టమైన అవగాహన ఉండేలా బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సెస్ వసూళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## నాతోపాటు కష్టపడుతున్న జర్నలిస్టులకు అండగా ఉంటా

### మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

నాతోపాటే కష్టపడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజాసేవలో భాగమైన జర్నలిస్టులకు తాను అండగా ఉంటానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అక్రిడియేటెడ్ జర్నలిస్టుల మేడి క్లైమ్ ఆరోగ్య భీమా ప్రీమియం ఒక్కొక్కరికి రూ. 1250/- చొప్పున 26 మంది జర్నలిస్టులకు జర్నలిస్టు భాగం సొమ్మును మంత్రి నిమ్మల సొంతంగా చెల్లించి మెడిక్లెయిమ్ పత్రాల రసీదులను జర్నలిస్టులకు పాలకొల్లులోని ఆయన చాంబర్లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు మేడి క్లైమ్ ప్రీమియం చెల్లించే అవకాశం తనకు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు జీతభత్యాలు ఉండవని, వారి స్థితిగతులు పై తనకు పూర్తిగా అవగాహన ఉందని సామాజిక సేవ లక్ష్యంగా చేసుకుని విధులు నిర్వహిస్తారని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఏ సమస్య ఉన్న జర్నలిస్టులందరికీ తన పూర్తి సహకారం ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను తన సొంత



సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి నిమ్మల హామీ ఇచ్చారు.

**మంత్రి కొలుసు పార్థసారథి తో ఫోన్లో మాట్లాడిన మంత్రి నిమ్మల**

కంపెనీ ఐడి కార్డులు ఉండి, ఇంకా అక్రిడేషన్ కార్డులు రాని వారికి కూడా మెడి క్లెయిమ్ సౌకర్యం కల్పించాలని మంత్రి నిమ్మల రాష్ట్ర సమాచార పౌర సమాచార అధికారి కొలుసు పార్థసారథి తో ఫోన్లో మాట్లాడారు. దీనిపై మంత్రి పార్థసారథి సమాధానం ఇస్తూ ఈ విషయం త్వరలోనే పరిశీలించి పరిష్కరిస్తానని సమాధానం ఇచ్చారు. మంత్రి పార్థసారథి హామీ పట్ల స్థానిక జర్నలిస్టులు హర్షం ప్రకటించారు. తొలుత పాలకొల్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎం ఎన్ వి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఐజే శ్రీయు సభ్యులు పిటి వెంకటేశ్వరరావు మంత్రి నిమ్మలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల కు దుస్సాలువాతో పాత్రికేయులందరూ సత్కరించారు.

## రిక్షా తొక్కడం కాదు... పరిస్థితులను అవగతం చేసుకోవాలి

- ప్రజా సమస్యలపై పోరాటం అవసరమే కానీ వాస్తవ పరిస్థితులను కూడా ప్రజలకు వివరించాలని సూచన.
- కొత్తపేట కూటమి నేతల విమర్శలు.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలపై కొత్తపేట నియోజకవర్గంలోని పలువురు నేతలు స్పందించారు. రిక్షాపై బైక్ ఎక్కించి నిరసనలు చేయడం ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకదని, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల వంటి కారణాలతో పెట్రోల్ ధరలు ప్రభావితమయ్యాయని వారు తెలిపారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ధరలు పెరిగాయని, ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే భారీగా ధరలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిస్థితులను పరిశీలి




స్తూ ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై స్పందించడం వారి బాధ్యతేనని, అయితే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా కార్యక్రమాలు చేపట్టడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. రిక్షాలు తొక్కడం వంటి నిరసనల వల్ల చెమటలు పడతాయే తప్ప ధరలు తగ్గవని, ప్రజలు వాస్తవాలను బాగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మాణాత్మక సూచనలు, సమస్యల పరిష్కార మార్గాలు చూపించే కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రజలు మరింత హర్షిస్తారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు పరిస్థితులను సమగ్రంగా అవగాహన చేసుకుని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా స్పందించాలని వారు సూచించారు.

## పంట అవశేషాలు కాల్చడం పర్యావరణానికి తీవ్ర ముప్పు

### ఆర్.డి.ఓ సరళావతి వ్యవసాయ అధికారులకు కీలక ఆదేశాలు

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

పంట అవశేషాలు కాల్చడం కారణంగా పర్యావరణానికి ముప్పు ఏర్పడమే కాకుండా భూసారానికి సైతం తీవ్రమైన ముప్పు ఏర్పడనుందని రామచంద్రపురం ఆర్డీవో ఏ. సరళావతి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రామచంద్రాపురం ఆర్.డి.ఓ కార్యాలయంలో ‘ధరతీ మాతా బచావో నిగ్రాణీ సమితి’ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు.

భూసారాన్ని రక్షించుకుంటూ పర్యావరణ పరిరక్షణతో కూడిన సేంద్రియ సాగు వైపు రైతులను మళ్లించడం,సాగు సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడటమే లక్ష్యంగా రామచంద్రాపురం ఆర్.డి.ఓ కార్యాలయంలో ‘ధరతీ మాతా బచావో నిగ్రాణీ సమితి’ డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం అత్యంత ప్రాముఖ్యంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి రామచంద్రాపురం ఆర్.డి.ఓ సరళావతి అధ్యక్షత వహించగా, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, ఇన్పుట్ డీలర్లు,ఎరువుల కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఎరువుల దారిమళ్లింపు నిరోధం సకాలంలో పంపిణీపై ప్లానింగ్ సమావేశంలో సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో ఎరువులు అందించే ప్రణాళికలపై ఆర్.డి.ఓ సరళావతి ఏడిఏ బి.నాగకుమార్, కమిటీ సభ్యులతో సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కృత్రిమ కొరతపై నిఘాలో డీలర్లు ఎరువుల నిల్వలను దాచి ఉంచి కృత్రిమ కొరత సృష్టించినా, లేదా గరిష్ట విక్రయ ధర కంటే ఎక్కువ ధరకు అమ్మినా లైసెన్సులు రద్దు చేస్తామని ఆర్.డి.ఓ ఈసందర్భంగా హెచ్చరించారు. కచ్చితమైన పంపిణీ ప్రణాళిక ద్వారా పి.ఓ.ఎస్ మిషన్ల ద్వారా అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు సకాలంలో అందేలా మండల వ్యవసాయ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పక్కదారి పట్టకుండా వ్యవసాయేతర అవసరాలకు సబ్సిడీ ఎరువులు దారిమళ్లకుండా విక్రయాల రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని నిగ్రాణీ సమితి సభ్యులను ఆదేశించారు.పంట అవశేషాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై సుదీర్ఘ చర్చించారు. అంతకు ముందు సహాయ వ్యవసాయ సంచాలకులు



బి. నాగ కుమార్ అజెండా అంశాలను వివరిస్తూ, పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల కలిగే తీవ్ర నష్టాలను శాస్త్రీయంగా వివరించారు.

పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రియ కర్బనం నశించిపోతుందని, మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోయి భూమి చవిటి నేలగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అలాగే పొగ వల్ల వాతావరణం కలుషితమై శ్వాసకోస వ్యాధులు పెరుగుతాయని, గ్రీన్ హౌస్ వాయువుల విడుదలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్.డి.ఓ ఏ.సరళావతి మాట్లాడుతూ, వరి గడ్డి వంటి పంట అవశేషాలను తగులబెట్టకుండా, వాటిని పశువులకు మేతగా ఉపయోగించుకునేలా లేదా వేస్ట్ డీకంపోజర్ సహాయంతో పొలంలోనే కుళ్ళింపజేసి, సేంద్రియ కంపోస్ట్ ఎరువుగా మార్చే విధానాలపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడేలా చూడాలన్నారు. ఈ మేరకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని రామచంద్రాపురం మండల వ్యవసాయ అధికారి టివిఆర్ మణిదీప్ ని,కె. గంగవరం మండల వ్యవసాయ అధికారి ఎ. సద్గురు మూర్తీ ని, ఆర్డీవో ఆదేశించారు.ఈ సమావేశంలో సబ్ డివిజన్ కోపరేటివ్ ఆఫీసర్ జె. అప్పారావు, డివిజన్ లెవెల్ ఇన్పుట్ డీలర్స్ ప్రతినిధి మేక సురేష్ ,, కొరమండల్ ఎరువుల కంపెనీ ప్రతినిధి ఖండవల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల పక్షాన నిరసనకు పిలుపునిచ్చిన అఖిలపక్షం

## నిర్వాసితులందరికీ న్యాయం జరిగే వరకూ ఇక్కడ నుంచి తరలి వెళ్లే ప్రసక్తే లేదు అఖిలపక్షం

ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు

పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులుగా మారే ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకూ ఈ గ్రామాలు వీడి పునరావాసాలకు తరలి వెళ్లే ప్రసక్తి లేదని అఖిలపక్ష నేతలు ప్రతిన పూనారు. ఆదివారం వేలేరుపాడులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్ లైన్, కాంగ్రెస్, పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, అర్హులైన కుటుంబాలను అనర్హులుగా పేర్కొనడం కటాఫ్ తేదీతో వందల మంది యువతీ యువకులకు పరిహారం ఇవ్వకుండా దాటవేసే ధోరణి అవలంబిస్తున్న ప్రభుత్వానికి పోరాటాలతో బుద్ధి చెప్పాలన్నారు. ఈనెల 20న స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు.2017 సంవత్సరాని ఆధారంగా చూపుతూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేయడం సమంజసం కాదన్నారు. సుమారు పదేళ్లు కావస్తున్నపాత సర్వేను ఆధారం చేసుకోవడం వలన వందల మంది నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆనాడు చేసిన సర్వేలో అనేక అవకతవకలు జరగటం వలన వందల మంది అనర్హులుగా పేర్కొన్నారని అన్నారు. ఆయా కుటుంబాలు అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ న్యాయం జరగలేదన్నారు. అవకతవకలు సరి చేయమని పదేపదే కార్యాలయం చుట్టూ, ప్రజాప్రతినిధులకు తెలియజేసిన పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఆ తప్పుల తడకనే చూపిస్తూ నిర్వాసితుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇటీవల ఐటీడీఏ పీవో పాత్రికేయులతో మాట్లాడుతూ, అనర్హుల జాబితా ఏ ఒక్కరికి ప్యాకేజీ రాదని చెప్పటం సమంజసం కాదన్నారు. మొదటి దఫా తరలిస్తున్న గ్రామాలలో అనర్హులుగా పేర్కొన్న అర్హులందరికీ ప్యాకేజీ ఇచ్చి తరలించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతి నిర్వాసితునికి పరిహారం అందే వరకు గ్రామాలు ఖాళీ చేయరని తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో నిర్వాసితుల కుటుంబాలకు పోలవరం వలన జరుగుతున్న నష్టాన్ని తెలుసుకొని న్యాయం చేయాలన్నారు. అనర్హుల జాబితాలో అర్హులను గుర్తించడంతోపాటు తరలించే నాటికి18 సంవత్సరాల నుండిన యువతీ యువకులకు ప్యాకేజీ



ఇవ్వాలన్నారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో నిర్వాసితులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్, సన్నేపల్లి సాయిబాబు, సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్మల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ” పండు” వలగాని సమ్మయ్య గౌడ్, సిపిఐ ఎంఎల్ ప్రజా పంద మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎస్.కె గౌస్, జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, కరటం ముత్యాలరావు, కరటం వీరాస్వామి, బంధం అర్జున్, కొత్త వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆగిరిపల్లి మండల విద్యార్థుల ప్రతిభకు ఘన సత్కారం

### డివిజన్ స్థాయిలో మెరిసిన విద్యార్థులకు నగదు బహుమతులు

### ప్రధానోపాధ్యాయులు ఎంఈఓకు అభినందనలు





ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి నూజివీడు డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందారు. సూరవరం గ్రామానికి చెందిన మాకుల శివ రాజ్యలక్ష్మి 583 మార్కులతో డివిజన్ ప్రథమ స్థానం సాధించి రూ.25 వేల బహుమతి అందుకోగా, ఈదర గ్రామానికి చెందిన గిడుటూరి నమ్రత రోజ్ 582 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. అలాగే నల్లమోతు కిక్ 563 మార్కులతో తృతీయ స్థానం, ఆవల బిందు మాధవి మరియు అసానుబాదు లేఖ్య వెంకట సాయి నాగదుర్గ 561 మార్కులతో నాలుగో స్థానం, వణుకూరి కీర్తి 556 మార్కులతో ఐదో స్థానం సాధించారు. నూజివీడులో కొలుసు పెద్దరెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి విద్యార్థులకు నగదు బహుమతులు, దుశ్శాలువాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఏటా రూ.32 వేల కోట్లకు పైగా కేటాయిస్తోందని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు మౌళిక వసతులు, విద్యా కిట్లు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 16,600 మంది ఉపాధ్యాయులను నియమించామని, యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు భవాని, శారద ప్రసాద్‌తో పాటు మండల విద్యాశాఖాధికారి హేబేలు ను కూడా సన్మానించారు.

## ఎన్ఆర్ఐ యూనివర్సిటీ విద్యార్థుల జాతీయ స్థాయి ప్రతిభకు ప్రశంసలు



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి సమీపంలోని డాక్టర్ ఆర్వీఆర్ ఎన్ఆర్ఐ డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన ద్వితీయ సంవత్సరం డేటా సైన్స్ విద్యార్థినులు నగుల్ల తన్మయి, పి. మౌనిక జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచారు. ప్రముఖ ఆన్‌లైన్ విద్యా వేదిక “గీక్స్ ఫర్ గీక్స్” నిర్వహించిన కార్యక్రమాల్లో ఉత్తమ ప్రదర్శనతో క్యాంపస్ అంబాసిడర్లుగా ఎంపికయ్యారు. అదేవిధంగా భారతదేశ స్థాయిలో వరుసగా 18వ, 43వ ర్యాంకులు సాధించి యూనివర్సిటీకి గుర్తింపు తీసుకొచ్చారు.విద్యార్థినుల ప్రతిభను గుర్తించిన గీక్స్ ఫర్ గీక్స్ సంస్థ కీబోర్డ్, మౌస్, పెన్, బ్యాగ్, టీ–షర్ట్‌లతో పాటు రూ.2,500 నగదు బహుమతిని అందించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపక బృందం విద్యార్థినులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఏరియా ఆసుపత్రిలో క్యాండిల్స్ లైట్ డే ర్యాలీ.



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లా లెప్రసి ఎయిడ్స్ ,టీ బీ ఆఫీసర్ డా, భరత్ లక్ష్మి , ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా .ప్రవీణ్ ఆదేశాలు మేరకు ఇంటర్నేషనల్ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ డే సందర్భంగా ఏరియా హాస్పిటల్ రామచంద్రపురం నందు ఐసిటిసి మరియు ఎ ఆర్ టి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కాండిల్ లైట్ డే ర్యాలీ జరిగింది.ఈ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ క్యాండిలైట్ డే అంటే హెచ్ ఐ వి/ఎయిడ్స్ తో జీవిస్తూ చనిపోయిన వారి ఆత్మ కు శాంతి చేకూరాలని ఈ క్యాండిలైట్ ప్రోగ్రామ్ ప్రతి సంవత్సరం మే నెల మూడు వ ఆదివారం చేయడం ఆనవాయితీగా జరుగుతుంది . ఈ సంవత్సరం స్లోగన్ మేము గుర్తించుకుంటాం,మేము అవగాహన తో ముందుకు వెళ్తాము, మేము చర్య తీసుకుంటాము అనే నినాదం తో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐ సి టి సి సీనియర్ కౌన్సిలర్ శిరీష, అంజలి, భవాని, డి ఏస్ ఆర్ సి కౌన్సిలర్ నాగు , ఎ ఆర్ టి సిబ్బంది భాను శేఖర్, స్టాఫ్ నర్స్ భారతి ,ఏరియా ఆసుపత్రి డ్యూటీ మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్ లు తదితర సిబ్బంది పాల్గొనారు.ఎ

## పేదల వైద్యానికి సీఎం సహాయనిధి సంజీవని

ప్రజా భూమి ప్రతినిధి – ఆగిరిపల్లి



డబ్బుల కొరతతో పేదలు వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పూర్తి ఆరోగ్య భద్రత కల్పిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. నూజివీడులో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండలానికి చెందిన 11 మంది బాధిత కుటుంబాలకు సుమారు రూ.3.52 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైద్యం చేయించుకున్న వారు తమ వైద్య బిల్లులను అందజేస్తే సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవని లాంటిదని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల టీడీపీ అధ్యక్షులు నక్కనబోయిన వేణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



ప్రజల అప్రమత్తతతోనే

## దొంగతనాలకు అడ్డుకట్ట - ఎస్ఐ శుభ శేఖర్

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండల ప్రజలు తమ ఇళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో మైక్ అనౌన్స్మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన, గృహస్తులు తమ ఇళ్లలో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని తెలిపా రు. కుటుంబ సభ్యులు గ్రామాంతరాలకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో నమ్మ కమైన పక్కింటి వారికి సమాచారం ఇచ్చి వెళ్లాలని, ఇళ్లకు నాణ్యమైన తాళాలు మరియు భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కొత్తగా అద్దెకు వచ్చే వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా సంచరించే వారిపై గ్రామస్తులు ప్రత్యేక నిఘా ఉంచి వెంటనే పోలీ సులకు సమాచారం అందించాలని కోరారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద కదలికలు గమనించినా ఆలస్యం చేయకుండా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, ప్రజల సహకారంతోనే గ్రామాల్లో శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు. పోలీసులు నిరంతరం పహారా నిర్వహిస్తూ ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.

## పొదుపు ఉద్యమానికి ఇ-సైకిళ్ల ఊతం

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఇ–సైకిళ్లు
ఈవీ కంపెనీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్
ఈవీలు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి



ఇంధన పొదుపు కోసం చేపట్టే కార్యాచరణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉద్యమంగా మార్చేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈవీ సైకిళ్లు, ఈవీ వాహనాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం 16 వేల ఎలక్ట్రిక్ సైకిళ్లను ఆ కార్యాలయాల సిబ్బందికి అందించాలని సీఎం నిర్దేశించారు. ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేలా రుణాలను అందించే ప్రయత్నం చేయాలని.. దీని కోసం ఓ ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈఎంఐ విధానంలో ఈవీ సైకిళ్లను ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల లాంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లతో పాటు మౌలికసదుపాయాల కల్పించటంపై ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం పేర్కొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం

## తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

ప్రజా భూమి ప్రతినిధి–కుక్కునూరు

పోలవరం నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీన కుక్కునూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను నిర్వాసితులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు పిలుపునిచ్చారు .సోమవారం నాడు కుక్కునూరులోని స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల కార్యాలయంలో శ్యామల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితుల సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం ఇల్లనిర్మానానికి స్థలానికి అదనంగా లక్ష రూపాయలు పెంచిన నేపథ్యంలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లకు వెళ్లే వారికి అలాగే ఇళ్లస్థలం వద్దనుకునే వారికి కూడా అదే విధంగా అదనపు లక్ష రూపాయలు పరిహారం వర్తింపజేయాలని కోరారు .నాన్ రెసిడెన్షియల్ బాధితులకు పెళ్లయిన ఆడపిల్లలకు కూడా పరిహారం చెల్లించాలని అన్నారు. కూనవరం మండలంలో 2022 కటాఫ్ తేదీ అమలు చేస్తుండగా కుక్కునూరు మండలంలో మాత్రం 2016 కటాఫ్ తేదీ అమలు చేయడం అన్యాయం అన్నారు .ఒకే రాష్ట్రంలో ఒకే



ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న నిర్వాసితుల మధ్య ఇంత వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు కుక్కునూరు మండలంలో కూడా 2022 కటాఫ్ తేదీ అమలు చేసి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్రత్యేక పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 45 కాంటూరు వరకు భూములు తీసుకుంటామని ప్రకటించడం నేపథ్యంలో 45 కాంటూరులోఉన్న అన్ని గ్రామాలకు తక్షణమే పరిహారం చెల్లించాలని అన్నారు. 41.15 కాంటూరు పరిధిలో తొలి దశలో తరలించిన గ్రామాలకు 25 రకాల మౌలిక వసతులు కల్పించాలని మిగులు భూములకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తర్వాతే గ్రామాల తరలింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎర్నం సాయికిరణ్ నాయకులు షేక్ వలిపాషా పులదాస్ రమేష్ పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది

### రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబు

ప్రజా భూమి ప్రతినిధి–న్యూఢిల్లీ/అమరావతి

న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు.న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయు క్తంగా నిర్వహించిన "యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సుకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అతిథిగా హాజరుకావడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్నాయని సతీష్ బాబు అన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆంధ్రప్రదేశ్‌ను న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామిగా తీర్చిదిద్దుతామని మంత్రి వెల్లడించడం ఎంతో ప్రాముఖ్య



మైన అడుగని పేర్కొన్నారు. రాష్ట్రంలో సహజసిద్ధ వనరులు, పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటి బలమైన పునాదులు ఉన్నాయని, ఇవి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకోవడం ద్వారా రాష్ట్రం శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని తెలిపారు. అదే సమయంలో డేటా సెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పం పారిశ్రామిక వృద్ధికి కొత్త అవకాశాలను తెరుస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎనర్జీ, టెక్నాలజీ, తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తాను పూర్తి మద్దతు తెలియజేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

## టీడీపీ నేత కాండ్రేగుల రవీంద్ర నుంచి ప్రాణహాని..

- మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న గడ్డం వేంకట సుమన్ దంపతులు.
- న్యాయం కోరుతూ ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..

ప్రజా భూమి ప్రతినిధి–విజయవాడ

టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎం ఎల్ సీ బుద్ధా వెంకన్న అల్లుడు కాండ్రేగుల రవీంద్ర నుంచి తమకు ప్రాణహాని ఉందని ఓ జంట మీడియా ముందు కంట తడి పెట్టుకున్నారు. కాండ్రేగుల రవీంద్ర తో కలసి భాగస్వామ్య వ్యాపారం చేసిన క్రమంలో ఇచ్చిన కాలి ప్రాంసరి నోట్లు, బ్యాంకు చెక్కులను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. తమను అన్యాయంగా అప్పులు పాలు చేసి బజారు కీడుస్తున్నారని ఆ దంపతులు మీడియా తో మొర పెట్టుకున్నారు. కాండ్రేగుల రవీంద్ర నుంచి తమకు ప్రాణహాని ఉందని అతని నుంచి తమను రక్షించాలని కోరుతూ సోమవారం పాతబస్తీ కి చెందిన గడ్డం వెంకట సుమన్, గడ్డం రేణుక దేవి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అనంతరం గడ్డం సుమన్ మీడియా తో మాట్లాడారు. 2020–23 మధ్య కాలంలో బుద్ధా వెంకన్న అల్లుడు కాండ్రేగుల రవీంద్ర, తను కలసి భాగస్వామ్య వ్యాపారం చేశామని పేర్కొన్నారు. కొద్ది కాలం తరువాత తను అనారోగ్యం పాలైన నేపథ్యంలో కాండ్రేగుల రవీంద్ర తో కలసి చేస్తున్న వ్యాపారం నుంచి బయటకు రావడం జరిగిందని వెల్లడించారు. అప్పటి వరకు జరిగిన వ్యాపార లావాదేవీలలో అసలు, వడ్డీ చెల్లింపుల



విషయం లో జరిగిన వివాదంలో తన భార్య (గడ్డం రేణుక దేవి) నుంచి కాండ్రేగుల రవీంద్ర నాలుగు కాలి ప్రామాంసరీ నోట్లు, నాలుగు కాలి బ్యాంకు చెక్కులు తీసుకొన్నారని తెలిపారు. ఇప్పుడు తమ పై కక్ష తో తన భార్య నుంచి తీసుకున్న కాలి ప్రాంసరి నోట్లు, బ్యాంకు చెక్కులను అడ్డుపెట్టుకొని లీగల్ గా వేదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకన్న అనుచరలు తమపై వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. కాండ్రేగుల రవీంద్ర నుంచి తమ కుటుంబానికి ప్రాణ భయం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు మీడియా తో పేర్కొన్నారు. గడ్డం రేణుక దేవి మాట్లాడుతూ కాండ్రేకుల రవీంద్ర తో కలిసి తన భర్త వ్యాపారం చేసిన్నందుకు ఇప్పుడు తమ కుటుంబ మొత్తం ఆపదలో పడిందని కన్నీటి పర్యంతం అయ్యారు. తన దగ్గర నుంచి బలవంతంగా తీసుకున్న కాలి నోట్లు, చెక్కులను డిపాజిట్ చేసి తమ పై చెక్ బౌన్స్ కేసులు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాండ్రేగుల రవీంద్ర నుంచి తమకు ప్రాణ హాని ఉందని, తమ కుటుంబానికి భదత్ర కల్పించాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు వెల్లడించారు.

## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం!

- న్యూక్లియర్ ఎనర్జీ గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు సిద్ధం
- రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు మా లక్ష్యం
- డేటా సెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం
- యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టూ ఇండియా సదస్సులో మంత్రి లోకేష్

ప్రజా భూమి ప్రతినిధి–న్యూఢిల్లీ

ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం మా ధ్యేయం, ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం (ఖూ×ఖ్రాఖీ) సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి యూఎస్ -- ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్ స్టిట్యూట్ ప్రెసిడెంట్ ఉ సీఈవో మారియా కోర్స్నిక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయి. భారత్ లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్ కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుంది.

**ఆంధ్రప్రదేశ్ లో సహజసిద్ధ ప్రయోజనాలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. మాకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేస్తున్నాం. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యం. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యం. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్ సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

**ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం**

ఈ సమావేశం ఒక అత్యంత ముఖ్యమైన సమయంలో జరుగుతోంది. ఇది కేవలం భారత దేశ ఎనర్జీ భవిష్యత్తుకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఎనర్జీ పరివర్తనకు సంబంధించినది అంశం కూడా. ఇప్పుడు ప్రపంచదేశాలు ఏకకాలంలో ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, డికార్బనైజేషన్ ఏవిధంగా సాధించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాయి. క్లైమేట్ కమిట్మెంట్లను పాటిస్తూ ఏఐ యుగాన్ని ఎలా ముందుకు నడిపించాలి, అందుకు అవసరమైన విద్యుత్ ను తక్కువ ఖర్చుతో ఎలా సిద్ధం చేసుకోవాలి, ఇంధన భద్రతను ఏవిధంగా సాధించాలనేది తక్షణ సవాళ్లుగా మారాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఎనర్జీ సెక్యూరిటీ అన్నది మాకు అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఈరోజు ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో అత్యంత కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రంగా మారింది.

**ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి**

మేము కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నాం, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం. వివిధ రకాల రెన్యువబుల్ ఎనర్జీ సాధనకు ఆ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాం. విశాఖపట్నాన్ని



ఏఐ, డేటా సెంటర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నాం. 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పోర్టు సిటీలో రాబోతున్నాయి. భవిష్యత్ తరం పరిశ్రమలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాక్ బోన్‌ను నిర్మిస్తున్నాం. ఇందులోకి భారీ పరిమాణంలో విశ్వసనీయ విద్యుత్ అవసరం ఉంటుంది. ఇందుకు సీజనల్ సాంప్రదాయ విద్యుత్ కాకుండా నాణ్యత కలిగిన కాలుష్య రహిత, తక్కువ ఖర్చుతో కూడిన రౌండ్–ది–క్లాక్ (24/7) ఇంధనం అవసరం. అందువల్లే ఎనర్జీ ప్లానింగ్ అన్నది ఆర్థిక ప్రణాళికలో కీలకాంశంగా మారింది. అందుకే ఆంధ్రప్రదేశ్ ఇంధన పరివర్తనపై దీర్ఘకాలిక, సమగ్ర దృక్పథాన్ని అవలంబిస్తోంది. మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ ఇన్‌ఫ్రా, మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్, గ్రిడ్ ఆధునీకరణ రంగాల్లో సుమారుగా ?10 లక్షల కోట్లు పెట్టుబడులను మేం లక్ష్యంగా పెట్టుకున్నాం.

**భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం**

మేం వాస్తవ దృష్టితో ఆలోచిస్తున్నాం. భవిష్యత్ తరం పారిశ్రామిక వృద్ధికి పునరుత్పాదక శక్తి ఒక్కటే సరిపోదని మేము అర్థం చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంప్యూట్ విస్తరిస్తున్న కొద్దీ, విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. కేవలం ఒక హైపర్‌స్కేల్ ఏఐ–నేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణం ఎంత విద్యుత్ వాడుతుందో అంత ఇంధనాన్ని ఉపయోగిస్తుంది. పెద్దఎత్తున డేటా సెంటర్లు, సెమికండక్టర్ పార్కులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి క్లస్టర్లు, పారిశ్రామిక కారిడార్లను ఏకీకృతంగా అభివృద్ధి చేసేటప్పుడు భారీ పరిమాణంలో విద్యుత్ అవసరమవుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా చూస్తోంది. మేము ప్రస్తుతం భారతదేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌లలో ఒకటి నిర్మిస్తున్నాం. గ్లోబల్ కంపెనీలు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐ–నేటివ్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చి, పెట్టుబడులు పెడుతున్నాయి.

**డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్**

మా దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్ చుట్టూ తయారీ ఎకోసిస్టమ్ కూడా నిర్మించాలన్నదే మా లక్ష్యం. మేం కేవలం భూమి, విద్యుత్ గురించి మాత్రమే ఆలోచించడం లేదు. ఫుల్ స్టాక్ గురించి ఆలోచిస్తున్నాం. కూలింగ్ సిస్టమ్స్‌ను స్థానికంగా తయారు చేయడం, పవర్ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్‌లను నిర్మించడం, ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీని ప్రోత్సహించడం, బ్యాటరీ స్టోరేజి సప్లయ్ చైన్స్, సెమీకండక్టర్–అనుసంధాన పరిశ్రమలను ఆకర్షించడంపై మేం దృష్టి సారించాం. ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్లు, ఆధునిక తయారీ వర్క్ ఫోర్స్ కోసం స్కిలింగ్ సంస్థలను నిర్మించడం ద్వారా ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. ప్రాజెక్టుల వారీగా కాకుండా వివిధ దశల్లో క్లస్టర్లవారీగా సామర్థ్యాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నాం. చరిత్రలో పారిశ్రామికంగా విజయం సాధించిన దేశాలు, ప్రాంతాలు విడివిడిగా పెట్టుబడులపై కాకుండా మొత్తం వాల్యూ చైన్‌లతో అభివృద్ధి చెందినవే. మేము ఏఐ, క్లీన్ ఎనర్జీ అవకాశాలను కూడా అదేవిధంగా అందిపుచ్చుకుంటున్నాం.

**న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యం**

న్యూక్లియర్ ఎనర్జీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను కూడా అదే కోణంలో చూడాలని నేను నమ్ముతున్నాను. అయితే తరచుగా న్యూక్లియర్ ఎనర్జీ గురించిన చర్చలు కేవలం ఉత్పత్తి సామర్థ్యంపైనే కేంద్రీకృతమవుతాయి. కానీ అసలైన అవకాశం అంతకంటే చాలా పెద్దది. న్యూక్లియర్ ఎనర్జీ ఒక పూర్తి పారిశ్రామిక ఎకోసిస్టమ్‌గా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ కు దీర్ఘకాలిక అవకాశం కేవలం న్యూక్లియర్ ఆస్తులను కలిగి ఉండటం మాత్రమే కాదు. పూర్తిగా న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే. ప్రధానమైన విడిభాగాలను తయారుచేయడం, ప్రత్యేకమైన ఉక్కు, ఫాబ్రికేషన్ ఎకోసిస్టమ్‌లను అభివృద్ధి చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలను నిర్మించడం వంటివాటిపై మేం దృష్టిసారిస్తాం. ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు, నిర్మాణ ప్రమాణాలను ఏర్పాటుచేయడం, భవిష్యత్ తరం న్యూక్లియర్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం, కచ్చితమైన మ్యానుఫ్యాక్చరింగ్ సప్లయ్ చైన్ లకు మద్దతు ఇవ్వడం, అత్యాధునిక న్యూక్లియర్ సాంకేతికతల చుట్టూ ఎగుమతుల పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడం మా లక్ష్యం.

**ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం**

న్యూక్లియర్ ప్రాజెక్టుల్ని కాకుండా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇది సరైన సమయమని మేం భావిస్తున్నాం. దీర్ఘకాలిక మౌలికాంశాలు ఆకర్షణీయంగా ఉండటం మాత్రమే ఇందుకు కారణం కాదు. న్యూక్లియర్ ఎనర్జీ విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్ ను అందిస్తుంది. ఇది పునరుత్పాదక శక్తికి మంచిగా తోడ్పడుతుంది. అస్థిరమైన ఫాసిల్ ఫ్యూయెల్స్ మార్కెట్లపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా ప్రాజెక్టుల జీవితకాలంలో అత్యంత పోటీదారుగా, ఊహించదగిన లెవలైజ్డ్ కాస్ట్ ఆఫ్ ఎనర్జీని (ాజూాజు) అందిస్తుంది. 20 లేదా 30 ఏళ్ల పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే డేటా సెంటర్లు, సెమీ కండక్టర్ వంటి పరిశ్రమలకు భవిష్యత్ అంచనా ముఖ్యం. తయారీరంగంలో ప్రధాన పోటీదారుగా నిలవడంలో దీర్ఘకాలిక విద్యుత్ ధరలు కీలకంగా ఉంటాయి. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థలకు ఒక వ్యూహాత్మక ప్రయోజనం చేకూరుస్తుంది. మోడరన్ న్యూక్లియర్ సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ భద్రతా ప్రమాణాలు కూడా భారీగా మెరుగుపడుతున్నాయి.

**ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్**

ప్రపంచవ్యాప్తంగా ప్యాసివ్ సేఫ్టీ సిస్టమ్స్, మాడ్యులర్ డిజైన్‌లు, డిజిటల్ మానిటరింగ్, ఆటోమేషన్, ఆపరేషనల్ రెసిలియన్స్‌లో ప్రధాన ఆవిష్కరణలు కనిపిస్తున్నాయి. న్యూక్లియర్ ఎనర్జీకి సంబంధించి ప్రపంచవ్యాప్త చర్చ శైలి మారుతోందని నేను భావిస్తున్నాను. న్యూక్లియర్ ఎనర్జీ పాత్ర లేకుండా భారీ కర్బన ఉద్గారాల తగ్గింపు, పారిశ్రామికస్థాయి విద్యుదీకరణకు విశ్వసనీయ మార్గంలేదని ప్రపంచ దేశాలు క్రమంగా గుర్తిస్తున్నాయి. ఏఐ విప్లవం ఈ గుర్తింపును మరింత వేగవంతం చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద టెక్ కంపెనీలు ఇప్పుడు నేరుగా దీర్ఘకాలిక న్యూక్లియర్ భాగస్వామ్యాలను పరిశీలిస్తున్నాయి. ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్ లో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్ లోడ్ విద్యుత్ తప్పనిసరిగా ఉండాలి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, తయారీదారులు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం వహించాలని కోరుకుంటోంది.

**యూఎస్–ఇండియా న్యూక్లియర్ అధ్యాయం**

భారత్–అమెరికా సహకారం ఇప్పటికే సాంకేతికత, రక్షణ, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో మార్పులు తెచ్చింది. ఆ వ్యూహాత్మక భాగస్వామ్యంలోని తదుపరి ప్రధాన అధ్యాయం న్యూక్లియర్ ఎనర్జీ కాగలదని నేను బలంగా నమ్ముతున్నాను. ఇది కేవలం ఎనర్జీ భాగస్వామిగా మాత్రమే కాకుండా... ఒక పారిశ్రామిక భాగస్వామ్యంగా, తయారీ భాగస్వామ్యంగా, ఆవిష్కరణల భాగస్వామ్యంగా, అభివృద్ధి భాగస్వామ్యంగా, ఏఐ యుగానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాక్ బోన్ నిర్మాణానికి తోడ్పడే భాగస్వామ్యంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం ఎనర్జీ, పారిశ్రామిక పునాదులను నిర్మిస్తున్న తరుణంలో మేము దీర్ఘకాలిక దార్శనికతను పంచుకునే గ్లోబల్ నేతలతో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం. ముందున్న అవకాశం అపారమైంది. పారదర్శకమైన అభివృద్ధిని సాధించడానికి, ఉన్నతశ్రేణి నాణ్యమైన ఉద్యోగాల్ని సృష్టించడానికి, ఎనర్జీ భద్రతను బలపరచడానికి, అత్యాధునిక తయారీకరణను వేగవంతం చేయడానికి, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ తదుపరి యుగానికి శక్తినిచ్చేందుకు ఈరోజు ఇక్కడికి వచ్చిన ప్రతినిధులకు ధన్యవాదాలు. ఇక్కడి చర్చలు దీర్ఘకాలిక భాగస్వామ్యాల నిర్మాణం దిశగా సాగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.